14-12Pg1fBPGOL 1 GNT_14-12Pg1fBPGOL.qxd 14/Dec/25 12:10 AM Page 1

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
గుంటూరు
epaper.vaartha.com WWW.VAARTHA.COM : fb.com/vaartha Digital
Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
14-12-2025 ఆదివారం సంపుటి: 31
సంచిక: 313 పేజీలు: 12 వెల: 8.00

# క్వాంటం వ్యాలీకి అడ్రస్ ఏపి



నాలెడ్జ్ ఎకానమీ, టెక్నాలజీకి కేంద్రంగా విశాఖ

అమరావతి, విశాఖతో అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధే లక్ష్యం

రైతుల సమస్యలు నేనే పరిష్కరిస్తా: సిఎం చంద్రబాబు

**విజయవాడ, డిసెంబరు 13, ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో అమరావతి,విశాఖలతో పాటు అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధి జరుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు.ఏ రంగంలోనైనా ఏపీనే ముందంజన ఉంచుతామన్నారు.రాజధాని పరిధిలో నిర్మాణాల పూర్తికి సమయాన్ని నిర్ధేశించుకుని పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సీఆర్డీఏ పనులు పనుల పురోగతిపై ఆయన అధికారిక అప్డేట్ నివేదికలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సంబంధిత నివేదికలపై అధికారులకు పలు సూచనలు చేస్తూ మార్గదర్శనం చేశారు. సీఎంఓ కార్యాలయం ద్వారా అందిన సమాచారాన్ని అనుసరించి రాజధాని నిర్మాణ పనులు ప్రారంభించిన చోట కన్స్ట్రక్షన్ కోసం మౌలిక సదుపాయాల కల్పన, ఇతర అంశాలపై సీఎం తెలుసుకున్నారు. పనులకు ఎలాంటి ఇబ్బంది కలగని విధంగా నిర్మాణాల వద్ద మౌలిక సదుపాయాలను కల్పించామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాల కారణంగా నిర్మాణ పనులకు ఏమైనా ఇబ్బందులు వచ్చినా వర్షాకాలం పూర్తి >>2




## హైదరాబాద్‌లో మెస్సీ హోరు

ఫైబర్‌నెట్ వ్యవహారం

# సిఎం చంద్రబాబుపై సిఐడి కేసు కొట్టివేత

**విజయవాడ,డిసెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** వైసీపీ అధికారంలో ఉండగా ఫైబర్‌నెట్ కార్పొరేషన్‌లో అవినీతి జరిగిందంటూ అప్పటి ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడుపై నమోదు చేసిన సీఐడీ కేసును విజయవాడ ఏసీబీ కోర్టు కొట్టివేసింది. ఈ కేసులో ఆయనతోపాటు మిగిలిన నిందితులకు క్లీన్‌చిట్ ఇచ్చింది. 2014-19 నడుమ ఫైబర్‌నెట్ కార్పొరేషన్‌లో నిబంధనలను ఉల్లంఘించి వివిధ సాఫ్ట్‌వేర్ కంపెనీలకు టెండర్లను కట్టబెట్టారని, దానివల్ల కార్పొరేషన్‌కు రూ.114 కోట్ల వరకు ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లిందని అప్పటి ఎండీ మధుసూదన్‌రెడ్డి ఫిర్యాదుతో సీఐడీ కేసు నమోదు చేసింది. నాటి ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ వేమూరి హరికృష్ణ, ఎండీ కె.సాంబశివరావు, టెర్రాసాఫ్ట్ డైరెక్టర్ తుమ్మల గోపాలకృష్ణ, చంద్ర బాబు (ఏ25), ముంబై, ఢిల్లీకి చెందిన >>2







**Vijayawada: Varun Motors: Ring Road**: 9885701729 **Enikepadu:** 9885104222, 9885706831 | **Kanuru: Santosh Auto**: 7799787967 | **Eluru:** Reddy & Reddy Motors: 9533290285 | **Bhimavaram:** Novelty Reddy & Reddy Motors: 9948424555 | **Guntur: Jayalakshmi Automotives**: 7396669031 | **Nellore: Vishnu Cars**: 7995088876 | **Bhargavi Automobiles**: 9848357778 | **Ongole: Jayalakshmi Automotives**: 9949033433.



శనివారం కడప యరముక్కపల్లి కూడలిలో వాజ్‌పేయి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

# కడపలో వాజ్‌పేయి విగ్రహావిష్కరణ

## పాల్గొన్న కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ రాష్ట్రమంత్రులు సత్యకుమార్, సవిత

**కడప కార్పొరేషన్, డిసెంబరు 13 ప్రభాతవార్త:** మాజీ ప్రధాని, భారతరత్న వాజపేయి హయాంలో వచ్చిన స్వర్ణ చతుర్భుజి హైవే ప్రాజెక్టు దేశం దశదిశ మార్చిందని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రులు సత్యకుమార్, సవిత, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిన్.మాధవ్‌లు గుర్తుచేశారు. వాజపేయి స్ఫూర్తిని యువతలో నింపేలా అటల్ సందేశ్ మోదీ సుపరిపాలన యాత్ర తలపెట్టిన భాజపా కార్యవవర్గం తలపెట్టిందన్నారు. వాజపేయి శత జయంతి సందర్భంగా ఈ నెల 11నుంచి 25 వరకు అటల్ సందేశ్ మోదీ సుపరిపాలన యాత్రలో భాగంగా కడప యరముక్కపల్లి కూడలిలో బిజెపి, టిడిపి, జనసేన మూడు పార్టీల నేతలూ కలిసి భారతరత్న వాజపేయి విగ్రహం ఆవిష్కరణ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వారు మాట్లాడారు. దేశంలో సుపరిపాలనకు వాజపేయి నాంది పలికారని, ఆయన తీసుకొచ్చిన పాలసీలు దేశాభివృద్ధికి మంచి పునాది వేశాయని గుర్తుచేశారు. అజాత శత్రువు, ప్రతి భారతీయుడు గర్వపడే నాయకత్వాన్ని దేశానికి ఇచ్చారని కొనియాడారు. ఒక సాధారణ కుటుంబలో జన్మించిన ఆయన స్వశక్తతో పదిగి దేశానికి నాయకత్వం వహించారన్నారు. 9సార్లు లోక్‌సభకు, రెండుసార్లు రాజ్యసభకు ఎన్నికయ్యారంటేనే ఆయన గొప్పతనం తెలుస్తోం దన్నారు. పద్దెనిమిదేళ్ల వయసులో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారని, 1998లో పోఖ్రాన్ 2 అణు పరీక్షలు జరిపి భారతదేశ శక్తి చాటారన్నారు. కార్గిల్ యుద్ధంలో శత్రువులకు తిరుగులేని సమా ధానం ఇచ్చారని గుర్తు చేశారు. నాడు అణు పరీక్షలైనా, నేడు సింధూర్ అయినా, నాడు చతుర్భుజి అయినా నేడు సాగరమాల అయినా అవి పన్డీయే పాలనలో విజయవంతమైన కార్యక్రమాలని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా దేశాన్ని 2047నాటిక నంబర్ వన్ చేసేందుకు పని చేస్తున్నారన్నారు. యువతరానికి మోదీ స్ఫూర్తిని స్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఆదినారాయణ రెడ్డి, మాధవి రెడ్డి, వరదల్ రెడ్డి, కృష్ణ చైతన్య రెడ్డి, ఎమ్మెల్సీ బీటెక్ రవి, బిజెపి జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, టిడిపి నాయకులు శ్రీనివాసులు రెడ్డి, రితేష్ రెడ్డి, హరి ప్రసాద్, బిజెపి నాయకులు శశిభూషణ్ రెడ్డి, బాలకృష్ణ యాదవ్, నాగోతు రమేష్ నాయుడు, వేణు వర్ధన్ రెడ్డి, దయాకర్ రెడ్డి, ప్రవీణ్ నాయుడు, చలపతి, బొమ్మన విజయ్, భాను ప్రకాష్, మనసుల సురేష్, లక్ష్మీ నారా యణ రెడ్డి, దేవానంద్, సతీష్ చంద్ర, జనసేన నేత సుంకర శ్రీనివాస్, కూటమి నేతలు బిజెపి నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# 21న రాష్ట్రమంతా పల్స్ పోలియో

## మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ,డిసెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 21న పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లూ చేశారని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకమార్ యాదవ్ నేడొక ప్రకటనలో తెలిపారు. 5 ఏళ్లలోపు పిల్లల్లందరికీ పోలియో చుక్కల్ని తప్పకుండా వేయించాలని, కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని రాష్ట్రాల్లో నిర్వహిస్తారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 54,07,663 మంది 5ఏళ్ల లోపు పిల్లలకు 38,267 బూత్ లలో పోలియో చుక్కలు వేసేందుకు ఇప్పటికే జిల్లాలకు 61,26,120 డోస్‌లను రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు పంపించారని తెలిపారు. డిసెంబరు 21 పోలియో దినం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా బూత్ స్థాయిలో పిల్లలకు పోలియో చుక్కల్ని వేస్తారని, ఆరోజు పలు కారణాలవల్ల పోలియో చుక్కలు వేసుకోలేకపోయిన పిల్లలకు తిరిగి ఈనెల 22, 23 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి 76,534 బృందాలు పరిశీలిస్తాయని మంత్రి పేర్కొన్నారు. 1704 మెడికల్ అధికారులు, 39,494 ఇతరులు (ఫార్మసిస్టులు, నర్సింగ్ విద్యార్థులు, ఇతర సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులు), 4206 మంది పర్యవేక్షకులు నేషనల్ ఇమ్యునైజేషన్ డే కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఏర్పాట్ల గురించి ఆయా జిల్లాల కలెక్టర్లకు ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ లేఖలు రాశారని మంత్రి పేర్కొన్నారు.

# క్వాంటం వ్యాలీకి అడ్రస్ ఎపి

>> అయిన తర్వాత పూర్తిస్థాయిలో పనులు పరుగులు పెట్టించాలి. ఆర్థిక పరమైన ఇబ్బందులు లేవు. ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని ఆర్థిక శాఖకు కూడా చెబుతాను." అని ముఖ్యమంత్రి చెప్పారు. రాజధాని అభివృద్ధి యాత్ర ఆరంభమైందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విభజన తర్వాత రాజధాని లేకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడింది. రాజధాని ఎక్కడ పెట్టాలనే అంశాన్ని కూడా చెప్పకుండా విభజన చేశారు. రాజధాని కోసం జాగా కూడా లేని పరిస్థితుల్లో రాష్ట్ర విభజన చేశారు. రాజధాని విషయంలో నాటి యూపీఏ ప్రభుత్వం లేనిపోని పంచాయితీ పెట్టింది. రాష్ట్రం మధ్యలో రాజధాని పెడితే అందరికీ బాగుంటుందని అమరావతిలో ఏర్పాటు చేశాం. రాజధాని నిర్మాణానికి భూమి కావాలి అన్నారు.ప్రణాళికలకు అనుగుణంగా రాజధాని నిర్మించగలరా అని అనుమానపడ్డారు. రెండవ విడుత ల్యాండ్ పూలింగ్‌కు రైతుల అండగా నిలిచారు.ఇప్పుడు ఆ పనిలో ఉన్నామన్నారు.రైతులు స్వచ్ఛంధంగా తమ సమ్మతి పత్రాలు అందిస్తున్నారు.సైబరాబాద్ నిర్మించిన అనుభవంతో అమరావతి నిర్మాణం ప్రారంభించాం. భూమి కోసం ఎదురుచూస్తున్న సమయంలో అమరావతి రైతులు నాకు దారి చూపారు. రాజధాని నిర్మాణానికి భూ సమీకరణ అనే కొత్త విధానాన్ని తెచ్చాం. సమీకరణ విధానాన్ని విజయవంతం చేసిన చరిత్ర అమరావతి రైతులదే. ప్రపంచంలో ఎక్కడా ల్యాండ్ పూలింగ్ విధానం లేదు...మనమే ఈ విధానాన్ని తెచ్చాం... సక్సెస్ చేశాం. అమరావతి పనుల రీస్టార్ట్ తర్వాత మొదటిగా సీఆర్డీఏ బిల్డింగ్ ప్రారంభమైంది.. నాకు సంతోషంగా ఉంది. సీఆర్డీఏ భవన ప్రారంభం రాజధాని అభివృద్ధి యాత్రకు ఆరంభం."అని ముఖ్యమంత్రి వివరించారు."రాజధాని కోసం అమరావతి మహిళా రైతులు రోడ్డెక్కి పోరాడారు...గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు చేశారు. రైతుల ఉద్యమానికి మద్ధతుగా నేను కూడా జోలె పట్టాను...ఉద్యమానికి అండగా నిలిచాను. కష్టాలు మరిచిపోవద్దు... రైతులు చేసిన త్యాగాల ఫలితాలను రైతులే అనుభవించాలి.. నేను దానికి పూర్తిగా కట్టుబడి ఉన్నాను. ఫేజ్1లో ల్యాండ్ పూలింగ్ కింద భూములిచ్చారు. భూములిచ్చినందుకు గత పాలకులు మిమ్మల్ని నానా హింసలు పెట్టారు. రాజధాని ఎడారి అన్నారు.అమరవాతినివేశ్యల రాజధాని అన్నారు. ఎంతో అపహాస్యం చేశారు. రైతులకు రెట్టింపు గౌరవం దక్కేలా... రెట్టింపు ఫలాలు అనుభవించేలా చేస్తాం. అమరావతి ఓ మునిసిపాలిటీగా మిగిలిపోకూడదంటే అందుకు తగ్గ మోలిక సదుపాయాలు అవసరం. అమరావతి పరిపాలనకు కేంద్ర బిందువుగా ఉంటుంది. రైతులు వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకుంటే అనుకున్న లక్ష్యాలు సాధిస్తారు. ఇంటికో పారిశ్రామికవేత్త విధానం అమరావతి నుంచే ప్రారంభం కావాలి. అమరావతి అభివృద్ధికి ఆటంకాలు లేవు. అమరావతిని క్వాంటం వ్యాలీ చేస్తున్నాం...

**ఎకనమిక్ రీజియన్ కింద విశాఖను అభివృద్ధి చేస్తున్నాం:** ఒకప్పుడు ఐటీ.. ఇప్పుడు క్వాంటం, డేటా సెంటర్, ఏఐ వంటి టెక్నో రంగాలదే హవా. అమరావతి రైతుల అభివృద్ధికి అండగా ఉంటాం... చేయూతనిస్తాం. రాజధాని అమరావతి పునాదులు చాలా బలంగా ఉన్నాయి. పవన్ కళ్యాణ్, బీజేపీలతో కలిసి ముందుకెళ్తున్నాం. విశాఖ కూడా అద్భుతంగా అభివృద్ధి అవుతోంది. దేశానికి వచ్చిన అతి పెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి విశాఖకు వస్తోంది. నా ఆలోచన ఎప్పుడూ ప్రజల కోసమే... వారి భవిష్యత్ కోసమ్మే అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. నెట్ జీరో కాన్సెప్ట్ తీసుకొచ్చి విశాఖను కాలుష్యరహిత నగరంగా తీర్చిదిద్దుతాం. ఇటీవల విశాఖ పెట్టుబడుల సదస్సులో 613 ఎంవోయూలు జరిగాయి. ఏడాదిలో ఇన్ని సంస్థలు పెట్టుబడులకు వచ్చాయంటే గేమ్ ఛేంజర్‌గా మారింది. ఇవన్నీ పూర్తయితే 23 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. నాలెడ్జ్ ఎకానమీకి విశాఖ చిరునామాగా తయారవుతుంది. అమెరికాకు సిలికాన్ వ్యాలీ ఉంది, భారత్‌కు క్వాంటం వ్యాలీ ప్రారంభమైంది. క్వాంటం వ్యాలీకి చిరునామాగా ఆంధ్రప్రదేశ్ కాబోతోంది. ప్రశాంతమైన, అందమైన ప్రాంతం విశాఖ. నాలెడ్జ్ ఎకానమీ, టెక్నాలజీకి కేంద్రంగా విశాఖ మారబోతోంది. త్వరలోనే విశాఖలో మెట్రో వస్తుంది. టెక్ తమ్మిన, నాన్‌రెల్ టెక్నాలజీస్, ఏసీఎన్ ఇన్ఫోటెక్‌కు భూమిపూజ చేసుకున్నాం. ఇమాజిన్నోవేట్ టెక్ సొల్యూషన్స్, ఫ్లూయెంట్ గ్రిడ్ లిమిటెడ్‌కు శంకుస్థాపన చేసుకున్నాం. మదర్సన్ టెక్నాలజీ, క్వార్ట్జ టెక్నోసాఫ్ట్ సంస్థలకు భూమిపూజ చేసుకున్నామన్నారు.

# మాట నిలుపుకున్న డిసిఎం పవన్

## ఉపముఖ్యమంత్రికి దీపిక కృతజ్ఞతలు



డిసిఎం పవన్, అంధుల క్రికెటర్ దీపిక

**విజయవాడ,డిసెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** అడిగిన వెంటనే తమ ఊరికి రహదారి మంజూరు చేసిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు భారత మహిళా అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ దీపిక కృతజ్ఞతలు తెలిపారు. అంధుల క్రికెట్ జట్టు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ని కలిశారు. ప్రపంచ కప్ విజేతగా నిలిచిన భారతమహిళల అంధుల క్రికెట్ జట్టును డిసెంబర్ 12వ తేదీ ఉదయం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అభినందిం చారు. ఈ సందర్భంగా శ్రీసత్యసాయి జిల్లా అమరాపురం మండలంలోని మారుమూల గ్రామం తంబాళ హట్టికిచెందిన జట్టు కెప్టెన్ దీపిక తన గ్రామం రోడ్ల పరిస్థితి వివరించి, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పవన్ కళ్యాణ్‌కు తెలిపారు. గ్రామానికి రోడ్డు వేయాలని వినతి చేశారు. అయితే, తాను వెంటనే చర్యలు తీసుకుంటానని పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దీపిక తమ గ్రామానికి రోడ్డు లేదని మట్టిరోడ్డే దిక్కని, రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. సరైన రోడ్డు లేని కారణంగా సత్యసాయి జిల్లాలోని తమ తాండా వాసులు పడుతున్న ఇబ్బందుల్ని దీపిక పవన్ దృష్టికి తెచ్చారు. స్పందించిన పవన్‌కల్యాణ్ రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారు. ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో సత్యసాయి జిల్లా అధికారులు దీపిక స్వగ్రామమైన మడకశిర నియోజకవర్గంలోని అమరాపురం మండలం హేమవతి పంచాయతీ పరిధిలోని తంబాల హట్టి తండా రోడ్డును పరిశీలించారు. హేమావతి నుంచి తంబలహెట్టి వరకూ రోడ్డు నిర్మాణానికి రూ.3.2 కోట్లు, గున్నేహళ్లి నుంచి తంబలహెట్టి వరకూ 5కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.3కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. తర్వాత కలెక్టర్ శుక్రవారం సాయంత్రానికల్లాపరిపాలనాపరమైన ఆదేశాలు జారీ చేశారు. పవన్‌కల్యాణ్ సత్వర స్పందనపై దీపిక సంతోషం వ్యక్తం అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ దీపిక ఓ వీడియో విడుదల చేశారు.

# 70 అడుగుల మెస్సీ విగ్రహం ఆవిష్కరణ



**కోల్‌కత్తా, డిసెంబరు 13:** ప్రపంచ దిగ్గజ ఆటగాడు లియోనెల్ మెస్సీ 70 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని కోల్‌కత్తా సాల్ట్‌లేక్ స్టేడియంవద్ద ఆవిష్కరించారు. భారీ భద్రత కారణంగా విగ్రహాన్ని మెస్సి వర్చువల్‌గా ప్రారంభించారు. అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ ప్లేయర్ భారత్ చేరుకున్నారు. శనివారం తెల్లవారుజామున పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో ల్యాండ్ అయ్యారు. గోట్ ఇండియా టూరులో భాగంగా మెస్సి భారత్‌కు వచ్చాడు. కోల్‌కతా ఎయిర్‌పోర్టులో స్టార్ ప్లేయర్‌కి ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా సాల్ట్ లేక్ స్టేడియంలో ఏర్పాటు చేసిన70 అడుగుల ఎత్తైన తన విగ్రహాన్ని మెస్సీ ప్రారంభించారు. బాలీవుడ్ స్టార్ షారుఖ్ ఖాన్, పశ్చిమబెంగాల్ మంత్రి సుజిత్ బోస్‌తో కలిసి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో షారుఖ్ తనయుడు అబ్రామ్ కూడా పాల్గొన్నాడు. ఈ పర్యటనలో భాగంగా దాదాపు 72 గంటల పాటు మెస్సి ఇండియాలోనే గడపనున్నారు. కోల్‌కతాతో పాటు హైదరాబాద్, ముంబై, ఢిల్లీల్లోనూ మెస్సి టూర్ చేయనున్నాడు. సోమవారం రోజు ప్రధాని నరేంద్ర మోదీని అర్జెంటీనా ప్లేయర్ మెస్సి కలవనున్నారు.

## చింతూరు- మారేడుమిల్లి ఘాట్ రోడ్డుపై ప్రభుత్వం ఆంక్షలు

**విజయవాడ,డిసెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** చింతూరు టూ మారేడుమిల్లి ఘాట్ రోడ్డు ప్రయాణంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలు విధించింది. రాత్రి వేళ ఘాట్ రోడ్డుపై ప్రయాణం చేయకుండా ఆంక్షల ఉత్తర్వులు జారీ చేశారు చింతూరు ఐటీడీఏపీవో శుభం నోక్‌వాల్. భద్రాచలం నుంచి రాత్రి వేళ ఆంధ్రప్రదేశ్ వెళ్లే వాహనదారులకు ఆంక్షలపై ప్రభుత్వం ఈ విజ్ఞప్తి చేసింది. ప్రజా భద్రత కోసం ఆంక్షలు శనివారం నుంచి అమల్లోకి రానున్నాయని ఏపీ ప్రభుత్వం తెలిపింది. అల్లూరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం నేపథ్యంలో ప్రభుత్వం ఈ ఆంక్షలు విధించింది. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఈ ప్రయాణంపై ఆంక్షలు ఉండనున్నాయి. వాహనదారులు ఈ విషయాన్ని గమనించాలని ఏపీ సర్కార్ సూచించింది. కాగా, అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం తులసి పాకలు ఘాట్ రోడ్‌లో నిన్న(శుక్రవారం) తెల్లవారు జామున బస్సు ప్రమాదం జరిగిందిజఈ ప్రమాదంలో 10 మంది మృతిచెందగా, 20మందికి తీవ్ర గాయాలయ్యాయి.

# సిఎం చంద్రబాబుపై సిఐడి కేసు కొట్టివేత

>> సాఫ్ట్‌వేర్ కంపెనీలు, వాటి ఉన్నతాధికారులను నిందితుల జాబితాలో చేర్చారు. మొత్తం 99 మందిని సాక్షులుగా పేర్కొన్నారు. కేసులో దర్యాప్తు పూర్తయినట్లు కొద్దిరోజుల క్రితం సీఐడీ అధికారులు విజయవాడ ఏసీబీ కోర్టుకు నివేదిక ఇచ్చారు. ఖజానాకు ఎలాంటి నష్టమూ వాటిల్లలేదని కేసును ఉపసంహరించుకుంటున్నట్లు అప్పటి ఎండీ మధుసూదన్‌రెడ్డి గత నెల 24న కోర్టులో అఫిడవిట్ దాఖలుచేశారు. ఇందుకు అభ్యంతరం లేదని ప్రస్తుత ఎండీ గీతాంజలి శర్మ కూడా అఫిడవిట్ ఇచ్చారు. కోర్టు తీర్పు వెలువడుతుందనే సమయానికి ఆ కార్పొరేషన్ మాజీ చైర్మన్, వైసీపీ నేత గౌతంరెడ్డి రంగప్రవేశం చేశారు. తీర్పు ఇచ్చే ముందు తన వాదనలను వినాలని ప్రొటెస్ట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనికి విచారణార్హత లేదంటూ న్యాయాధికారి పి.భాస్కరరావు పిటిషన్‌ను గురువారం కొట్టివేశారు. ఆ క్రమంలోనే ఫైబర్ నెట్ కేసును కూడా కొట్టివేస్తూ తీర్పు వెలువరించారు. రాజకీయ కుట్రతోనే ఫైబర్‌నెట్ కేసులో చంద్రబాబుపై దర్యాప్తు చేపట్టిన సీఐడి అభియోగాలను నిరూపించలేకపోయింది. అక్రమాలు జరిగలేదని స్పష్టం చేసింది. ఆయనపై అవినీతి ముద్ర వేసి గత ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న రాజకీయ కుట్రతోనే ఈ కేసు పెట్టారని తేలిపోయింది.



పుస్తక ప్రదర్శనకు సంబంధించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

## జనవరి 2 నుండి విజయవాడలో పుస్తకాల పండుగ

**విజయవాడ, డిసెంబరు 13, ప్రభాతవార్త:** జనవరి 2నుండి 12వరకు విజయవాడ ఇందిరాగాంధి స్టేడియంలో జరిగే పుస్తకాల పండుగలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని విజయవాడ బుక్‌ఫెస్టివల్‌సొసైటీ అధ్యక్షుడు టి. మనోహర్ నాయుడు కోరారు. శనివారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ 36వ పుస్తక ప్రాంగణానికి వడ్లమూడి విమలాదేవి పేరు, ప్రధాన వేదికకు డా బివి పట్టాభిరాం పేరు, విద్యార్థుల కార్యక్రమాల వేదికకు జయంత్ వాగ్లేకర్ పేరు పెడుతున్నామన్నారు. 2వ తేదీ సాయంత్రం 5 గంటలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లను ప్రారంభోత్సవానికి ఆహ్వానిస్తున్నామని, 5వ తేదీ సిద్దార్ధ కాలేజ్ నుండి పుస్తకమహోత్సవంవరకు పాదయాత్ర నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కె లక్ష్మయ్య, ఉపాధ్యక్షులు జె ప్రసాద్, సహాయ కార్యదర్శి ఎబిఎస్ సాయిరాం, ట్రెజరర్ కె రవి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.




శనివారం ఉప్పల్ స్టేడియంలో ఫుట్‌బాల్ ఆడుతున్న తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి, మెస్సీతో రాహుల్ తదితరులు

# విద్యతోపాటు విలువలూ ముఖ్యమే

## మంగళగిరి డాన్‌బోస్కో ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవంలో మంత్రి లోకేష్



**విజయవాడ,డిసెంబరు 13,ప్రభాతవార్త ప్రతినిధి:** జీవితంలో విద్య కంటే విలువలు ఎంతో ముఖ్యమని, వాటిని విద్యార్థులు ఆచరించాలని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఎర్రపాలెం గ్రామంలో ఉన్న డాన్ బాస్కో పాఠశాల స్వర్ణోత్సవాలకు ఆయన హాజరయ్యారు. పాఠశాలను స్థాపించి 50 ఏళ్ల పూర్తయిన సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. నూతనంగా ఏర్పాటు చేసిన సైన్స్ ప్రయోగశాలను ప్రారంభించారు. డాన్ బాస్కో పాఠశాల వ్యవస్థాపక చైర్మన్ చిన్నప్ప విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం లోకేశ్ మాట్లాడుతూ, తాను ఈ స్థాయిలో ఉండటానికి ఉపాధ్యాయురాలు మంజుల, అధ్యాపకులు, మంత్రి నారాయణ, ప్రొఫెసర్ రాజిరెడ్డి కారణమన్నారు. విద్యార్థులు ఏ స్థాయిలో ఉన్నా తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను ఎప్పటికీ మరువకూడదని సూచించారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన ఫాదర్లను సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. పాఠశాలల్లో విద్యార్థులకు నైపుణ్యాన్ని పెంపొందించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులోభాగంగా ఒకటి నుంచి పదో తరగతి చదివే విద్యార్థులకు 202627 విద్యా సంవత్సరంలో కిట్లను పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. రూ. 830.04 కోట్ల నిధుల విడుదలకు ప్రభుత్వం అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సర్వేపల్లి రాధా కృష్ణన్ విద్యార్థి మిత్ర పేరిట రాష్ట్ర ప్రభుత్వం కిట్లను పంపిణీ చేస్తోంది. నోట్ బుక్‌లు, బెల్ట్, షూలు, బ్యాగ్, డిక్షనరీలు, పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్‌లు, 3 జతల యూనిఫాం క్లాత్‌లను ఇవ్వనుంది. కిట్ల సేకరణ, పంపిణీ కోసం రూ. 157.20 కోట్లు నిధులను కేంద్ర ప్రభుత్వం ఇవ్వనుంది. టెండర్ల ప్రక్రియ ద్వారా కిట్ల సరఫరా, పంపిణీదారులను నిర్ణయించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రకాశం జిల్లా కొండపి మండలం జార్లపాలెం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బయాలజీ స్కూల్ అసిస్టెంట్, ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తున్న మంచికంటి వెంకటేష్‌ను మంత్రి లోకేశ్ అభినందించారు.

ఆ మాస్టారు పిల్లల వికాసానికి బడినే కేంద్రంగా చేసుకొని అమలు చేస్తున్న బోధనా పద్ధతి స్ఫూర్తిదాయకమన్నారు. పాఠశాల విరామ సమయంలో విద్యార్థులతో పుస్తకాలు చదివించడం, తెలుగులో కథలు, కవితలు, వ్యాసాలు రాయించేలా తీర్చిదిద్దడం ప్రశంసనీయమని తెలిపారు. సెలవు రోజుల్లో విద్యార్థులను సమీప ప్రాంతాలలో విజ్ఞాన యాత్రలకు తీసుకెళ్తూ ప్రకృతి, పర్యావరణం, చరిత్రపై అవగాహన కల్పించడం విద్యా వికాసానికి ఎంతో దోహదం చేస్తుందన్నారు. విద్యాలయాల్లో గ్రంథాలయాల ఆవశ్యకత వివరిస్తూ సెలవు రోజుల్లో మంచికంటి మాస్టారు చేపట్టిన ప్రచారం చాలా మంచి కార్యక్రమమని మంత్రి అభినందించారు.

## వారం - వర్జ్యం

14-12-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం
దశమి సా.6.52
హస్త ఉ.8.18, జ్యేష్ఠ కార్తె
వర్జ్యం : సా.5.15-రా.7.09
దు.సా.4.04-4.49
శుభసమయం : ఉ.6.30-7.15
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం:** సంతానము మీ అభిప్రాయము లలో ఏకీభవించడం మానసిక ప్రశాంతతను కలిగిస్తుంది.వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**వృషభం:**టెండర్స్ అతి కష్టము మీద మీకు అనుకూలముగా వస్తాయి. వివాదాస్పద వ్యవహారములు పరిష్కారమౌతాయి.

**మిథునం:**పెట్టుబడి పెట్టిన వారికి ఏకకాలంలో భాగములను ఇవ్వవలసి వస్తుంది. ప్రయాణాలు లభిస్తాయి.

**కర్కాటకం :**వ్యాపారములో అధునాతన సాంప్రదాయములను, సంస్కరణలము ప్రవేశపెడతారు. మిత్రుల కలయిక.

**సింహం:** అనేక నూతన కార్యక్రమములకు శ్రీకారం చుడతారు. ఆర్థికాభివృద్ధిని సాధిస్తారు.వస్తువులను కొనుగోలుచేస్తారు.

**కన్య :**సకుటుంబ సమేతముగా విహార యాత్రలు చేస్తారు. సంఘసేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.మిత్రుల కలయిక.

**తుల :** ఆరోగ్యమును గురించి వైద్యుని సంప్రదించవలసి వస్తుంది. బదిలీకి చేసే ప్రయత్నములు ఫలిస్తాయి. వస్త్రలాభం.

**వృశ్చికం:** మీరు చేయని పొరపాటుకు మిమ్ములను దోషులుగా నిర్ణయించే విషయములో తగు జాగ్రత్తలను పాటించండి.

**ధనుస్సు:** ఆధ్యాత్మిక కార్యక్రమములకు, శుభకార్యములకు, ధనమును బాగా ఖర్చుచేస్తారు. వస్తు కొనుగోలు.

**మకరం:**నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. నూతన భాషలను అభ్యసించే ప్రయత్నాలు చేస్తారు. బంధువుల కలయిక.

**కుంభం:** వృత్తియందు బాధ్యతలు పెరగుటంలో సమయమునకు విశ్రాంతిని తీసు కోలేరు. చర్చాగోష్ఠులలో చురుకుగా పాల్గొంటారు.

**మీనం :** వ్యాపారములో చేసిన మార్పులు, ప్రచారము సత్ఫలితములనిస్తాయి. వాహన యోగం. స్వల్ప ధనలాభం పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# హైదరాబాద్‌లో మెస్సీ హోరు

## మెస్సీ జట్టుపై తెలంగాణ సిఎం రేవంత్ జట్టు విజయం
## మ్యాచ్‌ను తిలకించిన రాహుల్ గాంధీ
## అసంఖ్యాకంగా హాజరైన అభిమానులతో ఉర్రూతలూగిన ఉప్పల్ స్టేడియం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,డిసెంబర్13:** కోట్లాది అభిమానులను సొంతం చేసుకున్న ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సికి హైదరాబాద్‌లో ఘనస్వాగతం లభించింది. హైదరాబాద్ రావడంతో అభిమానులు ఉర్రూతలూగారు. అర్జెంటీనా దిగ్గజాన్ని ప్రత్యక్షంగా చూసేందుకు ఉప్పల్ స్టేడియానికి అభిమానులు భారీగా తరలివచ్చారు. మెస్సి మెస్సి అనే నివాదాలతో ఉప్పల్ మైదానం మారుమోగింది. సాయంత్రం శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న మెస్సి బృందానికి ఘనస్వాగతం లభించింది. క్రీడాభిమానులు పలువురు కాంగ్రెస్ నేతలు అయనకు అడుగడున స్వాగతం పలికారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాభిమానులు బ్యానర్లు పట్టుకొని ఫుట్ బాల్ దిగ్గజానికి స్వాగతం పలికారు.శంషాబాద్ విమానాశ్రయం నుంచి నేరుగా మెస్సి బృందం ఫలక్‌నుమా ప్యాలెస్‌కు వెళ్లింది. అక్కడ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మెస్సికి స్వాగతం పలికారు. అనంతరం ఫలక్‌నుమా ప్యాలెస్‌లో 100 మందితో ఏర్పాటు చేసిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో మెస్సి పాల్గొన్నారు. ఇందుకు ఒక్కొక్కరు పది లక్షల వెచ్చించి మెస్సి అభిమానులు టికెట్లు బుక్ చేసుకున్నారు. అనంతరం ఫలక్‌నుమా ప్యాలెస్ నుంచి మెస్సి ఉప్పల్ స్టేడియానికి చేరుకున్నారు. తొలుత 30 మంది చిన్నారులకు మెస్సి ఫుట్‌బాల్‌ట్రైనింగ్ ఇచ్చారు. అనంతరం అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సి గోట్ టూర్ ఆఫ్ ఇండియా కొనసాగింది. గోట్ కప్ పేరుతో ఉప్పల్ స్టేడియంలో ఎగ్జిబిషన్ ఫుట్‌బాల్ మ్యాచ్ జరిగింది. ఈ సందర్భంగా మెస్సి, సీఎం రేవంత్ రెడ్డి జట్ల మధ్య ఫ్రెండ్లీ మ్యాచ్ జరిగింది. సింగరేణి ఆర్‌ఆర్ టీమ్ తరఫున మైదానంలో దిగిన రేవంత్ రెడ్డి గోల్ కొట్టారు. మెస్సి రెండో గోల్స్ రాబట్టారు. మెస్సీ జట్టుపై 3-0 గోల్స్‌తో సింగరేణి ఆర్‌ఆర్ జట్టు విజయం సాధించింది. సింగరేణి ఆర్‌ఆర్ జట్టు తరఫున సీఎం రేవంత్‌రెడ్డి ఆడారు. విన్నర్, రన్నరప్ జట్ల సభ్యులకు మెస్సీ, రేవంత్‌రెడ్డి ట్రోఫీలు అందించారు. అనంతరం మెస్సి మాట్లాడుతూ హైదరాబాద్ నగరానికి వచ్చి తెలుగు ప్రజలను కలవడం సంతోషంగా ఉంది, తెలుగు ప్రజలు చూపించిన అభిమానం నాకు ఎంతో శక్తిని ఇచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు అని పేర్కొన్నారు.ఫ్రెండ్లీ మ్యాచ్ ప్రారంభానికి ముందు ఇరు జట్లతో కలిసి మెస్సి, రేవంత్ ఫొటోలు దిగారు. గ్యాలరీలో ఉన్న అభిమానులకు మెస్సి ఫుట్‌బాల్ కిక్ చేసి గిఫ్ట్‌గా ఇచ్చారు. రాహుల్ గాంధీతో పాటు ప్రియాంకగాంధీ కుమారుడు, కుమార్తె ఫుట్‌బాల్ మ్యాచ్‌ను వీక్షించారు. మ్యాచ్ టైమ్‌లో చివరి 5 నిమిషాలు రేవంత్‌రెడ్డి మెస్సితో కలిసి ఫుట్‌బాల్ ఆడారు. మ్యాచ్ పూర్తయిన తర్వాత మెస్సి ఆల్ టైమ్ గ్రేటెస్ట్ అయిన పెనాల్టీ షూట్ అవుట్ చేశారు. మెస్సి ఉప్పల్ స్టేడియానికి రాకముందు అక్కడ ఏర్పాటు చేసిన లేజర్ షో అలరించింది. రాహుల్ సిప్లిగంజ్ మ్యూజికల్ ఈవెంట్, సింగర్ మంగ్లి బృందం పాటలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి.

**సిఎం రేవంత్ మనుమడితో మెస్సీ ఫుట్‌బాల్:** ఉప్పల్ స్టేడియంలో ఫుట్‌బాల్ స్టార్ మెస్సీ మేనియా కొనసాగింది. ఆయన మైదానం అంతా తిరిగి పిల్లతో ఫుట్‌బాల్ ఆడారు. రేవంత్ తన మనవడిని పరిచయం చేసి ఫుట్‌బాల్ ఆడించారు.అనంతరం ముగ్గురూ కలిసి ఫోటో దిగారు. ఉప్పల్ స్టేడియం అంతా మెస్సీ... మెస్సీ నినాదాలతో మారుమోగింది. మెస్సీ... మెస్సి అంటూ సిఎం రేవంత్ నినాదాలు ఉప్పల్ స్టేడియంలో మ్యాచ్ ముగిసిన అనంతరం ప్రభుత్వం తరఫున మెస్సీకి సిఎం రేవంత్‌రెడ్డి మెమొంటోను అందజేశారు. తర్వాత మైక్ అందుకున్న సిఎం రేవంత్‌రెడ్డి మెస్సీకి తెలంగాణ స్వాగతం తెలుపుతోంది. ఇప్పుడు తెలంగాణ వృద్ధి చెందుతోంది రండి, ఇందులో భాగస్వాములు కండి అని సిఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. అనంతరం సిఎం స్వయంగా మెస్సీ,మెస్సీ అంటూ నినాదాలు చేసి ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. దీంతో మెస్సీ చిరునవ్వులు చిందించారు.

**మెస్సీ కిక్... స్టేడియంపై పడ్డ బాల్:** మెస్సీ అంటే మామూలుగా ఉండదు మరి. ఉప్పల్ స్టేడియంలో సరాదాగా ఫుట్‌బాల్ ఆడి సందడి చేశారు. ఈ సందర్భంగా అభిమానుల్లోకి బంతులను పంపించారు.మెస్సీ కిక్‌కు ఓ బంతి ఏకంగా స్టేడియం రూఫ్‌పై పడి మళ్లీ అభిమానుల్లోకి చేరింది. దీంతో ఫ్యాన్స్ కేరింతలతో స్టేడియం దద్దరిల్లింది.

**మెస్సీ ఈవెంట్ గ్రాండ్ సక్సెస్**

హైదరాబాద్‌లో మెస్సీ ఈవెంట్ గ్రాండ్ సక్సెస్ అయింది. మధ్యాహ్నం కోల్‌కత్తాలో అభిమానులు స్టేడియంలో రచ్చ చేయడంతో హైదరాబాద్ పోలీసులు అలర్ట్ అయ్యారు. అధికారిక కార్యక్రమం కాకపోయినప్పటికీ ఈవెంట్ తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం కూడా పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. మెస్సీ హైదరాబాద్‌లో ల్యాండ్ అయినప్పటి నుంచి ఉప్పల్ స్టేడియంలో మ్యాచ్ ముగిసేవరకు ఎలాంటి ఘటనలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం చూసుకుంది. మెస్సీని తనివితీరా చూసిన అభిమానులు హ్యాపీగా ఫీలయ్యారు. ఉప్పల్ స్టేడియంలో ఫుట్‌బాల్ ఎగ్జిబిషన్ మ్యాచ్ ముగిసిన అనంతరం మెస్సీ తన నంబర్ 10 జెర్సీలపై సంతకంచేసి రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డికి అందించారు.

14-12Pg3exHMNWJQELR 3 GV_14-12Pg3exHMNWJQELR.qxd 14/Dec/25 12:22 AM Page 1



# రాష్ట్రంలో దేవాలయాలకు పూర్వ వైభవం

## 1058 ఆలయాల పునర్నిర్మాణానికి రూ.846 కోట్లు మంజూరు

### - కర్నూలు జోన్ పరిపాలనా కార్యాలయ భవన సముదాయాన్ని ప్రారంభించిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



**కర్నూలు, డిసెంబర్ 13 ప్రభాతవార్త ప్రతినిధి :** అభివృద్ధి, సంక్షేమం, పారిశ్రామికం, ఆధ్యాత్మికం అన్నింటిలో రాష్ట్రాన్ని అగ్రగామి గా ఉంచేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర దేవాదాయ శాఖామాత్యులు ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం కర్నూలు నగరంలో రూ. 4.25 కోట్ల వ్యయంతో నిర్మించిన దేవాదాయ శాఖ కర్నూలు జోన్ పరిపాలనా కార్యాలయ భవన సముదాయాన్ని ప్రారంభించిన రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రి వర్యులు టి.జి భరత్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర దేవాదాయ శాఖామాత్యులు మాట్లాడుతూ రాష్ట్ర దేవాదాయ శాఖ హెడ్ ఆఫీస్ విజయవాడలో గొల్లపూడిలో ఉన్నట్లు గానే, రాయలసీమకు కర్నూలులో ఈ ఆధ్యాత్మిక భవనం ఏర్పాటు చేయడం అత్యంత సంతోషదాయకం అని పేర్కొన్నారు. ఈ కార్యాలయ సముదాయంలో డిప్యూటీ కమిషనర్ కార్యాలయం తో పాటు ఇంజనీరింగ్, తదితర కార్యాలయాలు సముదాయాలు కూడా ఉన్నాయని, నూతన కార్యాలయం కర్నూలు నుండి కాణిపాకం పనిచేస్తుందన్నారు.. ఆలయాల్లో పూజా కైంకర్యాలు, ఉత్సవాలు ఆగమ శాస్త్రం ప్రకారం పూజారులు, వేద పండితుల నిర్ణయాల మేరకే జరుగుతాయన్నారు.. పురాతన ఆలయాలు, వాటి కట్టడాలను సంరక్షించే విధంగా ఈ శాఖ పని చేస్తుందని మంత్రి తెలిపారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రకటించిన హామీల్లో దేవాదాయ శాఖలో 98 శాతం నెరవేర్చాం అని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు 2372 మంది అర్చకులకు కనీస వేతనం కింద ప్రతి నెల రూ.15వేలు ఇస్తున్నామన్నారు. వేద విద్య నేర్చుకున్న 599 మంది అర్హులైన వేద పండితులకు సంభావన కింద నెలకు రూ.3 వేలు ఇవ్వడం జరుగుతోందన్నారు.. ఆలయాల్లో పని చేస్తున్న నాయీ బ్రాహ్మణులకు రూ. 25 వేల చొప్పున వేతనం ఇస్తున్న ప్రభుత్వం తమది అని మంత్రి పేర్కొన్నారు. ఆలయాల ట్రస్ట్ బోర్డులో పాలకవర్గంలో బ్రాహ్మణుల్లో ఒకరిని, నాయీ బ్రాహ్మణుల్లో ఒకరిని సభ్యులుగా చేర్చేందుకు చట్టం తెచ్చామన్నారు. రాష్ట్రంలో ఉన్న పెద్ద పెద్ద ఆలయాలన్నింటిని టూరిజం సర్క్యూట్ కింద చేర్చి, టెంపుల్ టూరిజం ను రాష్ట్రంలో పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు... డిప్యూటీ సీఎం, టూరిజం శాఖామంత్రి, దేవాదాయ శాఖ మంత్రుల ఆధ్వర్యంలో టెంపుల్ టూరిజం ను అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చారని తెలిపారు.. దేవాదాయ ఆస్తులను, ఆలయ భూములను పరిరక్షించేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో కమిటీలు ఏర్పాటుచేసి ఆస్తులను అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు రాష్ట్రంలో 21 ఆలయాల్లో ప్రతినిత్యం అన్నప్రసాద వితరణ జరుగుతోందని, 74 ఆలయాల్లో వారానికి ఒకరోజు, రెండు రోజులు అన్నప్రసాద వితరణ చేస్తున్నామని మంత్రి తెలిపారు. 11 ఆలయాల్లో రాష్ట్ర పండుగలు నిర్వహిస్తున్నామని, ఇందులో వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయాన్ని చేర్చి రాష్ట్ర పండుగలు నిర్వహిస్తున్నామన్నారు. 20 ఆలయాల్లో 3700 గోవులను సంరక్షిస్తున్నామని, మూడు వేద పాఠశాలలు, ఏడు ఆగమ పాఠశాలల్లో 400 మంది విద్యార్థులకు వేదం నేర్పిస్తున్నామని మంత్రి తెలిపారు. ధూపదీప నైవేద్యం కింద 2021 నుండి రూ.5వేల నుండి 10 వేలకు పెంచి రూ.70 కోట్లు ఖర్చు చేస్తున్నామని, 5821 ఆలయాల్లో ప్రతినెల రూ.10 వేల చొప్పున పూజారి అకౌంట్లో ఈ మొత్తాన్ని జమ చేస్తున్నామని మంత్రి వివరించారు.

# ముఖ్యమంత్రికి ప్రత్యేక ప్రతిభావంతుల కృతజ్ఞతలు

### ఉచిత ప్రయాణం ప్రకటన పట్ల సర్వత్రా హర్షం - దూర ప్రాంత సర్వీసుల్లో 50 శాతం రాయితీకి వినతి

**చంద్రగిరి, డిసెంబర్ 13 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక ప్రతిభావంతులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. బాధ్యతలకు, భరోసాలకు పేరు గాంచిన ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు ప్రజా ప్రతినిధిగా, ప్రతిపక్ష నాయకుడుగా, మంత్రిగా, ముఖ్యమంత్రిగా దూర దృష్టితో తీసుకున్న అనేక నిర్ణయాలతో నేడు తెలంగాణ ప్రజలు సుఖ సంతోషాల నడుమ ఆస్వాదిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ విభజనతో ఏర్పడిన ఆర్థిక అగాథాన్ని పూడ్చడంలో 75 ఏళ్ళ వయస్సులో ఆయన చేస్తున్న అవిరళ కృషి నేటితరానికి స్ఫూర్తిదాయకంగా, భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగానూ నిలుస్తున్నది. 2014-2019 మధ్య కాలంలో సాగించిన పాలనలోని లోపాలను, 2019-2024 మధ్యన సాగిన వైసిపి పాలనలోని దోషాలను శుద్ధి చేయడంలో ఆయన చొరవ యావత్ ప్రపంచాన్ని అబ్బురపరుస్తున్నది. అన్ని రంగాలలో రాష్ట్రాన్ని అగ్రగ్రామీగా తీర్చిదిద్దడంలో కృత నిశ్చయంతో ముందుకు వడివడిగా సాగుతున్నారు. కష్ట కాలంలో తోడుగా నిలిచిన జనసేనాని డిప్యూటీ సిఎం కొణెదెల పవన్ కళ్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించి రాష్ట్ర సమగ్రాభివృద్ధికి తీసుకుంటున్న అనేక సంస్థాగత నిర్ణయాలు ప్రజారంజకంగా నిలుస్తున్నాయి. అదేవిధంగా తనయుడుగా కాకుండా మేధోసంపత్తి కలిగిన యువకుడుగా నారా లోకేష్‌కు పాలనలో ప్రాధాన్యత కల్పించి ఆ మేరకు ఫలితాలను సాధిస్తున్న వైనం ఔరా అనిపిస్తున్నాయి. చరిత్రలో చంద్రబాబు తన వ్యక్తిగత అభిప్రాయాలకు విరుద్ధంగా మొదటిసారి 2024 ఎన్నికలలో ఉచిత పథకాలతో కూడిన సూపర్ సిక్స్ హామీల అమలు చారిత్రాత్మకంగా నిలుస్తున్నాయి.

# తిరుమల మ్యూజియంలో మోగిన అలారం

### - అప్రమత్తమైన సిబ్బంది

**తిరుమల,డిసెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** నిత్యం భక్తుల సందడిగా ఉండే తిరుమలలోని ఎస్వీమ్యూజియంలో శనివారం ఉదయం ఉన్నఫళంగా అలారం మోగడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. అక్కడే ఉన్న భక్తులు పరుగులుతీయగా స్థానికులు తిరుమల పోలీసులకు సమాచారం అందించారు. టిటిడి విజిలెన్స్ సిబ్బంది, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని హుటాహుటిన మ్యూజియంలోకి వెళ్ళారు. తీరా లోపల గమనించగా సాంకేతిక లోపంతో అలారం మోగినట్లు తెలుసుకున్నారు. మ్యూజియంలో అభివృద్ధి పనులు జరుగుతున్న సమయంలో ఇలా అలారం మోగడం, సాంకేతిక లోపం గుర్తించడంతో మ్యూజియం సిబ్బంది, భక్తులు అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

# మాజీ ఎంపి కుసుమ కృష్ణమూర్తి మృతి



**అమలాపురం, డిసెంబర్ 13 ప్రభాతవార్త.** అమలాపురం మాజీ ఎంపీ కుసుమ కృష్ణమూర్తి శనివారం కన్ను మూశారు. ఢీల్లీ నుంచి స్వగ్రా మం విలస గ్రామంలో భౌతిక కాయాన్ని సదర్శనం నిమిత్తం తీసుకువస్తున్నారు. మూడు సార్లు అమలాపురం పార్లమెంట్ సభ్యులుగా పని చేశారు. కుసుమ కృష్ణమూర్తి 1940 సెప్టెంబర్ 11న విలస గ్రామంలో జన్మించారు. ఆంధ్రా, నాగ్‌పూర్ యూనివర్సిటీలలో ఉన్నత చదువులు చదివారు. భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ తరపున కీలక నేతగా వ్యవహరించారు. అమలాపురం లోక్‌సభ నియోజకవర్గం నుండి మూడుసార్లు ఎంపీగా గెలుపొందారు. 6వ లోక్‌సభ (1977 1980), 7వ లోక్‌సభ (1980 1984), 9వ లోక్‌సభ (1989 1991) సభ్యులుగా ప్రాతినిధ్యం వహించారు. షెడ్యూల్డ్ కులాలు, తెగల సంక్షేమ కమిటీ కన్వీనర్‌గా సేవలు అందించారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) జాయింట్ సెక్రటరీగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. కాంగ్రెస్ అధిష్టానంతో సన్నిహితంగా మెలిగారు.

# తిరుపతి సమాచారం

## 16నుండి శ్రీవారికి తిరుప్పావై ప్రవచనాలు



**తిరుమల,డిసెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** వైఖానస ఆగమోక్తంగా పూజలందుకుంటున్న తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి వేకువజామున నిర్వహించే సుప్రభాతసేవ ఈనెల 16వతేదీ నుండి రద్దుచేశారు. ఆ స్థానంలో ధనుర్మాసం సందర్భంగా నెలరోజులపాటు గోదాదేవి తిరుప్పావై పాశురాలను వేదపండితులు ,ఆలయ అర్చకులు పారాయణం చేసి శ్రీవారిని మేల్కొలుపుతారు. ప్రతి ఏడాది ధనుర్మాసంలో సుప్రభాతసేవ స్థానంలో తిరుప్పావై పాశురాలు పఠించడం ఆనవాయితీ. తిరుమల, తిరుపతితో పాటు దేశవ్యాప్తంగా 233 కేంద్రాలలో తిరుప్పావై పారాయణం జరుగుతుంది. ఈనెల 16 నుండి 2026 జనవరి 14వ తేదీ వరకు పండితులు తిరుప్పావై ప్రవచనాలు చేయనున్నారు. టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఇందుకోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా తిరుపతితో పాటు ఆంధ్రప్రదేశ్ 76 కేంద్రాలు, తెలంగాణ 57కేంద్రాలు, తమిళనాడు 73, కర్ణాటక 21, పాండిచ్చేరి 4, న్యూఢిల్లీ, ఒడిశాలో ఒకొక్క కేంద్రంలో తిరుప్పావై ప్రవచనాలు నిర్వహించనున్నారు. తిరుమల శ్రీవారి ఆలయంలోనూ ధనుర్మాసంలో సుప్రభాతం బదులు తిరుప్పావై నివేదించడం విశేషం. తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరం, కెటి రోడ్డులోని శ్రీ వరదరాజస్వామివారి ఆలయంలో తిరుప్పావై ప్రవచనాలు పారాయణం చేస్తారు. 12 మంది ఆళ్వారులలో ఒకరైన గోదాదేవి ధనుర్మాసం వ్రతం చేశారు. ఈ వ్రతం చేయడం వల్ల దేశం సమృద్ధిగా, సుభిక్షంగా ఉంటుంది. ద్వాపరయుగంలో గోపికలు ఈ వ్రతాన్ని ఆచరించి శ్రీకృష్ణుని కృపకు పాత్రులయ్యారని భాగవతం దశమ స్కందంలో పేర్కొనబడింది. ఈ తిరుప్పావై సారాంశం భగవంతునికి కైంకర్యం చేయడమే. దేశవ్యాప్తంగా గల అన్ని వైష్ణవ దేవాలయాలలో తిరుప్పావై శాత్తుమొర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

## ఆ మూడురోజులు టోకెన్లు ఉంటేనే వైకుంఠ దర్శనం!

### -జనవరి 2నుండి టిక్కెట్ లేకున్నా తిరుమలకు వస్తే సర్వదర్శనం



**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** కలియుగ వైకుంఠం తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి ఈనెల 30,31తేదీలతోబాటు 2026 జనవరి 1వతేదీకి ఆన్‌లైన్‌లో దర్శన టోకెన్లు 1+3 విధానంలో కలిగిన భక్తులను మాత్రమే ఆలయంలోనికి అనుమతించేలా టిటిడి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే రోజుకు 70వేలమంది భక్తులు లెక్కన మూడురోజులకు 1.75లక్షల వరకు ఇ డిప్‌లో వైకుంఠ దర్శన టోకెన్లు జారీచేసిన విషయం తెలిసిందే. ఆ మూడురోజులు ప్రోటోకాల్ పరిధిలోని ప్రముఖులు స్వయంగా వస్తేనే తిరుమలలో వైకుంఠ దర్శనాలు కల్పిస్తారు. ఆ పదిరోజులు ఎటువంటి సిఫార్సులేఖలు అనుమతించరు. ఇదిలా ఉండగా ఈ దఫా పదిరోజుల వైకుంఠద్వార దర్శనాల్లో జనవరి 2వతేదీ నుండి 8వతేదీ వరకు ఏడురోజులు మాత్రం సామాన్యభక్తులకు దర్శన టోకన్లు ,టిక్కెట్లు లేకున్నా నేరుగా తిరుమలకు చేరుకుని వైకుంఠమ్ 2 ద్వారా దర్శనాలకు రావచ్చని టిటిడి విజ్ఞప్తి చేసింది. ఏడురోజులు సామాన్యులకు సాఫీగా ప్రశాంతంగా వైకుంఠ ద్వార దర్శనాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. పదిరోజుల వైకుంఠద్వార దర్శనాల్లో 182 గంటల్లో 164గంటలు సామాన్యభక్తులకు కేటాయించారు. 300 రూపాయలు ఎస్ఇడి రోజుకు 15వేల టిక్కెట్లు, శ్రీవాణి రోజుకు వెయ్యిటిక్కెట్లు ఆన్‌లైన్‌లో జారీచేసేశారు. భక్తులు టిటిడి సూచనలు పాటించి ప్రశాంతంగా దర్శనం చేసుకోవాల్సి ఉంటుంది. ప్రోటోకాల్ ప్రముఖులు స్వయంగా నేరుగా వస్తేనే వైకుంఠద్వార దర్శనాలు కల్పిస్తారు.

## పూర్ణాహుతితో ముగిసిన షోడశదిన సుందరకాండ పారాయణం



**తిరుమల,డిసెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచశాంతి, లోకక్షేమం ఆకాంక్షిస్తూ కలియుగవైకుంఠం తిరుమలలోని వసంతమండపంలో జరిగిన షోడశదిన సుందరకాండ పారాయణం శనివారం మహాపూర్ణాహుతితో ముగిసింది. గతనెల28వతేదీ తిరుమలలో శ్రీవారి ఆలయానికి వెనుకవైపు వసంతమండపంలో శాస్త్రోక్తంగా పారాయణం చేపట్టారు. ప్రతిరోజూ వేదపండితులు వైఖానస ఆగమోక్తంగా సుందరకాండ పారాయణం చేపట్టి భక్తిభావాన్ని చాటారు. ఇదే సమయంలో ధర్మగిరి వేదవిజ్ఞాన పీఠంలో తొలిరోజు ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ఆరాధన, అభిషేకం,హోమం ,అనుష్టానం నిర్వహించారు. చివరగా శనివారం మహాపూర్ణాహుతితో ముగింపుకుచేరుకుంది. వేదపాఠశాల ప్రిన్సిపాల్ శివసుబ్రమణ్యఅవధాని పర్యవేక్షణలో వేద పండితులు ఈ కార్యక్రమాలు నిర్వహించారు. టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

## రాష్ట్రం అన్నివిధాలా మరింత అభివృద్ధిచెందాలని వేడుకున్నా : మంత్రి సవిత



**తిరుమల,డిసెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రం అన్ని విధాలా మరింత అభజవృద్ధి చెందే దిశగా ఆశీస్సులందించాలని శ్రీవారిని వేడుకున్నట్లు రాష్ట్రమంత్రి సవిత తెలిపారు. పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు శుభాలు కలగాలని స్వామివారిని ప్రార్థించినట్లు మంత్రి తెలిపారు. శనివారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఆమె స్వామివారిని దర్శించుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## తిరుమలేశుని సన్నిధిలో తలైవా భగవంతుని ఆశీస్సులందరిపై ఉండాలి




**తిరుమల,డిసెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** సినీనటుడు, సూపర్‌స్టార్ రజనీకాంత్ తలైవా కుటుంబంతో కలసి కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆనందనిలయంలోనికి చేరుకుని వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. శేషవస్త్రంతో సత్కరించారు. ఆలయం వెలుపలకు వచ్చిన తలైవాని చూడటానికి, ఆయనతో ఫోటోలు దిగేందుకు అభిమానులు, భక్తులు ఉత్సాహం చూపారు. అందరినీ ఆప్యాయంగా పలకరించారు. తెలుగుప్రజలంతా సంతోషాలతోఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

### వారాంతం రద్దీతో కొండ కిటకిట

**తిరుమల,డిసెంబర్ 13 ప్రభాతవార్తప్రతినిధి:** వారాంతం వరుసగా రెండవశని, ఆదివారాలు సెలవులు కావడంతో తిరుమ ల భక్తజనసంద్రంగా మారింది. వెంకన్న దర్శనానికి భక్తులు శనివారం ఉదయం నుండే భారీగా చేరారు. ఉదయానికే వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌లలోని 61 కంపార్టుమెంట్లు నిండిపోయాయి. సర్వదర్శనానికి ఉదయానికి 14గంటలు సమయం పడుతుందన్నారు.

# చరిత్రలో మరపురాని నేత వాజ్‌పేయి

### ఆయన హయాంలో సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట - బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్



**నంద్యాల డిసెంబర్ 13 ప్రభాతవార్త ప్రతినిధి :** ప్రపంచదేశాలకు దీటుగా భారతదేశం అభివృద్ధికి పాటుపడి చరిత్రలో మరచిపోలేని నాయకులు భారత రత్న మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి అని అటల్ బిహారీ వాజపేయి శతజయంతి నీ పురస్కరించుకొని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పి.వి. ఎన్.మాధవ్ మాట్లాడుతూ మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి వ్యక్తిత్వం అందరిని కలుపుకొని పోయేవారు అన్నారు. పార్లమెంట్ పై దాడి జరిగిన సమయంలో 8 మంది జవాన్లు వీర మరణం పొందారన్నారు. పార్లమెంట్ పై దాడిని వాజపేయి సీరియస్ గా తీసుకుని పాకిస్తాన్ హస్తం ఉండడంతో సైన్యం కు పూర్తి ఆదేశాలు ఇచ్చి దాదాపు 100 మంది ఉగ్రవాదులను జైల్లో పెట్టించారన్నారు. మహా నాయకులు ప్రపంచంలో వెలుగులోకి తీసుకొని రావాలని ,నేటి యువతకు తెలిసే విధంగా బిజెపి, కూటమి ప్రభుత్వం ఆలోచించి రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాల్లో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తున్నారన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ వచ్చిన తర్వాత ప్రతి కార్య కర్తకు న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాలు ఆశిస్తున్న విధంగా సముచిత స్థానం అందిస్తున్నారని అన్నారు. కూటమి నాయకులం అందరం కలసి కట్టుగా రాష్ట్ర అభివృద్ధికి పాటుపడతామన్నారు. జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు ఆధ్వర్యంలో రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పి.వి. ఎన్ మాధవ్ నేతృత్వంలో చేపట్టిన కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు బిసి జనార్దన్ రెడ్డి, ఎన్.ఎం.డి. ఫరూక్, సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి విగ్రహ ప్రతిష్ఠ అనంతరం బహిరంగ సభలో మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ భారతరత్న మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి చరిత్రలో మరచిపోలేని నాయకులన్నారు. సిద్ధాంతాలు, విలువలతో రాజకీయం చేసిన మహనీయుడన్నారు. ప్రపంచదేశాలకు దీటుగా భారత దేశం అభివృద్ధి చెందాలని ఆ దిశగా కృషిచేశారన్నారు. సంక్షేమం, అభివృద్ధికి పెద్ద పీట వేశారన్నారు. రహదారులు, ఐటి, పారిశ్రామిక, విద్యా, వైద్యం, ఉద్యోగ అవకాశాలపై ప్రత్యేక దృష్టి సారించి మార్గదర్శకుడయ్యారన్నారు. వాజపేయి పాలన లో ప్రతిపాదించిన సుపరిపాలన, జాతీయ ఐక్యత, సమగ్ర అభివృద్ధి విధానాలు దేశానికి కొత్త దిశ చూపించాయన్నారు. దేశం ముందుకు ఎలా వెళ్లాలి అని దూరదృష్టిని నిర్దేశించారన్నారు. వాజపేయి ఆశయాలను ప్రధాని నరేంద్ర మోదీ కొనసాగిస్తూ పథకాలను మరింత విస్తరింప జేస్తున్నారని పేర్కొన్నారు. బిజెపి ప్రభుత్వం 11 ఏళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధితో 25 మంది ప్రజలు పేద రికం నుంచి బయటపడ్డారన్నారు. వాజపేయి, మోదీ నాయకత్వాలు అందించిన అభివృద్ధితో ప్రపంచం లో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ లో 10 వ స్థానంలో ఉన్న భారతదేశం 4 వ స్థానంకు చేరే విధంగా చేశారన్నారు.

## హస్తకళలపై యువత అభిరుచి పెంచుకోవాలి: మంత్రి సవిత



జాతీయ అవార్డు కళాకారులను సత్కరిస్తున్న మంత్రి సవిత

**శ్రీకాళహస్తి,డిసెంబర్ 13 ప్రభాతవార్త** హస్తకళలపై యువత అభిరుచి పెంచుకోవాలని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత అన్నారు. శ్రీకాళహస్తిలోని శివపార్వతి కళ్యాణ మండపంలో జాతీయ హస్తకళల వారోత్సవాలలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సభను హ్యాండీక్రాఫ్ట్ కార్పొరేషన్ చైర్మెన్ పసుపులేటి హరిప్రసాద్ పర్యవేక్షణలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ కుమార్‌లు హాజరయ్యారు. ఈ సభలో మంత్రి సవిత ద్వారా 56 మంది చేనేత హస్త కళాకారులు రూ.36లక్షలు విలువైన పని ముట్లు అందజేసారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యువత హస్తకళలపై మక్కువ పెంచుకోవాలన్నారు. సమాజంలో మన కళలను కళాకారులను కాపాడుకొనుటకు చేనేత హస్తకళ ఉత్పత్తులను వినియోగిద్దాం బహుమతులుగా అందజేద్దామని మంత్రి సవిత పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తిలో చేనేత హ్యాండ్ క్రాఫ్ట్ సంస్థల అధ్వర్యంలో జాతీయ హస్తకళ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి అవార్డు అందుకున్న పది మంది కళాకారులను సత్కరించారు. 56 మంది కళాకారులకు రూ.36లక్షల విలువైన పని ముట్లను అందించారు. శ్రీకాళ హస్తి కళలకే కాదు కళాకారులకు కూడా నిలమయన్నారు. ఇక్కడి కలంకారి కళ అంతర్జాతీయస్థాయిలో రాణించి ఇక్కడి కళాకారులు సుమారు 20 మంది వరకు జాతీయ అవార్డులను అందుకున్నట్లు మంత్రి వివరించారు. కలంకారి కళ మరింత అభివృద్ధికి 'ప్రత్యేక క్లస్టర్ ఏర్పాటు' చేస్తున్నట్లు వెల్లడించారు.




నయీ చేతన 4.0 కార్యక్రమంలో భాగంగా సి.ఆర్.డి.ఎ స్కిల్ హబ్ భవనంలో జెండర్ రిసోర్స్ సెంటర్ (జీఆర్‌సీ) కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని, హోంమంత్రి వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్

# మహిళల్లో మౌనం బలహీనత కాకూడదు

### ప్రతి ముగ్గురిలో ఒక మహిళ వివక్షకు గురి అవుతున్నట్లు అంచనా!

### - కేంద్రమంత్రి డాక్టర్‌పెమ్మసాని చంద్రశేఖర్

**విజయవాడ డిసెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** మహిళల్లో మౌనం బలహీనత కాకూడదని కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డా.పెమ్మసాని చంద్ర శేఖర్ అన్నారు. లింగ సమానత్వ జాతీయ ప్రచార కార్యక్రమం నయీ చేతన 4.0 కార్యక్రమంను కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో డి.ఆర్.డి.ఏ సౌజన్యంతో తుళ్ళూరులో శనివారం నిర్వహించారు. నయీ చేతన 4.0 కార్యక్రమంలో భాగంగా సి.ఆర్.డి.ఎ స్కిల్ హబ్ భవనంలో జెండర్ రిసోర్స్ సెంటర్ (జీఆర్‌సీ) ను కేంద్రమంత్రి పెమ్మసాని, హోంమంత్రి వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. స్థానిక ప్రైవేటు పాఠశాలలో జరిగిన సభను, ప్రదర్శన శాలలను మంత్రులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి డా.పెమ్మసాని చంద్ర శేఖర్ మాట్లాడుతూ వివక్ష తగ్గించడం నయీ చేతన 4.0 కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. సమాజంలో బాల్య వివాహాలు, గృహ హింస, లింగ వివక్ష వంటి రుగ్మతలు సమాజంలో జరుగుతున్నాయన్నారు. దేశంలో 4.50 లక్షల గృహ హింస కేసులు నమోదు అయ్యాయని గణాంకాలు తెలియజేస్తున్నాయని తెలిపారు. ప్రతి ముగ్గురిలో ఒక మహిళ వివక్షతకు గురి అవుతున్నట్లు అంచనా ఉన్నప్పటికీ అన్ని కేసులు నమోదు కావడం లేదని చెప్పారు. ఇందుకు పరువు ప్రతిష్ట కోసం ఆలోచించడం కారణమని అన్నారు. అందుకే నయీ చేతన కార్యక్రమాన్ని 2021 సంవత్సరంలో శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడం కార్యక్రమం ఉద్దేశ్యం అన్నారు. సురక్షి త ఆశ్రయం కల్పించుటకు రూ.5 లక్షలతో ఆశ్రయాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆశ్రయం నిర్వహణకు ఎస్.హెచ్.జి సభ్యులకు అవగాహన కల్పిస్తారని చెప్పారు. రాష్ట్రంలో రెండు వందల కేంద్రాలు మంజూరు చేశామని, వంద కేంద్రాలు ప్రారంభం అయ్యాయని తెలిపారు. తల్లిదండ్రులు, తాతలు పిల్లలలో చైతన్యం తీసుకురావాలని కోరారు. ఎక్కడ వివక్ష జరిగినా ఇటువంటి కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. రాష్ట్రంలో 8 లక్షల స్వయం సహాయక సంఘాలు ఉండగా వాటిలో 80 లక్షల మంది సభ్యులు ఉన్నారని చెప్పారు. దేశంలో 8 కోట్ల సంఘాలు ఉన్నాయని తెలిపారు.

# ప్రజల మనోభావాలను కూటమి గుర్తించాలి రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలి

### ఆటో డ్రైవర్ల నిరాహార దీక్షలు.. ర్యాలీలు..

**రాజంపేట, డిసెంబర్13 ప్రభాతవార్త** ఎంతో ఘన చరిత్ర కలిగి, జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు అన్ని అవకాశాలు ఉన్న రాజంపేటను వెంటనే జిల్లా కేంద్రం చేసి ప్రజల మనోభావాలను గుర్తించాలని వివిధ వర్గాల ప్రజాప్రతినిధులు, ఆటో డ్రైవర్లు రియల్ ఎస్టేట్ వ్యాపారులు డిమాండ్ చేశారు. శనివారం నాలుగో రోజు నిరాహార దీక్షలలోనెట్టెం శంకర్, మన్నూరు సురేష్ రెడ్డి, శేషయ్య, చంద్రబాబు, వాసు, మురళి ,నరసింహులు తో పాటు కూటమినేతలు పాల్గొన్నారు. మరోవైపు ఆటో డ్రైవర్లు రాయంపేట జిల్లా కేంద్రం ప్రకటించాలని కోరుతూ పాత బస్టాండ్ లో ఆందోళన చేశారు. ధర్నా చేశారు. అనంతరం పెద్ద ఎత్తున జూనియర్ కళాశాల వరకు ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు. రాయచోటి వద్దు, రాజంపేట ముద్దు అంటూ నినాదాలు చేశారు. రాజంపేట జిల్లా కేంద్రం ప్రకటించినంతవరకు ఆందోళన విరమించేది లేదని నినాదాలు చేశారు. నిరాహార దీక్షలో పాల్గొన్న నేతలు మాట్లాడుతూ రాజంపేటను జిల్లా కేంద్రం చేయకపోతే చరిత్ర క్షమించదన్నారు.

దేశంలో కాదేదీ కల్తీ(నకిలీ)కి అనర్హం అనే విధంగా ఎంతో పవిత్రంగా విశ్వాసంతో భావించే వేదపండితుల వేదాశీర్వచనం సత్కారంలో శాలువాల్లోనూ నకిలీ పట్టువు వాడి పాలిస్టర్‌తో తయారైన శాలువాలతో కుంభకోణం జరిగిందనే దుమారం టిటిడిలో మరింతగా కలవరపెట్టింది. శ్రీవారి దర్శనానంతరం వివిధ పీఠం, వివిధసేవలతోపాటు దాతలకు, ఆర్జితసేవల భక్తులను ఆలయ మర్యాదలతో సత్కరించే సంప్రదాయం కొనసాగుతోంది. ఇలా రంగనాయకుల మండపంలో వేదాశీర్వచనంపొందే భక్తులకు అందజేసేపట్టుశాలువాలు(శేషవస్త్రం) టెండర్లలో నకిలీలు చోటుచేసుకుని భారీ కుంభకోణం జరిగిందనేది టిటిడి ధర్మకర్తలమండలి తాజాగా బయటపెట్టిన గుట్టు. వేదాశీర్వచనం కోసం అవసరమైన పట్టుశాలువాలు సరఫరా చేయాల్సిన బిడ్డరుదారులు ఆ స్థానంలో పాలిస్టర్‌శాలువాలు సరఫరాచేశారని,పైగా ధర కూడా విపరీతంగా కోట్‌చేసి మూడింతలు అధికంగా టిటిడి సొమ్మును దేబ్బించుకున్నారనే స్వయంగా ఛైర్మన్ ఏసిబితోవిచారణ చేయించాలని చెప్పడం ఇందుకుబలాన్ని చేకూర్చింది. స్వచ్ఛమైనపట్టు శాలువాలు 'ఓంనమోవేంకటేశ శాయ నామంతోశంఖుచక్రం తిరునామం' ముద్రించిన వాటిని అందజేస్తారు. అయితే గత ఆరేడుసంవత్సరాలుగా సరఫరా అయిన పట్టుశాలువాలు నకిలీవని, టిటిడి విజిలెన్స్ గుర్తించిన స్కామ్. రూ.400 విలువ చేసే టెండర్ దారుడు మూడురెట్లు అధికంగా ధర కోట్‌చేసి టిటిడికి సరఫరాచేసి మోసానికి పాల్పడినట్టు టిటిడి అధికారులు గుర్తించారు. ఈశాలువాలను బెంగుళూరు, ధర్మవరంలోని సిల్క్‌బోర్డు పరిశోధనశాలలకు పంపించి తనిఖీ చేయించగా పాలిస్టర్‌వేనని నివేదికలు అందడంతో శేషవస్త్రాల అవినీతిపై ఏసిబితో విచారణకు టిటిడి ధర్మకర్తలమండలి సిద్ధమైంది.దేవుని చెంత భక్తిభావంతో, సేవా నిరతితో సేవచేయాల్సిన ప్రతి అంశంలోనూ అవినీతి నీడలుకమ్ముకోవడం మాత్రం శ్రీవారి భక్తులను విస్మయానికి గురిచేస్తోంది.

# ధార్మిక సంస్థలో విస్తరిస్తున్న అవినీతి జాడలు!

**పావులూరు పద్మనాభమ్**

ఆధ్యాత్మికత..పవిత్రత ఉట్టిపడే తిరుమల తిరుపతి దేవస్థానంలో అడుగడుగునా భక్తిభావంతో,నిజాయితీతో మెలగాల్సిన అధికారులు, ఉద్యోగుల తీరు అవినీతిమయంలో చిక్కుకుపోవడం ఇప్పుడు ప్రపంచంలోని కోట్లాది మంది భక్తులను నివ్వెరపరుస్తోంది. నిత్యం లక్షలమందివరకు వస్తున్న భక్తుల విశ్వాసంతో టిటిడి ఆదాయం పరిగణిస్తారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో వరుసగా అవినీతి మబ్బులు కమ్మేస్తున్నాయి. కోట్లాదిమంది భక్తులు ఎంతో విశ్వాసంతో నమ్ముకొన్న కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి పవిత్రతను భంగం కలిగించేలా ఈ దుమారం ఇటీవల కాలంలో వరుసగా పలు విషయాల్లో వెలుగుచూస్తున్న అవినీతి అక్రమాలు భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా తయారవుతున్నాయి. 'ఏడుకొండలవాడా గోవిందా..ఆపదమొక్కులవాడా గోవిందా' నామస్మరణతో భక్తితో మొక్కుబడుల రూపంలో హుండీ సమర్పించుకునే కానుకల నుండి తమ కష్టాలు తీరితే ముడుపు చెల్లించుకుంటామని వేసే తులాభారం చివరకు అఖిలాండ కోటిబ్రహ్మాండనాయకుని దివ్యమంగళ రూపం దర్శనానంతరం పులకించి పోయే భక్తలోకం ఎంతో ప్రీతిపాత్రంగా స్వీకరించే లడ్డూప్రసాదాలు కూడా అవినీతితో కల్తీమయమై కలకలం రేపడం వరకు తిరుమల తిరుపతి దేవస్థానాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వివరాల ఆనందనిలయంలోని కలియుగ వైకుంఠవాసున్ని క్షణకాలం దర్శనం చేసుకుని వేదపండితుల వేదాశీర్వచనం అందుకోవడంలో ప్రముఖులు, దాతలు, ఆర్జిత సేవల భక్తులు స్వీకరించే శేషవస్త్రం (పట్టుతోనేసిన దుప్పట) 'శంఖుచక్రనామంతో ఓమ్‌నమోవేంకటేశాయ'అని తయారైన వస్త్రం కూడా నకిలీది సరఫరా కావడం భక్తుల మనోభావాల్ని దెబ్బతీసేలా అవినీతిమయంగా మారింది. ఇలా వరుసగా వెలుగుచూస్తున్న అవినీతి నీడలతో తిరుమలతిరుపతిదేవస్థానం పవిత్రత మసకబారేలా మారిందనడంలో ఎలాంటి సందేహం లేదు. తిరుమల లడ్డూలకు 310 ఏళ్ల సుదీర్ఘచరిత్ర ఉంది. గోవిందుని ప్రసాదాల్లో లడ్డూకు ఉన్న ప్రాధాన్యత ఎంతో విశిష్టత కలిగింది. దేశవిదేశాల నుండి ప్రతిరోజూ తిరుమల కొండకు వచ్చే భక్తులు స్వామివారి దివ్యమంగళరూపం దర్శనం ముగించుకున్న తరువాత తమ జన్మధన్యమైందనిభావించి ప్రసాదంగా లడ్డూలను తమవెంట పవిత్రంగా తీసుకెళతారు. అంతటి పవిత్రంగా భక్తకోటి భావించే లడ్డూప్రసాదాల తయారీ కల్తీనెయ్యి సరఫరా జరిగిందనే ఉదంతంతో టిటిడిలో దుమారం మొదలైంది. కొన్ని దశాబ్దాలకాలం నుండి 2019వ సంవత్సరంవరకు తిరుమలలోని పోటులో లడ్డూల తయారీ



సమయంలో కొండంతా నెయ్యిసువాసనలు గుబాళించేవి. 2019వ సంవత్సరం నుండి 2024వరకు ఆలయ బూందీ పోటులో రోజుకు సరాసరి మూడులక్షల నుండి 3.50లక్షల వరకు లడ్డూలు తయారయ్యేవి. ఇందుకుగాను రోజుకు 150 కిలోల వరకు ఆవునెయ్యి వినియోగించేవారు.2019- 2024 మధ్య కాలంలో పలు డెయిరీలకు టిటిడి ధర్మకర్తల మండలి, టిటిడి అధికారులు నెయ్యిసరఫరాను అప్పగించారు.స్వచ్ఛమైన ఆవునెయ్యి సరఫరా చేయాల్సిన డెయిరీలు పలు రకాలుగా కల్తీచేయడంతోనే లడ్డూల నాణ్యత,రుచి లేదనేది వెలుగుచూసిన మొదటి అవినీతి. కల్తీనెయ్యి దుమారంపై 2024 జులైలో రాష్ట్రప్రభుత్వం ఈ ఉదంతంపై విచారణకు ఆదేశించింది. అప్పట్లో గత ఐదేళ్ల అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం హయాంలోని టిటిడి ధర్మకర్తలమండలి పెద్దలు, టిటిడి ఉన్నతాధికారి,కొనుగోలు కమిటీ ఏమేరకు నిబంధనలు పాటించి నెయ్యిసరఫరాకు టెండర్లు పిలిచారు, టెండర్లలో పాల్గొన్న ఐదుసంస్థలు, కాంట్రాక్టర్ల వివరాలపై నియామక మైన సిట్ అధికారులు సమాచారం రాబట్టారు. కీలక వివరాలతో పలు డెయిరీల నిర్వాహకులను, చివరకు నెయ్యి ట్యాంకర్ డ్రైవర్లను కూడా సిట్ లోతుగా విచారణ చేసింది.ఆవునెయ్యి సరఫరా చేయడానికి టెండర్లు అర్హత సాధించిన డెయిరీ స్థానంలో మరికొన్ని డెయిరీలు కలవడం, నిర్దేశిత కాంట్రాక్టర్ల స్థానంలో ఇతరులు సరఫరా చేశారనేది సిట్ కీలకంగా సేకరించిన సమాచారం.2024జులై నెలలోనే మూడుసార్లు కల్తీనెయ్యి సరఫరా జరిగిందని గుర్తించిన టిటిడి ఆ ట్యాంకర్లను తిరుమలలో నెయ్యి తీసుకోకుండా వెనక్కుపంపింది. ఆ ట్యాంకర్లలో నెయ్యి కల్తీ జరిగిందనేది ముందుగానే తేల్చేసిన టిటిడి అధికారులు తిప్పిపంపడం సంచలనంగా మారింది.అయితే కల్తీనెయ్యి అవినీతిపై 2024 సెప్టెంబర్ 20న తిరుపతిలో తూర్పు పోలీసులకు టిటిడి ఫిర్యాదుతో మరింతగా బలాన్ని చేకూర్చింది. లడ్డూల తయారీలో కల్తీనెయ్యి వాడారనే అంశంపై గుజరాత్ లోని ఎన్‌డిడిబి ల్యాబ్ పరీక్షల నివేదికల ఆధారంగా జంతువుల కొవ్వునూనె కలిపినట్లుగా నిర్ధారణకు వచ్చారు. నెయ్యి నాణ్యత లేదని దీనివల్లే లడ్డూలు రుచిగా లేవనే సమాచారం పోటు కార్మికుల వాదనలతో ఏకీభవించాల్సి వచ్చింది.గతఐదేళ్ల వైసిపి ప్రభుత్వంలో లడ్డూల నాణ్యత లేదనే విషయంపై పెద్ద సంఖ్యలో భక్తుల నుండి ఫిర్యాదులు,విమర్శలు వచ్చాయి. ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి భక్తులు హుండీకి కానుకలుగా చెల్లించుకునే కానుకల పరకామణిలో లెక్కిస్తారు. రోజువారీగా సరాసరి 3.50కోట్లరూపాయల నుండి 4కోట్లరూపాయలు ఆదాయం లభిస్తుంది. ఈ లెక్కింపుల్లో గుమస్తాగా ఉన్న సివి రవికుమార్ అనే వ్యక్తి 2023 ఏప్రిల్29న, 920 అమెరికన్ డాలర్లు రూ. 70లక్షలువిలువైనవి చోరీ చేయడం ఇప్పటికి సంచలనం రేపుతోంది. ఈ వ్యవహారం కాక పుట్టించింది. 1980వ సంవత్సరం నుండి తిరుమల పెద్దజీయర్ మఠంలో సివి రవికుమార్ గుమస్తాగా పనిచేస్తూ పరకామణి విధులు చూస్తున్నారు. ఆయన 2023 ఏప్రిల్‌లో డాలర్లు చోరీ చేయడం ,విజిలెన్స్ ఏవిఎస్ఓ పట్టుకోవడం తదనంతరం తిరుమల వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేయడం జరిగింది. ఈ కేసులో చట్టపరంగా వ్యవహరించాల్సిన పోలీసులు ,టిటిడి అధికారులు ఏకంగా అతనిని కేసులో నుండి తప్పించేలా న్యాయస్థానంలో ఒప్పించి కేసు ఉపసంహరణ, ఆపై లోక్ అదాలత్‌లో మధ్యవర్తిత్వం ద్వారా రాజీచేసుకోవడం దుమారాన్ని రేపింది. అయితే ఈ కేసు లోక్‌అదాలత్ ద్వారా రాజీ చెల్లదనేది హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ కేసులో అతని నుండి శ్రీవారికానుకల క్రింద 2023లో గత టిటిడి బోర్డు 14కోట్ల రూపాయలు విలువైన గిఫ్ట్ డీడ్‌గా ఆస్తులు స్వీకరించడం సంచలనమే.వీటి విలువ మార్కెట్‌లో 40కోట్ల రూపాయల మేర ఉంటుందనేది సిఐడి వెల్లడించిన విషయం. ఆదాయపుపన్ను శాఖ (ఐటి), ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ (ఇడి)కూడా కేసు వివరాల సమాచారాన్ని ఇవ్వాలని సూచించింది. వడ్డీకాసుల వెంకటేశ్వర స్వామికి భక్తులు ప్రియంగా చెల్లించే తులాభారం మొక్కుల కానుకలు కూడా పక్కదారి పడ్డాయంటూ తిరుమల తిరుపతి దేవస్థానంలో సంచలనంగా మారింది. చిన్నపిల్లల నుండి వయోవృద్ధుల వరకు తమ కోరికలు నెరవేరిన వెంటనే తులాభారం త్రాసులో ఓవైపు భక్తుడు,మరో వైపు నాణేలు, చక్కెర, బెల్లం,కలకండ, డ్రై ఫ్రూట్స్,బియ్యం ఇలా ఏదైనా వారి బరువుకు తగ్గట్లు తూకంలో తీర్చుకుంటారు. అంతే బరువుకు సరిపడే నగదును టిటిడికి అందిస్తారు.అక్కడ రెండు, ఐదురూపాయలు నాణేలు ఉంచి బరువు తూకం వేస్తారు. భక్తుడు ఎంత బరువుంటే అంత సొమ్ము నగదు రూపంలో అక్కడ సిబ్బందికి అప్పగించి మొక్కులు తీర్చుకోవడం జరుగుతుంది.రోజుకు సరాసరి శ్రీవారిని 70వేల మంది వరకు భక్తులు దర్శనం చేసుకొంటుండగా 30వేలమంది భక్తులు తలనీలాలు సమర్పిస్తుంటారు.ఆలయం లోపల మహద్వారం దాటగానే ధ్వజస్తంభానికి కుడి పక్కన తులాభారం ఉంది. తులాభారంద్వారా రోజువారీగా ఐదులక్షల రూపాయల నుండి10లక్షల రూపాయల వరకు భక్తుల కానుకలతో ఆదాయం సమకూరుతుందనేది టిటిడి వర్గాల సమాచారం. తులాభారం త్రాసులోనూ మ్యాజిక్ చేశారనే విమర్శలకు తోడు రోజుకు వందమంది వరకు తులాభారం వేసిన భక్తుల సంఖ్య కూడా తగ్గించి లెక్కలు చూపి నిధులు స్వాహా చేశారనేది ప్రధాన ఆరోపణ. ఇక్కడ జమ అయిన మొత్తాన్ని ఏరోజుకారోజు దేవుని ఆదాయం లెక్కల్లో చూపాలి. ●

తమిళనాడు

# గెలుపు దారి లోకి!

**ఎ.వి.వి ప్రసాద్**

చలి కాలంలోనూ తమిళ రాజకీయాలు వేడెక్కి చుర్రుమంటున్నాయి. టివికె పార్టీని నడిపిస్తున్న ప్రముఖ నటుడు విజయ్ గతవారం తన రాజకీయ కార్యాచరణను ముమ్మరం చేయడంతో ఇతర పార్టీలు కూడా 'చురుకు'గా కదలడం మొదలు పెట్టాయి. ముఖ్యంగా కాంగ్రెస్,అన్నాడిఎంకె పార్టీలకు విజయ్ టివికె పార్టీ ప్రస్తుతం ఒక ఆశారేఖలా కనిపిస్తోంది. ఆ రెండు పార్టీలతో పాటు బిజెపి కూడా ఈసారి సీట్లు, ఓట్ల శాతం పెంచుకునే దిశలో పావులు కదుపుతోంది. ఈ పార్టీలన్నీ డిఎంకెకు వ్యతిరేకంగా విజయ్ టివికెతో చేతులు కలిపే ప్రయత్నాలు ఆరంభించాయి. అన్నాడిఎంకె నుంచి బయటకు వచ్చిన సీనియర్ నేత కెఎ సెంగొట్టియన్ పది రోజుల క్రితం టివికెలో చేరడంతో మరి కొందరు సీనియర్ నేతల చూపు కూడా ఇప్పుడు టివికె పైనే పడుతోంది.ఆయా పార్టీలలోని 'అసమ్మతి'నేతలు, తగిన ప్రాధాన్యం లభించని నేతలు టివికెలో చేరడానికి ఉత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారు. తాము ఎవరితోనూ చేతులు కలపబోమనీ, అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామనీ తొలుత ప్రకటించిన విజయ్ తన వైఖరిని కొంత సడలించినట్లు కనిపించడం కూడా ఇతర పార్టీలుఆయన వైపు చూడడానికి మరో కారణం.ఎన్నికల పొత్తులపై నిర్ణయం తీసుకునే అధికారం విజయ్‌కి అప్పగిస్తూ గతవారం టివికె నేతలు తీర్మానించడంతో ఇక ఆ దిశగా పార్టీ కార్యకలాపాలు సాగే సూచనలు కనిపిస్తున్నాయి. పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థి విజయ్ మాత్రమేననీ, ముందు ముందు పార్టీలోకి ఎటువంటి సీనియర్లు వచ్చినా ఈ నిర్ణయంలో మార్పు ఉండదనీ నాయకత్వం స్పష్టం చేసింది. అలాగే ఇతర పార్టీలతో పొత్తుల విషయం పరిశీలించేందుకు ఒకప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు కూడా కార్యవర్గ సమావేశం ప్రకటించింది.డిఎంకె అవినీతి పాలనను అంతమొందించడానికి ఇతర పార్టీలు టివికెతో చేతులు కలపవలసిన అవసరం ఉన్నదనీ, అటువంటి ప్రయత్నాలను తాము స్వాగతిస్తామనీ సమావేశం స్పష్టం చేసింది. పార్టీ ఆమోదించిన నాలుగు తీర్మానాలలో మేనిఫెస్టో కమిటీ ఏర్పాటు కూడా ఉంది.ప్రచార వ్యూహం రూపొందించడానికికూడా త్వరలో ఒక ప్రత్యేక కమిటీ ఏర్పాటు కానుంది.

గత యేడాది పార్టీ ఆవిర్భవించిన తర్వాత ఇటువంటి కీలకమైన తీర్మానాలు ఆమోదించడం ఇదే మొదటిసారి.సెంగొట్టియన్ టివికెలో చేరినతర్వాత విజయ్ ఆలోచనా ధోరణిలో కూడా చాలా మార్పు వచ్చినట్లు కనిపిస్తోంది. ఒంటరిగానే బరిలోకి దిగాలనే నిర్ణయం నుంచి భావసారూప్యత గలవారినందరినీ కలుపుకొని వెళ్లాలనే అభిప్రాయానికి ఆయన రావడమే అందుకు ఉదాహరణ. పళనిసామి నాయకత్వంలో ఉన్న అన్నాడిఎంకెలో 'అసంతృప్త నేతలు' అధికంగానే ఉన్నారు.వచ్చే సంవత్సరం ఆరంభంలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయేలో భాగంగా బరిలోకి దిగాలనేఅన్నాడిఎంకె భావిస్తోంది. అయితే ఆ పార్టీ చీలిక వర్గం నాయకుడైన మాజీముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం విజయ్



విజయ్

పార్టీతో జత కట్టడానికి ప్రయత్నిస్తుండడంతో ముందు ముందు అన్నాడిఎంకె రాజకీయాలు మరింత ఆసక్తికరం కానున్నాయి.డిఎంకె, అన్నాడిఎంకె లోని అసమ్మతి నేతలు తమ పార్టీలోకి వస్తే టివికె విజయం నల్లేరుపై నడకలా సాగుతుందనే అభిప్రాయంతో విజయ్ ఉన్నట్లుగా కనిపిస్తోంది. కరూర్ తొక్కిసలాట ఘటన తర్వాత విజయ్ తన వ్యూహాన్ని మార్చుకొన్నట్లుగా చెబుతున్నారు. డిఎంకె వ్యతిరేక ఓట్లు చీలకుండా తన గుప్పెట్లో ఉండడానికి అవసరమైన అన్ని ప్రయత్నాలను ఆయన సాగిస్తున్నట్లు కనిపిస్తోంది. చాలా కాలం నుంచి తమిళనాడులో కాంగ్రెస్ కు ఆక్సిజన్‌అంది స్తున్నది డిఎంకె పార్టీయే అయినా అధికారంలో భాగస్వామ్యం లేకపోవడంతో ఆ పార్టీలోని కొందరు సీనియర్లు చాలా అసంతృప్తితో కనిపిస్తున్నారు. జికె మూపనార్ తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ చాలా బలహీన పడడంతో పూర్తిగా డిఎంకె దయాదాక్షిణ్యాలపైనే ఎన్నికల్లో నెట్టుకు వస్తోంది. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తుతో అధికారంచేపట్టిన స్టాలిన్ ఆ పార్టీకి ఎటువంటి మంత్రి పదవులు ఇవ్వకపోవడం పలువురు సీనియర్లలో అసంతృప్తిని పెంచింది. అటువంటి వారందరికీ ఇప్పుడు టివికె పార్టీ ఆపద్బాంధవుడులా కనిపిస్తోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమకు 40సీట్లు కేటాయించాలని టిఎన్ సిసి అధ్యక్షుడు సెల్వపెరుందగై రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జి గిరీష్ శోడంకర్ గతవారం స్టాలిన్‌ను కలిసి కోరారు. అందుకు స్టాలిన్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో వారు విజయ్‌తో సంప్రదింపులు మొదలుపెట్టినట్లుగా తెలుస్తోంది.అయితే టివికె, కాంగ్రెస్‌మధ్య పొత్తు కుదిరినా విజయ్ 40 సీట్లు ఇస్తారా? అన్నది సందేహమే. 2021 ఎన్నికల్లో కాంగ్రెస్ కు 18సీట్లు మాత్రమే వచ్చాయి. బిజెపికి అంతకంటే తక్కువగా 4 సీట్లు మాత్రమే వచ్చాయి. ఈ పరిస్థితిలో అటు కాంగ్రెస్‌తో కలిసినా, ఇటు బిజెపితో కలిసినా టివికెకు పెద్దగా ప్రయోజనం ఉండదనే పరిశీలకులు భావిస్తున్నారు.ఇక అన్నాడిఎంకెలోని చీలిక వర్గాలలో ముఖ్యంగా దినకరన్ కు ఓట్లు ఆకర్షించగల శక్తి ఎక్కువే ఉంది. ప్రస్తుతం ఆయన కూడా విజయ్ వైపు చూస్తున్నట్లుగా చెబుతున్నారు. సెంగొట్టియన్ టివికెలో చేరిన తర్వాత అన్నాడిఎంకె చీలిక వర్గాల నుంచి చాలామంది సీనియర్లు వచ్చి చేరవచ్చనే అభిప్రాయం వినిపిస్తోంది. అయితే ఎవరెవర్ని చేర్చుకోవాలో, ఎవరెవరు వద్దో విజయ్ జాగ్రత్తగా పరిశీంచవలసి ఉంది. ముందు ముందు వలసలు మరింత ఎక్కువగా ఉండవచ్చు. ఏదిఏమైనా వచ్చే ఎన్నికల్లో డిఎంకె కూటమిని ఎదుర్కొనేందుకు అన్నాడిఎంకె బిజెపి కూటమి, విజయ్ కూటమి ప్రధానంగా కృషి చేస్తాయి. ఈత్రిముఖ పోటీలో డిఎంకె తిరిగి అధికారంలోకివస్తుందా, లేక ప్రత్యర్థి పక్షాలు బలపడతాయా అన్నది కొద్ది నెలల్లోనే తెలుస్తుంది. అన్నాడిఎంకెలో తిరిగి ఐక్యత సాధ్యమైతే ఎన్నికల రణం మరింత ఆసక్తి దాయకంగా కనిపిస్తుంది. ●

బల్గేరియా

# ఐరోపాకూ 'జెన్‌జడ్' ఉద్యమం!

**గన్ని మోహన్**


అవినీతి ఆరోపణలు, ప్రజల అసంక్షేమాన్ని పట్టించుకోకపోవడం, ప్రజావ్యతిరేక ధోరణులతో ఏకపక్ష వాదం అనుసరించే ప్రభుత్వాలన్నీ కాలక్రమంలో కుప్పకూలుతున్నాయి. మొన్నటి శ్రీలంకనుంచి నిన్నటి బంగ్లాదేశ్,ఇప్పుడు వెనిజులా ఇలా ఎన్నెన్నో దేశాలు ఇదేకోవలోకి వస్తాయి. తాజాగా ఆగ్నేయయూరోప్ దేశమైన బల్గేరియా కూడా ఈ జెన్‌జడ్ ఆందోళనల జాబితాలో చేరింది. ప్రజల ఒత్తిడి, నిరసనలకు తలొగ్గి ప్రధాని రోసెన్ జెల్యజ్‌కోవ్ సంకీర్ణ ప్రభుత్వం మొత్తం రాజీనామాను ఆమోదించారు. ఈ వారాంతంలో ఆ దేశంలో జరిగిన తాజా పరిణామాలకు కారణాలు అనేకం ఉన్నప్పటికీ ప్రజల నిర్ణయమే శిరోధార్యమని చెపుతూ జెల్యజ్‌కోవ్ ప్రభుత్వ రాజీనామాను ప్రకటించారు. బల్గేరియాలోని యువత మొత్తం రాజధాని సోఫియాతోపాటు ఇతర నగరాలన్నింటిలోను ప్రభుత్వవ్యతిరేక నిరసనలు, ర్యాలీలతో హోరెత్తించారు. నిర్బంధకాండను అమలు చేసినా యువత ఎక్కడా మడమతిప్పకపోవడంతో చివరకు ప్రభుత్వనేతలు తలవంచాల్సి వచ్చింది. వచ్చే ఏడాది బడ్జెట్‌లో పన్నులు పెంచడంద్వారా సామాజిక భద్రతకు కేటాయింపులు పెంచడం, ప్రభుత్వ వ్యయం మరింత పెంచాలన్న ప్రతిపాదనలున్నాయి. దీనికితోడు రాజకీయంగా ఉన్నతస్థాయి నేతల్లో అవినీతి పెరిగిపోవడం కూడా ఇందుకు కారణం అయిందనే చెప్పాలి. అలాగే సామాన్య మధ్యతరగతి పౌరులకు దేశంలో ఎక్కడా న్యాయం అందడంలేదన్న ఆక్రోశం కూడా యువతలో పెరిగిపోయింది. జెన్‌జడ్ ఆందోళనలే ఇందుకు కారణమైందని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఐదేళ్లలోనే తొమ్మిదో ప్రభుత్వం కుప్పకూలిందంటే ప్రజల్లో చైతన్యం ఏ స్థాయిలో ఉందో తెలుస్తోంది. నిజానికి వచ్చే ఏడాది జనవరిలోనే యూరోపియన్ యూనియన్ లో చేరాల్సి ఉంది.ఐరోపా సమిష్టి కరెన్సీ యూరోను కూడా తమ కరెన్సీగా చేసుకోవాలని నిర్ణయించిన తరుణంలో ప్రభుత్వం ఒక్కసారిగా కుప్పకూలింది.240సీట్ల ఛాంబర్‌లో 227మంది రాజీనామాకే ఆమోదం తెలిపారు. కొత్తప్రభుత్వం ఏర్పడేంతవరకూ మాత్రమే ప్రస్తుత కేబినెట్ పని చేస్తుంది.గత జనవరిలోనే జెల్యజ్‌కోవ్ ప్రభుత్వం ఏర్పాటుచేసింది. కేవలం ఆరువోట్ల మెజార్టీతో అవిశ్వాసతీర్మానాన్ని నెగ్గు కొచ్చిన ప్రస్తుతప్రధాని భారీస్థాయిలో నిరసన లతో గద్దెదిగిపోవాల్సి వచ్చింది. కేవలం ప్రజా ఒత్తిడితోనే తాము ప్రభుత్వం నుంచి దిగిపోతున్నామని, అందుకే రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. లాటిన్‌భాషలో ప్రధాని స్పందిస్తూ వోక్స్‌పాపులీ, వోక్స్ డీ అని వ్యాఖ్యానించారు. ప్రజలవాణి ఆ దేవుడి వాణి అని దీనికి అర్థం. ఇక అధ్యక్షుడు రెమెన్ రాదేవ్ పార్లమెంటులో అతిపెద్ద గ్రూపునకు ప్రభుత్వం ఏర్పాటుచేసే అవకాశం కల్పించాల్సి ఉంటుంది. రెండో అతి పెద్దరాజకీయ పార్టీ అధ్యక్షుడిముందు అభ్యర్థిని ఎంపికచేసుకుంటుంది. ప్రయత్నాలన్నీ విఫలం అయితే అధ్యక్షుడు రాదేవ్ కేర్‌టేకర్ కేబినెట్‌ను ఏర్పాటుచేసి ఎన్నికలునిర్వహణకు వెళ్లాల్సి ఉంటుంది.



జెల్యజ్‌కోవ్

2021నుంచి చూస్తే మరోసారి ఎన్నికలకు వచ్చే సూచనలున్నాయి. అదే జరిగితే ఐదేళ్లలోనే ఎనిమిదిసార్లు ఎన్నికలు జరిగిన దేశంగా ఈబాల్కన్ ద్వీపకల్ప దేశం రికార్డుల్లో నిలిచిపోతుంది. కేవలం ఏడుమిలియన్లు కూడా పూర్తిగాలేని ఈ చిన్న ఆగ్నేయ యూరప్ దేశంలో నెలకొన్న రాజకీయ అనిశ్చితికి కారణం ప్రభుత్వంలో నెలకొన్న అవినీతి, నాయకుల ధోరణులేనని చెప్పాలి. ఎలాంటి ఒడిదొడుకులులేని ప్రభుత్వంగా నిలవాలని భావించే యూరోపియన్ కమిషన్ పరిధిలోని యూరో కరెన్సీనే తమ దేశ కరెన్సీగా అమలుచేయాలని కూడా నిర్ణయించింది.ప్రస్తుతం ఉన్న కరెన్సీ లెవ్‌స్థానంలో జనవరి ఒకటో తేదీ నుంచి అమలుచేయాల్సి ఉన్నప్పటికీ ప్రస్తుత అస్థిరత కారణంగా ఈ దేశం అటు ఎన్నికలకు వెళ్లలేనిస్థితిలోనూ, ఇటు కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయలేని పరిస్థితిలోనుఉంది. 2007లో ఐరోపా కూటమిలో చేరినఈ బాల్కన్ దేశం యూరోజోన్‌లో 21వ సభ్యదేశంగా నిలుస్తోంది. దేశవ్యాప్తంగా ఉవ్వెత్తున ఎగిసి పడిన హక్కులు ఉద్యమంతో ప్రభుత్వ పెద్దలే దిగిరావాల్సి వచ్చింది. స్వేచ్ఛాయుత జీవనంవైపు వెంపర్లాడుతున్న యువతకు దారిచూపేప్రభుత్వం కావాలని వారు కోరుకుంటున్నారు. తదుపరి ప్రభుత్వంలో ఎన్నికైతే డెల్యాన్ పీవ్‌స్కీ లేదా జిఇఆర్‌బి యుడిఎఫ్ నేత బోయికో బోరిస్సోవ్‌లకు అవకాశం ఉండవచ్చని అంచనా. అయితే బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్ తరహాలో అక్కడ హింసాత్మక సంఘటనలు చోటుచేసుకోకపోవడం కొంత ఊరటనిస్తోంది. ప్రైవేటు రంగంపై అధిక పన్నులు విధించడం,ప్రభుత్వ రంగానికి మరిన్ని నిధులు కేటాయించాలన్న ప్రతిపాదనలతోనే ఈ నిరసన మొదలైంది. అందులోనూ ప్రభుత్వ పనితీరుపై తీవ్రస్థాయిలో అసంతృప్తి పేరుకునిపోయింది. వీటితోపాటు బడ్జెట్ ప్రతిపాదనలు కూడా పౌరులకు ఎంతమాత్రం రుచించలేదు. అందుకే బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు కూడా ప్రభుత్వం వెనకడుగు వేసింది. ప్రభుత్వంలోబాధ్యతాయుత వైఖరి, పారదర్శకత ఉండాలని, అందుకే కొత్త నాయకత్వం రావాలని యువత, వృద్ధ జనాభా ఎక్కువ కోరుతోంది. ఈ పరిస్థితుల దృష్ట్యానే గత నవంబరులో జెల్యజ్‌కోవ్ 2026 బడ్జెట్ ప్యాకేజిని ఉపసంహరిస్తున్నట్లు ప్రకటించారు. ట్రేడ్ యూనియన్లు, ఉద్యోగులసంఘాలు సుతరాము ఇష్టంలేదు. మూలధన లబ్ధిపై పన్నులు పెంచడాన్ని పారిశ్రామికరంగంనుంచి తీవ్రనిరసన వ్యక్తం అయింది. పరిశ్రమలు మూసేస్తే ఉపాధి కొరవడుతుందన్న భయం యువతలో నెలకొనడంతో ఉద్యమానికి బీజం వేసింది. డివిడెండ్లపై విధించే పన్ను కూడా రెండు రెట్లు పెంచింది.బిజినెస్ వర్గాలకు ప్రత్యేక ఎలక్ట్రానిక్ అకౌంటింగ్ పరికరాలు ఏర్పాటు చేయడం ఉద్యమానికి దారితీసింది. ఐదేళ్లలోనే ఎనిమిది ప్రభుత్వాలు మార్చిన ఈ బల్గేరియా దేశంలో ఏర్పాటయ్యే కొత్త ప్రభుత్వం ఎంతమేర సుస్థిరతను తెస్తుందన్నది కూడా ప్రశ్నార్థకమే. ●

# బయో ఫ్యూయెల్‌కు కరవైన ప్రోత్సాహం



**రామ కిష్టయ్య సంగనభట్ల**

మండించినపుడు శక్తిని ఉత్పత్తి చేసే పదార్థాన్ని ఇంధనం అంటారు. ఇంధన వాడకం నిత్యకృత్యం. వాహనాలు నడవడానికి, విద్యుత్ ఉత్పత్తి చేయడానికి, వంట చేయడానికి ఇలాఇంధనం ఎన్నో రకాలుగా ఉపయోగపడుతున్నది. మనం ప్రతిక్షణం ఎన్నోరకాల ఇంధనాలపై ఆధారపడి జీవిస్తున్నాం. నీరు, పెట్రోల్, డీజిల్, బొగ్గు, విద్యుత్, కట్టెపుల్లలు సహా ఎన్నోరకాల ఘన, ద్రవ, వాయు ఇంధనాలు, యురేనియం, థోరియం వంటి అణు రసాయన ఇంధనాలు నిత్య జీవితంతో పెనవేసుకుని పోయాయి. నిత్య జీవితంలో ఇంధనాలుగా ఉపయోగపడుతున్నాయి. సంప్రదాయ ఇంధన వనరులైన బొగ్గు, పెట్రోల్, డీజిల్, అణుఇంధనాలు ప్రకృతిలో పరిమితంగా మాత్రమే లభిస్తాయి. వాటిని ప్రస్తుతం వినియోగిస్తున్నట్లుగా విపరీతంగా వినియోగిస్తే ప్రమాదం తప్పదు.అవసరాలకు మించి వినియోగం చేస్తూపోతే, భవిష్యత్తు అంధకారమే. అందుకే సంప్రదాయేతర ఇంధన వినియోగం ప్రత్యామ్నాయ మార్గంగా చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. పెట్రోల్ డీజిల్ గ్యాసులకు బదులుగా బయో ఇంధన వనరులను, బయోడీజిల్, బయో గ్యాస్ వంటి ఇంధన వనరులపై ఆధారపడడం వల్ల భవిష్యత్తు తరాలకు మేలు చేసినవారం అవుతాం. కొన్ని లక్షల సంవత్సరాల క్రితం భూమి అంతర్భాగంలో చేరి, భూమి లోపల విపరీతమైన ఉష్ణం, పీడనం కారణంగా మృత జీవజాలం నుండి శిలాజ నూనెలు/బొగ్గు ఏర్పడినవి. శిలాజ నూనెలు లేదా శిలాజ ఘన పదార్థాలను (నేల బొగ్గు వంటివి) తిరిగి సులభంగా పునరుత్పత్తి కావించుటకు సాధ్యం కాదు. అలా తిరిగి శిలాజ ద్రవ్యా లు ఏర్పడాలంటే మళ్లీ కొన్ని లక్షల సంవత్సరాలు పడుతుంది. అంటే శిలాజ ఇంధ నాలను వాడే కొలది వాడి నిల్వలు తగ్గు తాయి కాని పెరగవు. 19వ శతాబ్దినుండి శిలాజ ఇంధన వాడకం ప్రపంచవ్యాప్తంగా పెరిగిపోయింది.పరిశ్రమల్లో బాయిలర్లలో, థెర్మోపవరు ప్లాంటు బాయిలరులో బొగ్గు వాడకం ఎక్కువ. పెట్రోలు, డీజిల్‌ను ఇంధనంగా వాడు వాహనాలు విపరీతంగా పెరిగిపోయాయి.అందువలన శిలాజ ఇంధ నాల నిల్వలు త్వరగా కరిగి,తరిగిపోతున్నాయి. ఇలాగే శిలాజ ఇంధనాల వాడకం కొనసాగితే కొన్ని వందల సంవత్సరాల తరువాత శిలాజ నిల్వలు తరిగిపోతూ, బైకులు, కార్లు, బస్సులు, ట్రక్కులు, విమానాలు, ఓడలు ఏవి కదలవు. మళ్లీ మానవుడు ఎద్దుల బండ్లను, గుర్రపు బళ్ళను, సైకిళ్ళను వాడవలసి వుంటుంది. కనుక కొంత మేరకు పెట్రోలియం ఇంధనాల వాడకం తగ్గించే నేపథ్యంలో ఈ జీవ ఇంధనాల వైపు ప్రపంచ దృష్టి మళ్ళింది. చెట్లగింజల నుండి తీసిన కొన్ని నూనెలు ఆహార యోగ్యం కాదు. ఉదాహరణకు వేప, కానుగ, జట్రోఫా (అడవి ఆముదం, నేపాళం) వంటి అనేక నూనెలుఆహార యోగ్యం కాదు. ఈ నూనెలను అల్కహాలసిస్ అనబడు ఎస్టరిఫికేసన్ రసాయన చర్య ద్వారా బయోడీజిల్‌గా పరివర్తించి, 10 వరకు డీజిల్‌లో కలిపి డిజిల్‌ను ఇంధనంగా వాహనాల్లో వాడటం వలన డీజిల్ వాడకాన్ని చాలావరకుతగ్గించవచ్చు.




డీజిల్‌తో నడిచే వాహనాల్లోని అంతర్గత దహన యంత్రం, కార్బొరేటరులో తగు మార్పులు చేసిన నేరుగా బయోడిజిల్‌ను వాడవచ్చును. అలాగే డీజల్‌తో నడిచే రైలుఇంజనులలో బయోడిజిల్‌ను వాడవటం వలన కూడా డీజల్ వాడకాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. పశువుల పేడ, మూత్రాలను ఉపయోగించి బయోగ్యాస్ ఉత్పత్తి కొన్ని దశాబ్దాలుగా ఉత్పత్తి చేస్తున్న విషయం తెలిసిందే. అలాగే ఏదైన జీవద్రవ్య ఘన ఇంధనాన్ని తక్కువ ఆక్సిజన్ అందేలా/లేదా ఆక్సిజన్ రహిత వాతావరణంలో 450వద్ద మండించడం వలన జీవ వాయు ఇంధనం ఏర్పడుతుంది. ఘనజీవ ద్రవ్య పదార్థాలను తాపవిచ్ఛేదన, ఉష్ణవిచ్ఛేదన కావించిన హైడ్రోజన్,కార్బన్ మొనాక్సైడ్,మిథేన్, ఈథేను, ఇథైలిన్ వాయువులు ఏర్పడుతాయి. ఈ వాయువులను కండెన్సరు/ద్రవీకరణకారిలోద్రవీకరించిన ద్రవ ఇంధనం/బయోడీజిల్ ఏర్పడుతుంది. గత యూపీఏ ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతి వ్యయంతగ్గించడం, వాతావరణ కాలుష్య నివారణకు, విలువైన విదేశీ మారక ద్రవ్యం మదింపుకోసం జీవ ఇంధనాల ఉత్పత్తులపై ప్రధానంగా దృష్టి నిలిపింది.ఇంధన భద్రతే విదేశాంగ విధానాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేస్తున్న ప్రస్తుత కాలంలో శిలాజ ఇంధనాల నిల్వలు రోజురోజుకూ అడుగంటిపోతున్న కారణంగా కాక, భూ ఉష్ణోగ్రత వ్యాకోచానికి దారి తీస్తున్న, బొగ్గు పులుసు వాయువుల విడుదలను అరికట్టడానికి, ప్రత్యామ్నాయఇంధన వనరులను అభివృద్ధి చేయడం అనివార్యంగా మన్మోహన్ సింగ్ ప్రభుత్వం భావించింది. శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా జీవ ఇంధనాలు (బయో ఫ్యూయెల్) అన్ని విధాలా లాభసాటిగా గుర్తించారు.శిలాజ ఇంధనం పెట్రోలు స్థానంలో, కర్బనం తక్కువగా ఉండే బయోడీజిల్ ప్రత్యామ్నాయ రవాణా ఇంధనంగా అభివృద్ధి చేసే దిశలో, ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో, బయో ఇంధన ఉత్పత్తులపై దృష్టి నిలిపింది. బయో డీజిల్ విపణి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని భావించి, నిర్ధారించి, చమురు ధరలు పెరిగిపోవడాన్ని దృష్టిలో ఉంచుకొని భారత దేశంలో బయో డీజిల్ అభివృద్ధికి పెద్ద ఎత్తున ప్రోత్సాహం అందించే దిశగా కృషి చేసింది. బయో డీజిల్ అనగా కానుగ (శాస్త్రీయ నామం:పెన్నెటి) గింజలు లేదా పెద్ద నేపాళం (జట్రోపా)గింజల నుండి తీసే నూనె. బయోడీజిల్ రెండు దశాబ్దాల క్రితమే గుర్తించినా,అదికార్య రూపం దాల్చడానికి చాలా సమయం పడుతున్నది. సస్టేనెబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆఫ్ రూరల్ ఏరియాస్ (సూత్ర) అనే సంస్థ బెంగళూరులో బయో డీజిల్ తయారీ, వినియోగంపై విస్తృత పరిశోధన జరిపింది. బంజరు భూములు అధికంగా గల భారతావనిలో జీవఇంధనాన్ని ఉత్పత్తి చేయడానికి పలు పెద్ద సంస్థలు ప్రయత్నించాయి. కానుగ సాగుకు ఎంతో సాంకేతిక పరిజ్ఞానం అక్కరలేదు. కానుగ చెట్లు నెలకు ఒకటి, రెండు తడులతో మామిడి చెట్లంత పెరుగుతాయి. గృహావరణాల్లో, రోడ్ల కిరువైపులా కానుగ నాటితే ఆహ్లాదకరమైన నీడతోపాటు, వేడినీళ్లకు చన్నీళ్లు తోడులాగా ఆదాయం పెరుగుతుంది. ఈ చెట్లు 5 సంవత్సరాలు కాపు ప్రారంభించి, 30 ఏళ్లవరకు పంట నిస్తాయి. కానుగ స్వయంగా చీడపీడల నివారిణి అయినందున దానిపై ఎటు వంటి చీడ పీడలుండవు. ప్రధాని నరేంద్ర మోడీ గత ప్రభుత్వం ఇటీవలి కాలంలో పునరుత్పాదక ఇంధన పథకాలకు విశేష కృషిచేసింది. స్వచ్ఛమైన శిలాజ ఇంధనాలను, పర్యావరణ హితమైన ఇంధనాలను తగిన పరిమాణంలో అందుబాటులో ఉంచుకోవడానికి, అవి అందుబాటు యోగ్యంగా ఉండేలా చూడటానికి ప్రాధాన్యం ఇచ్చింది. దేశం లో సులభతర వాణిజ్య నిర్వహణకు ఎంతో చేయూత అందిస్తున్నది. స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులకు సదుపాయంగా ఉండేలా, అన్ని మంత్రిత్వ శాఖల్లో ప్రాజెక్ట్ అభివృద్ధి విభాగాలను విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విభాగాలను ఏర్పాటు చేసింది. ఇంధన పేదరికాన్ని అంతంచేసే దిశగా, స్వచ్ఛమైన శిలాజ ఇంధనాలను, పర్యావరణహితమైన ఇంధనాలను తగిన పరిమాణంలో అందుబాటులో ఉంచుకోవడానికి మార్గనిర్దేశం చేసింది. స్వచ్ఛందంగా శిలాజ ఇంధన వినియోగం, స్వదేశీ ఇంధనాలపై మరింత ఎక్కవగా ఆధార పడటం, విద్యుత్ సేవలను పెంచడం, అన్ని ఇంధన వ్యవస్థల్లో డిజిటల్ సృజనాత్మక పరి జ్ఞానాన్ని ప్రోత్సహించడం తదితర అంశాలపై ప్రభుత్వ దృష్టి కేంద్రీకృతం చేసింది. ●

## జాతీయ లోక్‌అదాలత్‌కు విశేష స్పందన

**గుంటూరు క్రైమ్, డిసెంబర్13, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాలు, గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. సాయి కళ్యాణ్ చక్రవర్తి మార్గదర్శకాల మేరకు, శనివారం గుంటూరులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ అత్యంత విజయవంతంగా ముగిసింది. 5వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, గుంటూరు ప్రాంగణంలో, ఆ కోర్టు న్యాయమూర్తి కోలార్ లత అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు వేగవంతమైన, సులభమైన న్యాయాన్ని అందించాలనే లక్ష్యంతో భారీ సంఖ్యలో కేసులు సఖ్యతతో పరిష్కరించబడ్డాయి.భూ వివాదాలు, డబ్బుల లావాదేవీలు, ఒప్పందాలకు సంబంధించిన సివిల్ కేసులు, అలాగే అనేక క్రిమినల్ కేసులు కూడా ఇరుపక్షాల సమన్వయ పరిష్కారంలో ముగిశాయి. వివాహ సంబంధిత కేసుల్లో బాధిత మహిళలకు బంగారు ఆభరణాల తిరిగి అందజేత, వ్యక్తిగత వస్తువులు, దుస్తులు, భరణం వంటి అంశాలు న్యాయమూర్తి కోలార్ లత ప్రత్యక్ష పర్యవేక్షణలో సాఫీగా పూర్తయ్యాయి. దీని వల్ల బాధిత మహిళలకు తక్షణ న్యాయం లభించి, మానసిక సాంత్వన చేకూరింది.బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు దాఖలు చేసిన రుణ వివాద కేసులు కూడా చర్చల ద్వారా ముగింపు పలికాయి. రుణగ్రస్తులకు ఉపశమనం లభించగా, సంస్థలకు న్యాయపరమైన పరిష్కారం లభించింది.నెగోషియబుల్ ఇన్స్రుమెంట్స్ యాక్ట్ కింద నమోదైన సుమారు రూ.20 కోట్ల విలువైన చెక్ బౌన్స్ కేసులు కూడా పరిష్కరించబడ్డాయి. చెక్కులను గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. సాయి కళ్యాణ్ చక్రవర్తి బాధితులకు స్వయంగా అందజేశారు.లోక్ అదాలత్ అనంతరం బాధితులు న్యాయమూర్తి కోలార్ లత మానవీయ దృష్టి, సానుకూల ధోరణి వల్లే తాము వేగంగా న్యాయం పొందగలిగామని కక్షిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో 361 పైగా కేసులు పరిష్కారం కావడం ద్వారా గుంటూరు జిల్లాలో న్యాయవ్యవస్థ ప్రతిష్ఠ మరింతగా పెరిగిందని పేర్కొన్నారు.లోక్ అదాలత్ ద్వారా ప్రజలు వేగంగా న్యాయం పొందుతారు. బాధితులు, నిందితుల జీవితాల్లో శాంతి నెలకొల్పడంలో లోక్ అదాలత్ కీలక పాత్ర పోషిస్తుంది.సమాజ శాంతి, శ్రేయస్సుకు లోక్ అదాలత్ వ్యవస్థ ఎంతో అవసరం.జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. సాయి కళ్యాణ్ చక్రవర్తి మార్గదర్శకాలు వల్లే ఈ విజయం సాధ్యమైందని వెల్లడించారు.

## కానిస్టేబుల్ నియామక పత్రాల జారీ ఏర్పాట్లు

**గుంటూరు క్రైమ్, డిసెంబర్13, ప్రభాతవార్త:** ఎపిఎస్‌పి 6వ బెటాలియన్ లో ఈ నెల 16వ తేదీన జరగబోయే కానిస్టేబుల్ అభ్యర్థులకు నియామక పాత్రలు జారీ కార్యక్రమం ఏర్పాట్లను రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రత్యేకంగా శనివారం పరిశీలించారు. ఈ పరిశీలనలో భాగంగా పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం హోంమంత్రి ఉన్నతాధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పర్యటించారు.





సభా వేదిక నిర్మాణం,వేదికకు వెళ్లే మార్గాలు,వాహన పార్కింగ్ ప్రదేశాలు,వీవీఐపీ, వీఐపీ విభాగాల ఏర్పాట్లు,ఇతర జిల్లాల నుండి వచ్చే అభ్యర్థులు, వారి బంధువులు,బందోబస్తుకు వచ్చే పోలీస్ అధికారులు, సిబ్బందికి కల్పించాల్సిన వసతులు వంటి అంశాలను సమీక్షించారు.మంత్రి ఎక్కడా ఎటువంటి లోపాలు లేకుండా పటిష్టంగా ఏర్పాట్లు చేయాలని, తగినంత మంది పోలీసులతో భద్రతా బందోబస్తు నిర్వహించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఐజీ సర్వ శ్రేష్ఠి త్రిపాఠి, డీఐజీ సత్య యేసు బాబు,గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, బెటాలియన్ కమాండెంట్ (ఎస్పీ)నగేష్, జిల్లా అదనపు ఎస్పీ, తిగిజు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు పేద విద్యార్థులకు రూ.14,50,000 ఉపకార వేతనాల పంపిణీ



**గుంటూరు, డిసెంబర్ 13, ప్రభాతవార్త ప్రతినిధి:** "కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ గుంటూరు" మరియు "కృష్ణదేవరాయ ఎడ్యుకేషనల్ ప్రోగ్రెసివ్ అసోసియేషన్ తెనాలి సంయుక్త ఆధ్వర్యంలో చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 430 మంది పేద విద్యార్థులకు పద్నాలుగు లక్షల యాభై వేల రూపాయలను(..,14,50,000/) ఉపకార వేతనాలు గా పంపిణీ . ఇందులో రెండు లక్షల యాభై రూపాయలను(...2,50,000/ )తులసి సీడ్స్ కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలెజ్డ్ ద్వారా 65 మంది ప్రతిభ గల పేద విద్యార్థులకు అందిస్తున్నారు. ఈ కార్యక్రమం తెనాలి లోని తెనాలి రామకృష్ణ కవి కళా క్షేత్రం లో మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమౌతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తులసి గ్రూప్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు హాజరయ్యి వితరణ చేయనున్నట్లు తులసి గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ తులసి యోగీష్ చంద్ర తెలియజేశారు.

## గుంటూరు 'పశ్చిమ'లో సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

గుంటూరు వెస్ట్, డిసెంబర్ 13,ప్రభాతవార్త: గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే గళ్ళా మాధవి లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేదలకు పెద్దన్నగా అండగా నిలుస్తూ, ఇంటి పెద్దకొడుకులా బాధ్యత తీసుకుని ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి



పేర్కొన్నారు.ఈ రోజు 20 మంది అర్హులైన పేదలకు మొత్తం రూ. 31 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మొత్తం రూ. 4,93,15,239/లను పేదలకు అందించి ఆదుకున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి వెల్లడించారు.నియోజకవర్గ ప్రజలకు ఏ విధమైన సహాయం అవసరమైనా తన కార్యాలయ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని, ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

## ఫలించిన ఎమ్మెల్యే నసీర్ కృషి

**జీజీహెచ్‌కు వైద్య పరికరాల కేటాయింపు పలు దఫాలుగా వైద్య శాఖ మంత్రి, సెక్రటరీలను కలిసి విన్నవించిన ఎమ్మెల్యే**

గుంటూరు వెస్ట్, డిసెంబర్ 13,ప్రభాతవార్త: గుంటూరు ప్రజలకు సంజీవనిగా ఉన్న గుంటూరు ప్రభుత్వాస్పత్రికి మహర్దశ తీసుకొచ్చేందుకు తాము చేసిన కృషి ఫలితాన్నిచ్చిందని సంతోషంగా ఉందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ లెజిస్లేటివ్, వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ అహ్మద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారం చేపట్టినప్పటి నుంచి గుంటూరు తూర్పు నియోజకవర్గ అభివృద్ధితోపాటు జీజీహెచ్ కోసం అహర్నిశలు కృషి చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో వివిధ విభాగాల్లో వైద్య పరికరాల అవసరాన్ని పలు దఫాలుగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, వైద్య శాఖ సెక్రటరీలను కలిసి విన్నవించామన్నారు. రాష్ట్రంలోని వివిధ ఆస్పత్రుల్లో నిరుపయోగంగా ఉన్న వైద్య పరికరాలను గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించేందుకు అనుమతులు మంజూరు చేయాలని కోరినట్లు చెప్పారు. ఈ క్రమంలో గుంటూరు ప్రభుత్వాస్పత్రికి 21 రకాల పరికరాలను ఇతర ఆస్పత్రుల నుంచి తరలించేందుకు అనుమతులు జారీ చేస్తూ వైద్య ఆరోగ్యశాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయినట్లు



తెలిపారు. గుంటూరు ప్రభుత్వాస్పత్రికి ప్రతి రోజూ వేల సంఖ్యలో రోగులు వస్తుంటారని, ఇప్పుడు కేటాయించిన పరికరాల ద్వారా మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. అడిగిన వెంటనే వైద్య పరికరాలను కేటాయించిన సీఎం చంద్రబాబు నాయుడు, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

**ఇవీ ప్రభుత్వాస్పత్రికి కేటాయించిన పరికరాలు**

అప్తాల్మిక్ టోనోమీటర్, ఆప్టోస్కోప్, క్రయో యూనిట్, ఈ టీ ఎస్ కూడిన ఎల్లో కస్టబిల్ తెరపీ, కెరటోమీటర్, ఎల్ఈడీ ఫోటోథెరపీ డబుల్ సర్ఫేస్, న్యూరో మస్కులర్ మానిటర్, ఇంపెడెన్స్ ఆడియోమీటర్, హ్యాండ్ ఇన్స్ట్రుమెంట్లతో హెచ్‌డీ కెమెరాతో కూడిన ఆపరేటింగ్ ల్యాపరోస్కోప్ సెట్, ఆపరేటింగ్ థియేటర్ సీలింగ్ లైట్1 డోమ్, ఆపరేటివ్ హిస్టెరోస్కోప్ సెట్, మ్యాగ్నెటిక్ పేషెంట్ కాల్, న్యూమాటిక్ డ్రిల్, రోటాబ్లే చైర్, వాటర్ క్యాలరిక్ ఇరిగేటర్, ఎయిర్ క్యాలరిక్ ఇరిగేటర్‌తో , షియోట్జ్ టోనోమీటర్, స్లిట్ లాంప్ పరికరాలు ప్రభుత్వాస్పత్రికి రోగులకు అందుబాటులోకి వస్తాయని చెప్పారు.

# గుంటూరు వార్త



## రాజధాని అమరావతికి ధీటుగా గుంటూరు నగరాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

**గుంటూరు కార్పొరేషన్, డిసెంబర్ 13, ప్రభాతవార్త :** ఏపీ రాష్ట్ర రాజధాని అమరావతికి దీటుగా గుంటూరు జిల్లాను కేంద్రంగా చేసుకొని గుంటూరు నగరాభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర ( నాని ) అన్నారు. గతంలో మునుపెన్నడు లేని తరహాలో గుంటూరు నగరం అభివృద్ధి పథంలో పరుగులు పెడుతుంటే కళ్ళున్న చూడలేని కబోదిలా వైసీపీ నేతలు విమర్శలు చేస్తున్న తీరు హాస్యాస్పదంగా ఉందని వెల్లడించారు. గుంటూరు నగరానికి కేంద్ర బిందువైన శంకర్ విలాస్ ఆర్ఓబి నిర్మాణ పనులు జరిగే ప్రాంతానికి వెళ్లిన కొందరు వైసీపీ నేతలు కావాలని ప్రభుత్వంపై కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పై అసత్య ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు చేయటం తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ల ప్రోత్సాహంతో గుంటూరు ఎంపీగా తన అభివృద్ధి మార్కు చూపెట్టాలని సదుద్దేశంతో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ గుంటూరు నగరాభివృద్ధి లక్ష్యంగా అనేక అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించడంలో, ఆ



పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తిచేసే విధంగా నిరంతరం అడుగులు వేస్తున్నారు అన్నారు. ఎన్నికల సమయంలో ప్రచారంలో చెప్పిన విధంగా, ఇచ్చిన హామీల ప్రకారం శంకర్ విలాస్ ఆర్ఓబి పనులు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. అయితే పనిలేని కొందరు వైసిపి నేతలు పనిగట్టుకుని శంకర్ విలాస్ బ్రిడ్జి పనులకు ఆటంకం కలిగించాలని దురుద్దేశంతో ప్రజలలో తప్పుడు సంకేతాలు వెళ్లేలా విమర్శలు చేయటం దారుణం అన్నారు. వారు చెప్పిన విధంగా గతంలోనే రూ. 160 కోట్లు బ్రిడ్జి నిర్మాణానికి అనుమతి వచ్చిందని చెబుతున్నారని, మరి అప్పుడు వారు పనిచేసిన ఐదేళ్ల కాలంలో బ్రిడ్జి నిర్మాణ పనులు ఎందుకు చేయలేకపోయరో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పై మాట్లాడుతున్న వైసీపీ నేతలు అంబటి రాంబాబు, మోదుగుల వేణుగోపాల్ రెడ్డిలు తమ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఏం చేస్తున్నారు, ఎందుకు చేయలేకపోయారు ముందు ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణ విషయంలో పెమ్మసానిపై ఎవరెన్ని తప్పుడు సంకేతాలతో విమర్శలు చేసిన ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని తెలిపారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించిన, ఎన్ని ఇబ్బందులు పెట్టిన అనుకున్న లక్ష్యం ప్రకారం శంకర్ విలాస్ ఆర్ఓబి నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. బ్రిడ్జి నిర్మాణం కోసం సలాలు ఇచ్చిన ప్రతి ఒక్కరికి ఎటువంటి అన్యాయం జరగకుండా తప్పనిసరిగా న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రోత్సాహంతో గుంటూరు జిల్లాతో పాటు, రాష్ట్ర రాజధాని అమరావతిలో భాగమైన గుంటూరు నగరాన్ని కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేసి చూపిస్తామని, ఇందులో ప్రజలు ఎటువంటి అపోహలు పడాల్సిన పనిలేదని చెపుతూ మేయర్ నాని వైసిపి నేతలు చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ గా చురకలం టించారు.

## బృందావన్ గార్డెన్స్ రోడ్డు అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తి చేయాలి

### నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్, డిసెంబర్ 13 ( ప్రభాత వార్త ) : గుంటూరు నగరంలోని బృందావన్ గార్డెన్స్ లో చేపడుతున్న రోడ్డు అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తి చేయాలని గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అధికారులను ఆదేశించారు. శనివారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, కార్పొరేషన్ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారులతో కలిసి ఆ రోడ్డు అభివృద్ధి పనులు ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగంగా ఇరువైపు లో ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని సూచించారు. గార్డెన్స్



ప్రధాన మెయిన్ రోడ్డు అభివృద్ధికి నోచుకోక చాలాకాలంగా పెండింగ్లో ఉందని ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రోడ్డు అభివృద్ధికి కార్యరూపం దాల్చిందని తెలిపారు. ఈ రోడ్డు విస్తరణ పనులను నిర్దేశిత ప్లాన్ ప్రకారం పూర్తిచేయాలని సూచించారు. రోడ్డుకు ఇరువైపులా ఎటువంటి ఆక్రమణలు ఉండటానికి వీల్లేదని, తక్షణమే తొలగించాలని ఆదేశించారు. కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ గార్డెన్స్ నుంచి విద్యానగర్ మెయిన్ రోడ్డు వరకు 80 అడుగుల రోడ్డు విస్తరణకు అనుమతులు మంజూరు చేశామని తెలిపారు. రోడ్డు విస్తరణ పనులు పూర్తయ్యాక డ్రైవ్ లో ఏర్పాటు పూర్తి చేశాకే రోడ్డు నిర్మాణం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో టౌన్ ప్లానింగ్ అధికారులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## భజరంగ్ జ్యూట్ మిల్లు కార్మికుల సమస్యలపై మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు ఎమ్మెల్యే మాధవి వినతి

గుంటూరు వెస్ట్, డిసెంబర్ 13,ప్రభాతవార్త: గుంటూరు నగరంలో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి శ్రీ వాసంశెట్టి సుభాష్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి ఆహ్వానాన్ని మన్నించి వారి నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా కార్మికులు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలను పరిష్కరించవలసిందిగా కోరుతూ, ఎమ్మెల్యే గళ్ళా మాధవి మంత్రి వాసంశెట్టి సుభాష్ కి వినతిపత్రం అందజేశారు.వినతిపత్రంలో ఎమ్మెల్యే భజరంగ్ జ్యూట్ మిల్లు కార్మికుల సమస్యలను ప్రస్తావించారు. భజరంగ్ జ్యూట్ మిల్లు యాజమాన్యం 4న లాకౌట్ ప్రకటించారని, లాకౌట్ అనంతరం రాజీనామా దాఖలు చేసిన ప్రతి కార్మికుడికి రూ.40,000/ చెల్లించేందుకు యాజమాన్యంతో ఒప్పందం కుదిరినప్పటికీ, కేవలం 200 మంది ఉద్యోగులకు మాత్రమే ఆ మొత్తాన్ని చెల్లించి, మిగిలిన సుమారు 800 మంది కార్మికులకు ఇప్పటికీ హామీ ఇచ్చిన రూ.40,000/ చెల్లించలేదని వినతిపత్రంలో స్పష్టం చేశారు.ఈ అంశాన్ని గుంటూరు



కార్మిక శాఖ జాయింట్ కమిషనర్‌కు కూడా తెలియజేయగా, యాజమాన్యం పరిష్కారానికి ముందుకు రావడం లేదని మంత్రి దృష్టికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి తీసుకువచ్చారు.కావున భజరంగ్ జ్యూట్ మిల్లు యాజమాన్యం మరియు కార్మిక సంఘాల మధ్య సంయుక్త సమావేశం నిర్వహించి, కార్మికులకు న్యాయం జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ను ఎమ్మెల్యే గళ్ళా మాధవి కోరారు.

## చదివేది ఇంటర్....కూతురు ప్రవర్తన చూసి షాకైన యువతి తల్లి


### - ఫోన్ చెక్ చేస్తే బయటపడ్డ అసలు నిజం

**గుంటూరు, డిసెంబర్ 13, ప్రభాతవార్త ప్రతినిధి:** తల్లి, కూతుళ్ల మధ్యలో డ్రగ్స్ వివాదాన్ని రేపాయి. కూతురు చెప్పిన మాట వినటం లేదని తల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడమే కాకుండా కూతురు డ్రగ్స్ బానిసైందని ఫిర్యాదు చేయడం కలకలం రేపింది. కూతురు మాత్రం ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని ఆరోపిస్తుంది. దీంతో ఉన్నతాధికారులు రంగంలోకి దిగి కేసు దర్యాప్తు చేపట్టారు. గుంటూరు ఆర్టిసి కాలనీకి చెందిన స్వప్న,రాజేష్ దంపతులకి ఇంటర్ మొదటి ఏడాది చదువుతున్న కుమార్తె ఉంది. స్వప్న హైదరాబాద్‌లో యాంకర్‌గా పనిచేస్తుంది. అయితే కొన్ని రోజులుగా కుమార్తె ప్రవర్థన అనుమానాస్పదంగా ఉండటంతో ఆమెపై తల్లి దండ్రులు దృష్టి పెట్టారు. ఈ క్రమంలోనే కూతురికి కౌశిక్ అనే యువకుడితో పరిచయం ఉన్నట్లు తేలింది. ఇన్ స్టాలో పరిచయమైన కౌశిక్‌తో మైనర్ చనువుగా ఉన్నట్లు గుర్తించారు. ఈక్రమంలోనే తమ కుమార్తెకు పెళ్లి చేసేందుకు సిద్ధమయ్యారు. అయితే తల్లిదండ్రుల పెళ్లి చేసుకునేందుకు భూమిక ఇష్టపడలేదు. దీంతో శుక్రవారం రాత్రి భూమిక ఫోన్ తీసుకున్న తల్లిదండ్రులు తమ కుమార్తె డ్రగ్స్‌కు బానిసైనట్లు గుర్తించారు. తప్పుడు మార్గంలో ప్రయాణిస్తుందని తనతో గొడవకు దిగారు. తల్లిదండ్రులను టీనేజర్ ఎదిరించి మాట్లాడటంతో తల్లి కుమార్తెను కొట్టింది. ఇద్దరి మధ్య వివాదం మధ్య వివాదం ముదరడంతో మనస్థాపానికి గురైన తల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుమార్తెను డ్రగ్స్ కు బానిస చేసి ఆమెతో చనువుగా ఉంటూ డ్రగ్స్ వినియోగిస్తున్న వీడియోస్ కూడా ఉన్నట్లు తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ క్రమంలోనే ఈ పిర్యాదుపై పోలీసు శాఖ అప్రమత్తమైంది. జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న తల్లి స్వప్నను ఈగిల్ చీఫ్ ఆకే రవికృష్ణ, గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పరామర్శించారు. ఇద్దరి స్టేట్ మెంట్స్ తీసుకున్నామని కేసును దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు. స్వప్న కుమార్తె డ్రగ్స్ తీసుకున్నట్లు ప్రాథమిక సమాచారం ఉన్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ చెప్పారు. కేసు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

## మంత్రుల పేషీ వైపు..ప్రొఫెసర్ల చూపు !

### - పదవుల్లో రాజీ పడేందుకు మంతనాలు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, డిసెంబరు13, ప్రభాతవార్త: మనమనం ఒకటే... నీకిది నాకది.. నన్ను కదిలించవద్దు.. ఒక అధికారిగా నీకు రికమెండ్ చేస్తా.. మంచి హోదా వచ్చేందుకు మద్దత్తు తెలుపుతా... ఇవి వర్సిటీలో ప్రస్తుతం చర్చించుకుంటున్న అంశాలు. నూతన వీసి వస్తున్న సమయంలో అధికారుల్లో కొంత అలజడి నెలకొంది. పదవుల్లో కొనసాగేందుకు ఎవరి రూటు వారు చూసుకుంటున్నారు. కొందరు ఒక అడుగుముందుకేసి ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మరికొంతకాలం కొనసాగించాలని కోరుతున్నట్లు తెలిసింది. మరికొందరు వివిధ శాఖల మంత్రుల పేషీకి క్యూ కట్టేందుకు సిద్ధమౌతున్నారని వినికిడి. ఇలా ఆయా సామాజిక వర్గాల వారీగా వారి అనుచరుల నుంచి అపాయింట్‌మెంట్ తీసుకునే ప్రయత్నాలకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. సమయం వచ్చినప్పుడెల్లా ఆయా సందర్భాల్లో ప్రజాప్రతినిధుల గురించి గొప్పలు చెప్పడం వారివల్లే తాము న్నట్లు పేర్కొనడం విశేషం. 2026



ఆగస్ట్ నుంచి ప్రొఫెసర్‌ల రిటైర్‌మెంట్ కొనసాగనుంది. ప్రతీ ఆరు నెలలకు కొందరు చొప్పున రిటైర్‌కానున్నారు. రిటైర్‌మెంట్‌కు దగ్గరనున్న చాలా మంది ప్రొఫెసర్‌లు పదవులు పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరు వారికివచ్చిన అవకాశాలను కాదనుకున్నారని మళ్లీ ఇప్పుడు కావాలంటున్నారని కొందరు ప్రొఫెసర్లు పేర్కొంటున్నారు. అదే జరిగితే ఇప్పుడున్న కొందరు ప్రొఫెసర్‌లు వారి పదవులు త్యాగం చేయాల్సివచ్చిద్ది. దీనికి చాలామంది అయిష్టత వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడున్న వారంతా తాత్కాలికంగానే పదవుల్లో కొనసాగుతున్నారు.

**ఆయనను రానీయొద్దు..** ఇదిలాఉండగా ఓ ప్రొఫెసర్ చేస్తున్న ప్రయత్నాలు బెడిసికొడతాయేమోనన్న ఆందోళనలో ఉన్నట్లు తెలిసింది. ఎందుకంటే ఆ మధ్య ఆయనను రానీయవద్దని, కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదని సమాచారం. తన పదవిని కాపాడుకునేందుకు అహర్నిశలు కృషిచేస్తున్నారు. అనేక విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నా అవి ఫలించవేమో అనే ఆందోళన ఆయనలో కనిపిస్తున్నట్లు వినికిడి. ఈ మధ్యకాలంలో ఆయన ప్రవర్తనలో మార్పులు వచ్చాయని తెలిసింది. అయినాకూడా మేకపోతు గాంబీర్యం ప్రదర్శిస్తురని వినికిడి. ఏ రోజైనా తన పదవిని కోల్పోవాల్సి వస్తుందేమో అనే సందేహం ఆయనలో నెలకొందా అన్నట్లు వర్సిటీలో చర్చించుకుంటున్నారు.

**రాజు గారిని రానీవ్వరా.....?** నూతన వీసి ప్రొఫెసర్ సత్యన్నారాయణ రాజు రాకపై చేస్తున్న ప్రచారం వర్సిటీలో హాట్‌టాపిక్‌గా మారింది. ఆయనకు కొందరు ఫోన్ ద్వారా ఇక్కడ జరిగే విషయాలను, అధికారుల పనితీరును ఎప్పటికప్పుడు ఆయనకు చేరవేస్తున్నట్లు సమాచారం. ఇదే విషయంపై వీసి సత్యన్నారాయణ రాజు కూడా తన ఫోన్ నెంబరును మార్చినట్లు తెలిసింది. ఇది కాస్త వైరల్ కావడంతో ఆయనను రావొద్దని కొందరు వారివారి ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. దీంతో వర్సిటీలో నూతన వీసి రాజు గారిని రానివ్వరా అనే సందేహాలు వ్యక్తమౌతున్నాయి. ఇలాంటి పలు ప్రశ్నలకు ఆయన రాక సమాదానం కావాలని పలువురు కోరుతున్నారు.

## మోదుమూడి సుధాకర్‌కు రామకృష్ణయ్య పంతులు స్మారక అవార్డు ప్రదానం

గుంటూరు కల్చరల్,డిసెంబర్ 13,ప్రభాతవార్త : స్థానిక లక్ష్మీపురం త్యాగరాజ స్వామి కళావేదికపై గాయత్రీ సంగీత సన్మండలి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం పారుపల్లి రామకృష్ణయ్య పంతులు 142వ జయంతోత్సవాల సభ జరిగింది.సభకు ముఖ్యఅతిధిగా గాయత్రి మహిళా సంగీత సన్మండలి గౌరవాధ్యక్షులు పద్మశ్రీ డాక్టర్ అన్నవరపు రామస్వామి,విజయవాడ,ఆత్మీయ అతిధిగా బిల్డర్ అన్నాప్రగడ రవి శ్రీనివాస్,ప్రత్యేక అతిధిగా ప్రముఖ గజల్ గాయకులు గజల్ శ్రీనివాస్,హైదరాబాద్ శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం ఉపాధ్యక్ష,కార్యదర్శులు, ఎస్.గిరిజాశంకర్,వల్లూరి కృష్ణకిషోర్ లు పాల్గొన్నారు.సభా కార్యక్రమాలను సంస్థ ప్రధాన కార్యదర్శి ఎం.వై. శేషురాణి నిర్వహించారు.తొలుత దెందుకూరి పద్మజ,నారాయణమూర్తి న్యాయవాద దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు.అతిధులు,సంస్థ వారు పారుపల్లి రామకృష్ణయ్య పంతులు మెమోరియల్ అవార్డును మోదుమూడి సుధాకర్ కు అందించి ఘనంగా సత్కరించారు.అనంతరం అవార్డు గ్రహీత సుస్వర సుధాగాన ప్రపూర్ణ,కళారత్న విద్వాన్ మోదుమూడి సుధాకర్,విజయవాడ వారి శాస్త్రీయ గాత్ర సంగీత కచేరి మధురంగా సాగింది.శ్రీత్యాగరాజ,ముతు _స్వామి,శ్యామశాస్త్రి లు పలు వాగ్గేయకార కృతులను మధురంగా ఆలాపించి సంగీతాభిమానులను అలరించారు.తొలుత శివైక్యం చెందిన గాయత్రీ మహిళా సంగీత సన్మండలి వ్యవస్థాపకులు,సంగీత సేవా నిరత,డాక్టర్ వేదుల సూర్యకాంతం కి శ్రద్ధాంజలి కార్యక్రమంలో డాక్టర్ దీవి నరసింహాదీక్షిత్,భూసురపల్లి వేంకటేశ్వర్లు మరియు అనేకమంది సంగీత,సాహిత్య శిరోమణి డాక్టర్ సూర్యకాంతం సంగీతానికి చేసిన సేవలను స్మరించుకుంటూ ఆమె చి త్రపటానికి పువ్వు లతో నివాళులర్పించారు.



## యూనియన్లతో సమన్వయ సమావేశం అభినందనీయం

గుంటూరు విద్య డిసెంబర్ 13 ప్రభాతవార్త : గుంటూరు జిల్లా కు నూతన డియివో గా సలీం భాషా నియమితులు అయిన తొలిరేజే వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలతో సమన్వయ సమావేశం నిర్వహించడం ఎంతైనా అభినందనీయమని ఏపీ పీఎఫ్ 1938 సంఘ నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారిని తన చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా నాయకులు కె. నరసింహారావు, జె. విజయానంద్, ఎం.వి. ప్రసాద్, ఆనంగి శ్రీనివాస్, సయ్యద్ ఫర్వతుల్లా,వై.మనోజ్ కుమార్, సయ్యద్ అర్ఫతుల్లా తదితర నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛని అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా ప్యాప్టో చైర్మన్ మరియు ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. నరసింహారావు మాట్లాడుతూ డి ఈ ఓ వచ్చిన రోజే అన్ని యూనియన్ నాయకులతో కోఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేయడం, జిల్లాలోని విద్యార్థుల విద్యాభివృద్ధికి, మరియు ఉపాధ్యాయుల సంక్షేమం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని , మహిళా ఉపాధ్యాయులకు మండల ఆఫీసుల వద్ద ఎటువంటి ఇబ్బందులు లేకుండా వారి సమస్యలు వెంటనే పరిష్క రించేందుకు తగిన చర్యలు తీసుకుంటానని తెలియజేశడం పట్ల హర్షం వెలిబుచ్చారు.



## కళ్లం హరనాథరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఏపి మేకర్ ల్యాబ్ ఆన్ వీల్స్

గుంటూరు విద్య, డిసెంబర్ 13 ప్రభాతవార్త: కళ్ళం హరనాథరెడ్డి ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ నందు ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ ఐ ఓ టి రంగాలలో విద్యార్థులకి అవగాహన కార్యక్రమం లో భాగంగా ఇన్ఫోసిస్ కంపెనీ ఆధ్వర్యంలో మేకర్ ల్యాబ్ ఆన్ వీల్ ద్వారా ఇంజనీరింగ్ విద్యార్థులకు వివిధ నూతన ఆవిష్కరణలు పై అవగాహన నిర్వహించామని కళాశాల డైరెక్టర్ డా. మొవ్వ ఉమాశంకర రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఇంజనీరింగ్ 3 వ సంవత్సరం విద్యార్థులకు ఈ మేకర్ ల్యాబ్ ఆన్ వీల్ వాహనం అన్ని సాంకేతిక పరిజ్ఞానం కలిగిన యంత్ర పరికరాలతో కూడిన విజ్ఞాన సహకారాల తో కూడిన అవగాహన అందించారు. 25 మంది విద్యార్థులు సమూహం సభ్యులకు ఒకసారి పై సాంకేతిక అంశాల పై అవగాహన మరియు శిక్షణ ఇచ్చారు. మొత్తం 150 మంది విద్యార్థులు ఈ మేకర్ ల్యాబ్ ఆన్ వీల్ వాహనం లో సాంకేతిక అంశాల పై అవగాహన పొందారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి ఎస్ బి రెడ్డి తెలిపారు.



ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాదిపతి డాక్టర్ సతీష్, డాక్టర్ రత్నం మరియు కళాశాల ఉపాధికల్పన అధికారి డాక్టర్ పి ఎల్ మాధవ రావు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా వార్త



## రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో ముగిసిన నవోదయ తరగతులు

మాచర్ల, డిసెంబరు 13 ప్రభాతవార్త: శ్రీరామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహించిన నవోదయ క్లాసులు ముగిసినట్లు సేవాసమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. స్వామి



వివేకానంద స్ఫూర్తితో గత నవంబరు 10 నుంచి మాచర్ల నెహ్రూనగర్‌లో యూపీ స్కూల్‌లో నవోదయ ఉచిత క్లాసులు ప్రారంభించినట్లు చెప్పారు. డిసెంబరు 13న నవోదయ పరీక్షలు ముగిసినట్లు చెప్పారు. విద్యార్థులు ఉచితంగా అందిస్తున్న కోచింగ్ క్లాసులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా వేసవి సెలవుల్లో ఉచిత పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ, స్పోకెన్ ఇంగ్లీషు, ఉచిత కంప్యూటర్, 10 ఫెయిలయిన విద్యార్థులకు ఉచిత కోచింగ్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కోచింగ్ తరగతులకు సహకరించిన యూపీ స్కూల్ హెచ్‌ఎం కేశవరెడ్డికి, ఉపాధ్యాయ బృందానికి, కోచింగ్ ఇచ్చిన వెంకటలక్ష్మికి ధన్యవాదాలు తెలిపారు.

## ఘనంగా రాష్ట్రషస్థాయి బైబిల్ క్విజ్ పోటీలు

మాచర్ల, డిసెంబరు 13 ప్రభాతవార్త: స్థానిక నెహ్రూనగర్ సమర్పణ ప్రార్థనా మందిరంలో జరిగిన రాష్ట్ర స్థాయి బైబిల్ క్విజ్ పోటీలు విజయవంతంగా ముగిశాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో ఈ క్విజ్‌కు హాజరయ్యారు. క్విజ్ ఎపోటీలు ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. ఆధ్యాత్మిక రంగంలో యువత మరింత ప్రగతి సాధించాలని



కన్వీనరు శంకర్, బ్రహ్మానాయుడు తెలిపారు. క్విజ్ విజేతలుగా విజయవాడకు చెందిన క్రీస్తు సంఘం డేనియల్ బృందం ప్రథమ బహుమతి, వినుకొండ ఇమ్మానుయేలు ప్రార్థనా మందిరానికి చెందిన వై.కోటేశ్వరరావు బృందం ద్వితీయ బహుమతి, మాచర్లకు చెందిన ఎం.జయరాజు బృందం తృతయ బహుమతి కైవసం చేసుకున్నారు. రానున్న కాలంలో మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మరిన్ని క్రైస్తవ ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి పాస్టర్ మోహన్‌బాబు, సుందరరావు, జాషువా, లాజరు, యెహోషువ, సైదులు, అభిషేక్, అనిల్, ఇశ్రాయేలు, టైటస్ జాన్ తదితరులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

## లోక్ అదాలత్‌లో 418 కేసులు పరిష్కారం

గురజాల, డిసెంబరు 13 ప్రభాతవార్త: పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన నిర్వహించిన లోక్ అదాలత్‌లో 418 కేసులను పరిశీలించారు. ఇందుకు



గాను నాలుగు బెంచీలను ఏర్పాటు చేశారు. మొదటి బెంచిలో మండల లీగల్ సర్వీసెస్ ఛైర్మన్ ప్రియదర్శిని 20 కేసులు రాజీ చేశారు. రెండో బెంచిలో సీనియర్ సివిల్ జడ్జి వై శ్రీనివాసరావు 6 కేసులు పరిష్కరించారు. అలాగే ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి సత్యనారాయణ, అదనపు సివిల్ జడ్జి అలేఖ్య 314 కేసులను పరిష్కరించారు. వీటిలో 48 సివిల్, 4 మనోవర్తి, 69 ఎక్స్ఛేంజ్, 273 క్రిమినల్, 20 బ్యాంకు పీల్సీ కేసులు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట శ్రీనివాసరావు, సీనియర్ న్యాయవాదులు చల్లా రామిరెడ్డి, వెంకటేశ్వర్లు, లక్ష్మీ, కలివెల ప్రభుదాసు, కనకం ఆదినారాయణ, సుందరజ్ఞానమ్మ, జక్కా చెన్నకేశవరావు, లింగరాజు, కర్రా చిన కోటేశ్వరరావు, వై నరసింహారెడ్డి, సుబ్బమ్మ, చల్లా తిరుమలేశ్వరరావు, అనిల్, పోలీసు సిబ్బంది, అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.

## స్వర్ణోత్సవ వేడుకల్లో పూర్వవిద్యార్థులు

విజయపురిసౌత్, డిసెంబరు 13 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ఆవరణలో స్వర్ణోత్సవ వేడుకలు 50 వసంతాల స్వర్ణోత్సవాలు తొలిరోజు అత్యంత వైభవంగా నిర్వహించారు. కళాశాల పూర్వ విద్యార్థులు 50 సంవత్సరాల పండుగలో పాల్గొని గతంలో ఇక్కడ పనిచేసిన పలువురు ప్రిన్సిపల్స్, అధ్యాపకులను సగౌరవంగా వేదికపైకి ఆహ్వానించి పూలదండలతో



దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి, తెలంగాణ డీఐజీ మహేందర్‌రెడ్డి, తెలంగాణ ఐజీ రమేష్ రెడ్డి, పలువురు ఎన్నారైలు, వివిధ రంగాల్లో స్థిరపడిన 50 సంవత్సరాల కళాశాల విద్యార్థులు ఒకేవేదికపై కనువిందు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సరోజిని, రిటైర్డు ప్రిన్సిపల్స్ జి.రంగాచార్యులు, చందు ఆంజనేయులు, జగన్నాథరావు, నాగభూషణశర్మ, జయరాం, విజయరాఘవాచార్యులుతోపాటు 118 మంది అధ్యాపకులు పాల్గొన్నారు. వీరందరినీ ఒకే వేదికపై ఘనంగా సన్మానించారు. సాగర్ పరివార్ గోల్డెన్ జూబిలీ సెలెబ్రేషన్స్ ఆర్గనైజింగ్ కమిటీ ఛైర్మన్ ఎ.సైదారెడ్డి, కో-ఛైర్మన్ ఎస్.నాగాచారి, డా॥ కె.వీరనంది, జి.గోపాలరావు, పూర్వవిద్యార్థి సంఘం ప్రతినిధులు రమేష్‌నాయుడు, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బావపై బావమరుదులు కర్రలతో దాడి

గురజాల, డిసెంబరు 13 ప్రభాతవార్తః బావపై బావమరుదులు కర్రలతో దాడి తీవ్రంగా గాయపరిచారు. ఈ సంఘటన గురజాల పట్టణంలో శనివారం చోటుచేసుకుంది. పిడుగురాళ్ల



మండలం తుమ్మలచెరువుకు చెందిన అప్పారావు గురజాల పట్టణంలో తన అత్తమామల వద్ద ఉంటున్న తన పిల్లలను చూసేందుకు వచ్చాడు. ఈ క్రమంలో అతని బావమరుదులు అతనిపై కర్రలతో దాడి చేసి గాయపరిచారు. స్థానికులు అతన్ని పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. కాగా అప్పారావు గతంలో తన భార్యను హత్య చేశాడు. ఈ క్రమంలోనే బావమరుదులు అతనిపై దాడి చేసినట్లు తెలుస్తోంది.

## అథ్లెటిక్స్‌లో ఓవరాల్ చాంపియన్ రన్నర్స్‌గా కృష్ణవేణి విద్యార్థులు

నకరికల్లు, డిసెంబర్ 13 ప్రభాతవార్త ::గుంటూరు జిల్లా ఖాజీపాలెం కెవిఆర్ కెవిఆర్ ఎంకెఆర్ కళాశాలలో ఈ నెల 10 వ తేదీ నుండి 12 వ తేదీ వరకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆధ్వర్యంలో అంతర కళాశాల పోటీలు జరిగాయి. పురుషులు, మహిళల అథ్లెటిక్స్ పోటీలలో తమ



కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటి రన్నర్స్ గా నిలిచారని కృష్ణవేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. పోటీలలో మహిళా విద్యార్థులు ప్రతిభ చాటి 6 బంగారు, 11 వెండి, 9 కాంస్య పతకాలు సాధించి మొత్తం చాంపియన్‌షిప్ రన్నర్స్ గా నిలిచారన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో నాతాని మాట్లాడుతూ మహిళా విభాగంలో ఎం.శిరీషా, ఎం.హేమలత, టి.కస్తూరి, ఎం.చౌడేశ్వరి, సత్యవతి, సామ్రాజ్యం, పి. మంజు భార్గవి, బి.మమత, ఎస్.కె.అనూరాధ, వి.అనూష, వి.నీలవేణి, వి.అనంతలక్ష్మి, కె.పూజిత కుమారి, కె.వెంకట పద్మావతి అదేవిధంగా పురుషుల విభాగంలో 4 400 రిలే లో బ్రాంజ్ మెడల్ సాధించారన్నారు. అభినందన సభలో విద్యార్థులను సతీష్, తిరుపతిరావు, పిడి ఆదిబాబు, మహమ్మద్, షకీలా అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

## విద్యుత్ చార్జీల విషయంలో మాట తప్పిన కూటమి::సిపిఎం

నరసరావుపేట, డిసెంబర్ 13 ప్రభాతవార్త ::కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచడం లేదంటూనే సర్దుబాటు ఛార్జీల పేరుతో నెల నెల వసూలు చేస్తూనే తాజాగా రూ 12617 కోట్ల భారాన్ని ప్రజలపై వేసేందుకు రంగం సిద్ధం చేసిందని ఈ ప్రతిపాదన తక్షణమే విరమించుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్. బాబూరావు డిమాండ్ చేశారు. శనివారం నరసరావుపేట సిపిఎం కార్యాలయంలో సిపిఎం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాబూరావు మాట్లాడుతూ ప్రజలపై విద్యుత్ భారాలు మోపడంలో వైసిపి, టిడిపి లు ఒకే విధానం అవలంభిస్తున్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వ 18 నెలల పాలనలో 201920, 202324 ఏడాదికి సంబంధించి విద్యుత్ చార్జీల కింద ప్రజలపై భారాలు వేయడం తగదన్నారు. విద్యుత్ పంపిణీ సంస్థలు నియంత్రణ మండలికి పంపిన ప్రతిపాదనలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఛార్జీల పెంపుదల ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించాలన్నారు. కూటమి అధికారం లోకి వస్తే ఎటువంటి భారాలు వేయమని హామీ ఇచ్చి భారాలు మోపడం మొదలు పెట్టారన్నారు. తాజాగా 202627 ఆర్థిక సంవత్సరానికి విద్యుత్ ఛార్జీల నియంత్రణ మండలి నోటిఫికేషన్ జారీ చేసిందని దీని ప్రకారం 202626 ఏడాదికి సంబంధించి రూ 15651 కోట్ల భారం ప్రజలపై పడనుందన్నారు. కూటమి 18 నెలల పాలనలో ట్రూప్ ఛార్జీలు, సర్దుబాటు చార్జీలు, విద్యుత్ సుంకం, అదనపు లోడ్ చార్జీల పేరుతో రూ 23 వేల కోట్ల భారాలతో పాటు నెలవారీ బిల్లులో ప్రతి యూనిట్ పై 40 పైసలు వసూలు చేస్తున్నారన్నారు. 201924 కాలంలో వినియోగించుకున్న విద్యుత్ బిల్లుతో పాటు సర్దుబాటు ఛార్జీలు చెల్లించిన మళ్లీ రూ 12717 కోట్లు వసూలు చేశారని మండిపడ్డారు. సుంకాలు, సర్దుబాటు చార్జీలు, అదనపు లోడ్ ఛార్జీలు అంటూ రూ 28 వేల కోట్లు భారాలు వేయగా స్మార్ట్ మీటర్లతో అదనపు భారాలు సిద్ధంగా ఉన్నాయన్నారు.

## ప్రియురాలి కోసం కట్టుకున్న భార్య కన్న కొడుకుని కడతేర్చాడు

నరసరావుపేట క్రైమ్, డిసెంబర్ 13 ప్రభాతవార్త ::: డిసెంబర్ 5వ తేదీన పాలపాడు కాలువ వద్ద జరిగిన కందారపు త్రివేణి, ఆమె కుమారుడు శరత్ హత్య కేసు మిస్టరీ వీడింది. మృతురాలి భర్త కందా శ్రీకాంత్ నిందితుడిగా పోలీసులు విచారణలో తేల్చారు. వివరాలను డీఎస్పీ హనుమంతరావు శనివారం స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్ లో సిఐ ఎంవి సుబ్బారావు, ఎస్సై లు కిషోర్, షేక్. ఫాతిమాలతో కలిసి విలేకరులకు తెలియజేశారు. నిందితుడు శ్రీకాంత్ నరసరావుపేట లోని ఒక ల్యాబ్ లో పనిచేస్తున్నట్లు తెలిపారు. వివాహానికి ముందు నుండి ఒక యువతి తో ప్రేమలో ఉన్నాడన్నారు. సక్రమంగా ఇంటికి వెళ్లకుండా శ్రీకాంత్ తన ప్రియురాలు వద్దే ఉంటూ రెండు రోజులకు ఒకసారి వెళుతున్నాడు. ఈ విషయంపై మృతురాలు తరచుగా ఇంట్లో శ్రీకాంత్ తో గొడవ పెట్టుకుంటూ ఉంది. పెద్దలు సైతం పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. కాగా ఈనెల 5వ తేదీన ఉదయం తమ కొడుక్కి బాగోలేదని హాస్పటల్లో చూపించాలని మృతురాలు నిందితునికి ఫోన్లో తెలియజేసింది. ఈ నేపథ్యంలో కొత్తపల్లి నుండి నరసరావుపేటకు వారిని తీసుకువచ్చే సమయంలో నిందితుడు మృతురాలితో గొడవపడ్డాడు. పాలపాడు గ్రామానికి వెళ్లే మార్గంలో కాలవ కట్టపై మోటార్ సైకిల్ ఆపి నిందితుడు త్రివేణి తో ఘర్షణకు దిగాడు. ఆమెపై దాడి చేసి చంపి వేశాడు. మృతురాలి తో పాటు కుమారుడ్ని నీళ్లల్లో తోసి వేయడంతో వారు ఊపిరి ఆడక చనిపోయారు. మృతురాలి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న రూరల్ పోలీసులు విచారణ చేసి శ్రీకాంత్ ను అరెస్టు చేశారు. కాగా ఈ కేసులో నిందితుని స్నేహితురాలు పాత్ర ఎంత ఉందనేది విచారించి చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హనుమంతరావు తెలిపారు.

## కుక్కల బెడదకు ఎప్పుడు ముగింపు..?

క్రోసూరు( డిసెంబర్ 13 ప్రభాతవార్త ): క్రోసూరు మండల పరిధిలోని గ్రామాల్లో వీధి కుక్కల బెడద రోజు రోజుకూ పెరుగుతోంది. కుక్కలు గుంపులుగా స్వైరవిహారం చేస్తూ చిన్నాపెద్దా అనే తేడా లేకుండా ప్రజలపై దాడులకు పాల్పడుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో మున్సిపాలిటీల పరిధిలో వీధి కుక్కలను బంధించి అటవీ ప్రాంతాల్లో విడిచిపెట్టే చర్యలు చేపట్టేవారని, ప్రస్తుతం అలాంటి చర్యలు కనబడటం లేదని వాపోతున్నారు. దీంతో రోడ్లపై ప్రయాణించాలంటేనే ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్న పరిస్థితి నెలకొంది. శనివారం దొడ్లేరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఓ చిన్నారిపై కుక్కలు దాడి చేయడానికి యత్నించగా, స్థానికులు అప్రమత్తమై చిన్నారిని రక్షి ంచారు. వీధి కుక్కల నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

## పల్నాటి బిడ్డలు... కబడ్డీలో దిట్టలు

పెదకూరపాడు, డిసెంబర్ 13 ప్రభాత వార్త. గత మూడు రోజులుగా పెదకూరపాడు జి ఆర్ సి ఆర్ కే శ్రీ చైతన్య పాఠశాలలో మందడి శివరామ కాళిబాబు, రాయపూడి పాపయ్యవెంకట సుబ్బమ్మ, తుమూలురి ఆదినారాయణ మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబడ్డీ, వాలీబాల్ షటిల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో క్రీడా జట్లు నువ్వా నేనా అన్నట్లుగా శుక్రవారం రాత్రి నిర్వహించిన పోటిల్లో హోరాహోరీగా తలపడ్డాయి.. కబడ్డీ పురుషుల విభాగంలో పల్నాడు జిల్లా విజయదుందుభి మోగించి రాష్ట్రస్థాయిలో ఓవరాల్ ఛాంపియన్గా నిలిచింది.. పార్వతీపురం మన్యం జిల్లా ద్వితీయ స్థానంలో, మూడో స్థానంలో కాకినాడ శ్రీకాకుళం జిల్లాలు జాయింట్ విన్నర్లుగా నిలిచారు. బాలురు విభాగంలో పార్వతిపురం మన్యం జిల్లా క్రీడాకారుడు మణికంఠ బెస్ట్ రైడర్ అవార్డులు పొందారు. బెస్ట్ ఆల్ రౌండర్ గా పల్నాడు జిల్లాకు చెందిన జి హరీష్ నిలిచారు. బాలిక రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో విశాఖపట్నం జిల్లా జట్టు ప్రథమ స్థానంలో, శ్రీకాకుళం జట్టు ద్వితీయ స్థానంలో నిలిచారు. జాయింట్ విన్నర్ గా కృష్ణాజిల్లా, కర్నూలు జిల్లాలు నిలిచాయి. బాలిక విభాగంలో బెస్ట్ రైడర్ గా విశాఖకు చెందిన శ్రష్టయి కుమారి, బెస్ట్ ఆల్ రౌండర్ గా హరీష్ నిలిచారు. షటిల్ బ్యాట్మెంటల్ డబల్ పోటీలలో గుంటూరుకు చెందిన విజయ్, గోపి జోడీలు ప్రథమ స్థానంలో, గుంటూరుకు చెందిన జితేంద్ర, నవీన్ల జోడి ద్వితీయ స్థానంలో నిలిచారు. విజయవాడ విఆర్ సిద్ధార్థ ఇంజనీర్ కళాశాలకు చెందిన ప్రవీణ్ కృష్ణాల జోడి తృతీయ స్థానంలో నిలిచారు. రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలలో పల్నాడు జిల్లాకు చెందిన జి ఆర్ సి ఆర్ కే పాఠశాల, గుంటూరు జిల్లాకు చెందిన మేడికొండూరు జట్లు ప్రథమ ద్వితీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు నగదు బహుమతితోపాటు షీల్డ్ అందించారు.

**గ్రామీణ క్రీడలు ప్రోత్సహించడమే లక్ష ్యం : అర్తిమల్ల..**

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా వికాసానికి పెద్దకూరపాడు జి ఆర్ సి ఆర్ కే శ్రీ చైతన్య పాఠశాల వ్యవస్థాపకులు గుత్తా కవితా రాములు చేస్తున్న కృషి అభినందనీయమని, క్రమశిక్షణకు రాము మాస్టారు మారు పేరని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి అర్తిమల్ల రమేష్ అన్నారు... అనంతరం రాష్ట్ర కబాడీ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఎలమంచిలి శ్రీకాంత్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి కబ్బడి క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష ్యంగా రాష్ట్ర కబడీ అసోసియేషన్ పని చేస్తుందన్నారు. ఆంధ్ర తరపున జాతీయస్థాయికి, అంతర్జాతీయ స్థాయికులకు క్రీడాకారులను ప్రాతినిత్యం వహించేలా శిక్షణ ఇస్తున్నామన్నారు.... తెలుగు రైతు కార్యదర్శి భాష్యం ఆంజనేయులు, మండల టిడిపి అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య, డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ వడ్లమూడి అప్పారావు, మాజీ ఎంపీపీలు గల్లా బాబు, బెల్లంకొండ రామగోపాలరావు, పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం డైరెక్టర్ అంద్ర ప్రసాద్, రేపా సీనియర్ నాయకులు మద్దినేని సత్యం, గల్లా శివ ముంతాజ్, అజముల అంతదితరులు పాల్గొన్నారు.

## పెదకూరపాడులో అన్నదాత మహోత్సవం

పెదకూరపాడు డిసెంబర్ 13 ప్రభాతవార్త. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆవరణలో అన్నదాత మహోత్సవ కార్యక్రమం జరిగింది ఎస్బిఐ బ్రాంచ్ మేనేజర్ గోపిశెట్టి నరేంద్రబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కృష్ణయ్య పాల్గొని మాట్లాడుతూ అన్నదాతలు బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని కోరారు బ్యాంకుల ద్వారా వ్యవసాయ రుణాలను పొంది పంటలను సాగు చేసి దిగుబడులు అధికంగా పొంది తిరిగి బ్యాంకు రుణాలను చెల్లించాలని కోరారు. మంగళగిరి రీజియన్ అధికారి బి అనిల్ పాల్గొని మాట్లాడుతూ అన్నదాతలు వ్యవసాయ సంబంధమైన పరికరాలు యంత్రాలు పొందవచ్చునని తెలిపారు ఈ కార్యక్రమంలో బ్యాంకులో లావాదేవీలు నడుపుతున్న అన్నదాతలు ను శాలువులతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మహిళా రైతులు పాల్గొన్నారు బ్యాంకు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## అతావుల్లా బాబా బొగ్దాది బాబా మిషన్‌ను ముందుకు తీసుకెళ్లడమే ధ్యేయం

ఎ కొండూరు, డిశంబర్ 13, ప్రభాతవార్త :ఇరాక్‌దేశంలోని నజబ్ షరీఫ్‌లో వేంచేసి ఉన్న హుజూర్ హాజరత్ సర్కార్ మౌలా అలీ ఇబ్నె అబీతాలిబ్ (ర.అ) మహాత్ములు 21 ఎక్సీ షరీఫ్ ఆధ్యాత్మిక ధార్మిక కార్యక్రమాన్ని అలుపెరుగని అన్నదాత నకీబుల్ ఔలియా హాజరత్ ముహమ్మద్ అతావుల్లా షరీఫ్ షాతాజ్ ఖాదరీ బొగ్దాది బాబా (రఅ) వారి దివ్య ఆశీస్సులతో బాబా వారి ఆధ్యాత్మిక వారసుడు పీఠాధిపతి పీర్‌జాదా మొహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ షాతాజ్ ఖాదరీ బాబా అత్యంత



భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాజా బాబా మాట్లాడుతూ బొగ్దాది బాబా మిషన్‌ను ముందుకు తీసుకెళ్లడమే ఆధ్యాత్మిక ధార్మిక సమాజ సేవకు దర్బార్ పనిచేస్తుందని, గత అనే దశాబ్దాలకు పైగా బొగ్దాది బాబా వారు నిరతాన్నదానం నిర్వహిస్తూ పేదలకు అన్నార్తులకు బాధాతప్త హృదయులకు క్షుద్బాధ తీర్చడమే వారు ధ్యేయంగా పని చేసిందని వారి ధ్యేయాన్ని ముందుకు తీసుకెళ్ళడం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా భారతదేశ వ్యాప్తంగా ఉన్న బడేపీర్ మహాత్ములు వాని పాదపద్మాల కింద ఉన్న అవులియా అల్లాను సేవించడం ద్వార అతావుల్లా మిషన్ యొక్క ధ్యేయమని అందువల్ల వీరందరి కృపా కటాక్షాలతో బొగ్దాది బాబా కుటుంబం మొత్తం సమిదలై అన్నదాన క్రతువు నిర్వహిస్తూ మత సామరస్యానికి ప్రతీకగా అతావుల్లా బాబా, బొగ్దాది బాబా దర్బారన దేశ సమైక్యత సమగ్రతకు లౌకిక పునాదుల పటిష్టతకు పనిచేస్తూ విశ్వమానవ కళ్యాణానికి వేదికగా అతావుల్లా బాబా దర్బారన నిలుస్తోందని పీఠాధిపతి ఖాజీ బాబా పేర్కొన్నారు. కులమతాల కతీతంగా దర్బార్‌కు వచ్చిన అన్నదాన క్రతువులో బాబా వారి తనయులు జాఫర్ సాధిక్, తాజ్ ఖాదర్ తనయ బొగ్దాది, ఖాదర్ షా తదితరులు పాల్గొని సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

## 24 గంటల్లోనే రైతు ఖాతాలో నగదు జమ.చీఫ్‌విప్ జీ.వీ

వినుకొండ, డిసెంబర్13, ప్రభాతవార్త: ధాన్యం విక్రయించిన నాలుగు గంటలలోనే రైతుల ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమ చేయడం జరుగుతుందని ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. డిఆర్డిఏ వెలుగు, సివిల్ సప్లయిర్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మండలంలోని నడిగడ్డ





గ్రామంలో డ్వాక్రా సంఘం ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చీఫ్‌విప్ జీ.వీ ఆంజనేయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జీ.వీ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రభుత్వం మరింత సులభతరం చేసిందన్నారు. రైతులకు ప్రభుత్వానికి మధ్య దళారీ వ్యవస్థ లేకుండా కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆర్‌బికే, సొసైటీలు, యార్డుల్లో, వెలుగు డ్వాక్రా సంఘాల ద్వారా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులు గంటల తరబడి వేచి ఉండకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. 24 గంటల్లోనే రైతు ఖాతాల్లో నగదు జమ అవుతున్నాయని తెలిపారు. గత వైకాపా పాలనలో రైతులు తీవ్రంగా ఇబ ్బందులు పడ్డారని చెప్పారు. కూటమి ప్రభుత్వం రైతుల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయాధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ పేదలకు సంజీవిని లాంటిది.....చీఫ్‌విప్ జీ.వీ

వినుకొండ, డిసెంబర్13, ప్రభాతవార్త: సీఎం రిలీఫ్ ఫండ్ ఆపదలో ఉన్న పేదలకు వరం లాంటిదని ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. శనివారం పట్టణంలోని కొత్తపేట



నందు గల చీఫ్‌విప్ కార్యాలయం నందు నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులైన 32 మందికి రూ.32.98 లక్షలు చెక్కులు జీ.వీ అందజేశారు. ఈ సందర్భంగా జీ.వీ మాట్లాడుతూ పేదలకు సహాయం చేయాలనే సంకల్పంతో సీఎం చంద్రబాబునాయుడు నిరంతరం శ్రమిస్తున్నారని చెప్పారు. గత వైకాపా పాలనలో సీఎంఆర్‌ఎఫ్ పూర్తిగా నిర్వీర్యమైందన్నారు. పేదలకు మంచి చేసే ప్రభుత్వంపై మాజీ సీఎం జగన్‌రెడ్డి తప్పుడు ప్రచారాలు చేయడం తగదన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సెమీ క్రిస్మస్ పౌష్టిక ఆహార పంపిణీ కార్యక్రమం

పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం పసుమరు గ్రామ సచివాలయం నందు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ప్రాజెక్టు వారి ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ నిర్వహించటం జరిగింది. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు వార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బారావు సహాయంతో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం మరియు దుస్తులు పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నోడల్ ఆఫీసర్ అమృతవల్లి మాట్లాడుతూ వ్యాధిగ్రస్తులు ధైర్యంగా ఉంటూ పౌష్టికాహారం తీసుకోవటం వలన ఎక్కువ కాలం జీవించగలరని సూచించారు కార్యక్రమంలో ఏఆర్టి మెడికల్ ఆఫీసర్ టి వంశీ కృష్ణ, ఐసిటిసి కౌన్సిలర్ హనుమంతరావు సిబ్బంది డిఆర్పి ఎం వాసుదేవరావు, సూపర్వైజర్ నాగేశ్వరావు , మెర్సీ, క్లస్టర్ లింక్ వర్కర్స్ పాల్గొని నిర్వహించారు

## మైలవరం లోక్ అదాలత్ సదస్సులో జడ్జితో న్యాయవాదులు

### మైలవరం లోక్ అదాలత్‌లో 1892 కేసులు పరిష్కారం.. జడ్జి శైలజ వెల్లడి

మైలవరం, డిశంబర్ 13, ప్రభాతవార్త : జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా మైలవరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన అదాలత్‌లో 1892 కేసులు పరిష్కారమై కక్షి దారుల మధ్య రూ.26,16,850/-లు సర్దుబాటు అయినట్లు మైలవరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ జడ్జి ఎం శైలజ తెలిపారు. రాజీ పడటానికి అవకాశం ఉన్న సివిల్, క్రిమినల్ మనోవర్తి బ్యాంక్ ఎస్.టి.సి కేసులు కక్షిదారులు మధ్య రాజీ చేసుకుని సమయం డబ్బు ఆదా చేసుకున్నారని తొలుత జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో తెలిపారు. ఈ సదస్సులో మైలవరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు రావూరి రమేష్ బాబు సీనియర్ న్యాయవాదులు పివి శేషగిరిరావు, బుద్ధవరపు వెంకటరావు, వీటి కిషోర్, ఏడి ప్రసాద్, ముల్లంగి రవికుమార్, ఏపీపీ కృష్ణ కిషోర్ జూనియర్ న్యాయవాదులు ఎం తనూజ్, శివ మహిళా న్యాయవాదులు సుజిని, దివ్య పాల్గొన్నారు.

## విద్యార్థినికి ఆర్థిక సహాయం



తిరువూరు, డిశంబర్ 13, ప్రభాతవార్త :తిరువూరు రూరల్, గానుగపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత ఏడాది పది చదివి, 522మార్కులు పొందిన కొంగల తేజశ్రీ కి సప్తగిరి గ్రామీణ బ్యాంక్ (వావిలాల )మేనేజర్ ఎస్ వి వి ఎస్ ఆర్ ఆంజనేయులు సౌజన్యంతో శనివారం సాయంత్రం ఐదువేల రూపాయిలను పాఠశాల పూర్వ ఆంగ్ల ఉపాధ్యాయుడు యం. రాం ప్రదీప్, పాఠశాల సిబ్బందితో కలసి గానుగ పాడులోఅందజేశారు. సందర్భంగా ఆమెకు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వి. సాయిరాం, డి.సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల సమయంలో కనపడే నాయకులు ఎన్నికల తర్వాత గయేబ్

ఎ కొండూరు, డిశంబర్ 13, ప్రభాతవార్త : ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండలం రామచంద్రాపురం గ్రామ పంచాయతీ శివారు కోమటికుంట గ్రామ ఏకాంతద్వీపం నడుమ ప్రజలు సమస్యల వలయంలో బిక్కుబిక్కుమంటు జీవిస్తున్నారు. ఈ గ్రామ జనాభా సుమారు 600 ఉండగా ఓటర్లు సుమారు 400 మంది వరకు ఉన్నారు. ఈ గ్రామం గ్రామ పంచాయతీకి సుమారు 5 కి.ఈమీ దూరంలో ఉంది స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు కావస్తున్నా నేటివరకు ఈ గ్రామానికి ఆర్‌టిసి బస్సు సౌకర్యం లేదు. ఈ గ్రామ ప్రజలు విద్యార్థులు వ్యాపారులు ఉద్యోగులు ఆటోలను ఆశ్రయించి ప్రయాణం చేస్తున్నారు. ఈ గ్రామం డ్రైనేజి వ్యవస్త సరిగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామానికి ప్రతిరోజు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాల్సిన కృష్ణావాటర్ వారానికోసారి సరఫరా చేస్తుండటంతో ఈ గ్రామంలో ఉన్న 10మంది కిడ్నీ రోగులు, అందులో 2 డయాలసిస్ రోగులు కృష్ణావాటర్ లేక తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయి పథకం పైప్‌లైన్ నిర్మాణం పూర్తయి 3 నెలలు కావస్తున్నా నేటివరకు కృష్ణా శుద్ధి జలాల సరఫరా జరగడం లేదని గ్రామంలోని ఓవర్ హెడ్ ట్యాంకు పైప్‌లైన్‌కు ఈ కృష్ణావాటర్ సరఫరా చేయడం వల్ల కలుషిత నీరు వచ్చే అవకాశం ఉందని ఈ కృష్ణాజలాల సరఫరాకు ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటు చేసి గ్రామంలోని రక్షిత ట్యాంక్ ద్వారా కాకుండా డైరెక్ట్ పైప్‌లైన్ ద్వారా వీటికి కుళాయిలు నిర్మించి కృష్ణాశుద్ధి జలాలు సరఫరా చేయాలని ఈ గ్రామంలోని 10 మంది కిడ్నీ డయాలసిస్ రోగులు గ్రామంలోని బడుగు బలహీన వర్గాల ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ గ్రామానికి నెలకొకసారి వచ్చే 104 వాహనంలో మందులు సరిగా ఉండడం లేదని నామ్‌కే వాస్తేగా వచ్చి బిపి షుగర్ పరీక్షలు చేయడం తప్ప మందులు ఇవ్వడం లేదని రోగులు ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా ఈ గ్రామానికి డ్రైన్ సౌకర్యాల నిర్మాణం ఆర్టీసి బస్సు సౌకర్యం వెంటనే ఇంటింటి కుళాయిలకు కృష్ణా శుద్ధి జలాలు సరఫరా చేయాలని 5 కి.మీ దూరంలోని సచివాలయంను ఉద్యోగులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకొని తమ కష్టాలను గట్టెక్కించి పుణ్యం కట్టుకోవాల్సిందిగా కిడ్నీ డయాలసిస్ రోగులు ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

### జాతీయ రహదారి ప్రమాదాల నివారణకు ఎస్సై గంధం

## మహాలక్ష్ముడు చర్యలు భేష్

ఎ కొండూరు, డిశంబర్ 13, ప్రభాతవార్త : ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు పోలీస్ సర్కిల్ పరిధిలోని ఎ కొండూరు పోలీస్ స్టేషన్‌కు ఇటీవల కొత్తగా వచ్చిన ఎస్సై గందం మహాలక్ష్ముడు శాంతి భద్రతల పరిరక్షణ పేకాట జూద క్రీడల నియంత్రణతో పాటు విజయవాడ మైలవరం తిరువూరు జగదల్‌పూర్ జాతీయ రహదారి ప్రమాదాల నివారణకు తీసుకున్న చర్యల పట్ల మండల ప్రాంత ప్రజలు హర్షించారు. గతంలో ఈ మండలంలో హైవేపై ప్రమాదాలు నిత్యం జరుగుతుండేవి ఇటీవల కొత్తగా వచ్చిన ఎస్సై మహాలక్ష్ముడు జాతీయ రహదారి ప్రమాదాల జాతీయ రహదారిపై డ్రమన ఏర్పాటుతో ప్రమాదకర ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయడం వల్ల ఇటీవల రహదారి ప్రమాదాలు బాగా తగ్గాయని ప్రజలు పలువాహన చోదకులు అభిప్రాయపడుతున్నారు. ఈ జాతీయ రహదారిపై పోలీస్ పెట్రోలింగ్ మొబైల్ వాహనం తరచూ చక్కర్లు కొడుతుండడంతో అనేక మంది వాహనదారులు ఓవర్‌స్పీడ్‌ను తగ్గించుకుని వాహనాలు నడుపుతుండడం అలాగే అనేకమంది మద్యం సేవించి ద్విచక్రవాహనాలు నడిపే చోదకులు మద్యం మత్తులో వాహనాలు నడిపే చోదకులు మద్యం చాలావరకు నియంత్రించుకున్నారు. అలానే ఈ మండలంలో గతంలో పేకాట కోడిపందాలు క్రికెట్ పందాల బెట్టింగ్‌ల జోరు, చిత్తాట నెంబర్లాట గుట్టు చప్పుడు కాకుండా ఖాకీల సహకారంతో నడిపేవారు కాని నేడు ఎస్సై సిబ్బంది వ్యవహార శైలి పనితీరు కఠినంగా ఉండడం వల్ల జూదరుల గుండెల్లో పోలీసుల వ్యవహారశైలి వల్ల రైళ్లు పరిగెడుతున్నాయి. ప్రస్తుతం నూతనంగా వచ్చిన ఎస్సై అధికార పార్టీకే తల ఒత్తిళ్లకు తలొగ్గి విధి నిర్వహణ చేస్తున్నారని వైసిపి పట్ల కొంత వ్యతిరేకంగా పనిచేస్తున్నారని అలాకాకుండా రాజకీయ పార్టీలకతీతంగా చట్టప్రకారం పనిచేస్తూ ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇచ్చి శాంతి భద్రతల విషయంలో ఎటువంటి రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిజాయితీగా పనిచేసి ధన మాన ప్రాణ రక్షణకు కృషి చేయాలని మండల ప్రాంత ప్రజలు కోరారు.

## విద్యార్థులకు,వ్యక్తిగతపరిశుభ్రత పై అవగాహన సదస్సు

తెనాలి టౌన్ డిసెంబర్13(ప్రభాతవార్త): వ్యక్తిగత పరిశుభ్రత స్త్రీ సంబంధిత వ్యాధులు వాటి నివారణ పై రోటరీ క్లబ్ తెనాలి వైకుంఠపురం ఆంధ్ర పారిస్ రోటరీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.శనివారం స్థానిక వివేక ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్లో జరిగిన కార్యక్రమంలో గైనిక్ సంబంధించిన వ్యాధులు వాటి నివారణపై రొటేరియన్ డాక్టర్ జీవనలత విద్యార్థులకు వివరంగా వివరించారు.రోటరీ డిసిగ్నేటెడ్ మంత్ లో భాగంగా ఆరోగ్యం పై అవగాహన సదస్సు ఏర్పాటు చేయటమైనది ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచందు కార్యదర్శి గుమ్మడి వెంకట్ నారాయణ డిస్ట్రిక్ట్ క్యాబినెట్ మెంబర్స్ గుత్తా వెంకటరత్నం కన్నెగంటి మురళీకృష్ణ పావులూరి రాంబాబు ప్రెసిడెంట్ ఎలెక్ట్ గుమ్మడి సరోజ్ బాబు, హ్యాపీ స్కూల్స్ డైరెక్టర్ బత్తుల వెంకటేశ్వర రావు వివేక విద్యాసంస్థల డైరెక్టర్ వీర నారాయణ రావు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామరాజు రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

## కళ్యాణ వెంకటేశ్వరునికి గానామృత నీరాజనం:

తెనాలి మున్సిపాలిటీ డిసెంబర్13(ప్రభాతవార్త): పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలోగల నారాయణ అష్టోత్తర దివ్య క్షేత్రం నందు, కళ్యాణ వెంకటేశ్వరుని గానామృతం వీనులవిందుగా నిర్వహించారు.శ్రీవిఖానస శ్రీనివాస ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించబోతున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వరుని దేవస్థానం నందు శనివారం, ఏడుకొండలవాసునికి ఏడు శనివారాలు పేరిట జరుగుతున్న,శ్రీనివాసుని గానామృతం కార్యక్రమంలో, నేడు నాలుగవ శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.గత మూడు శనివారాల నుండి నిర్వహిస్తున్న శ్రీనివాసుని గానామృత కార్యక్రమం,ఆఖరి శనివారం ఏడవ వారం జనవరి మూడవ తేదీన పూర్తవుతుందని,ఆరోజు అత్యంత వైభవంగా శ్రీనివాసుని కల్యాణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కావున భక్తులు ధన,కనక,వస్తు రూపంలో విరాళాలు అందించి,ఈదేవాలయ అభివృద్ధికి పాటుపడవలసిందిగా నిర్వాహకులు ఆర్ వి.కిరణ్ కుమార్ తెలిపారు. కార్యక్రమ అనంతరం పెద్ద ఎత్తున విచ్చేసిన భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందించారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

చెరుకుపల్లి, డిసెంబర్ 13, ప్రభాతవార్త : అతివేగంతో వెళ్తున్న రెండు బైకులు ఢీకొని ఇరువురు వ్యక్తులు మృతి చెందిన సంఘటన మండలంలోని ఎన్ఎస్ఎల్ సమీపంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై టి అనిల్ కుమార్ వివరాల ప్రకారం పిట్టల వారి పాలెం మండలం చిన్నమట్లపూడి గ్రామానికి చెందిన జాన్ సైదా, భార్య హసీనా, కుమారుడు జాహిద్ ముగ్గురు బైక్ పై పిట్లవారిపాలెం వైపు వస్తుండగా అదే సమయంలో చందోలవైపు వెళుతున్న నగరం మండలం పెద్దపల్లి గ్రామానికి చెందిన భాను ప్రకాష్ బైకు ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న జాన్ సైదా భాను ప్రకాష్ ఇరువురు అక్కడికక్కడే మృతిచెందగా జాన్ సైదా భార్య హసీనా కు కాలు విరగగా కుమారుడు జాహిద్ కు స్వల్ప గాయాలయ్యాయి. వీరు ఇరువురిని మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు వైద్యశాలకు తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో ఇరువురు తమ మోటార్ బైకులు అతివేగంగా నడపడం వల్ల ప్రమాదం తీవ్రస్థాయిలో జరిగినట్లు అందువల్లే బైక్ నడిపే ఇరువురు మృతి చెందడం జరిగిందని ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపారు. మృతుడు జాన్ సైదా ఫోన్ నెంబర్ బావమరిది షేక్ మస్తాన్ వలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు.

## సెమీ క్రిస్మస్ వేడుకలు




రేపల్లె, డిసెంబరు 13, ప్రభాతవార్త:స్థానిక మౌంట్ ఫోర్ట్ పాఠశాలలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు.క్రీస్తు జననం గురించి నాటిక రూపంలో విద్యార్థులు ప్రదర్శించారు.ఏసుప్రభు జననాన్ని,క్రీస్తు సందేశాన్ని రెవరెండ్ ఫాదర్ క్రాంతి వివరించారు.విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్,వైస్ ప్రిన్సిపాల్ ప్రదీప్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి

రేపల్లె, డిసెంబరు 13, ప్రభాతవార్త:భక్తులను కాపాడే కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి మహిమలు శుభపరిణామమని జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు అన్నారు.శనివారం మండలంలోని పోటుమెరక జలార్తమ్మ ఎస్టీ కాలనీలో తిరుమల తిరుపతి దేవస్థానముల ఆర్థిక





నిధులతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మాణం జరిగిన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా హేమశంకర రావు మాట్లాడుతూ కలియుగంలో వెంకటాద్రి తిరుమలకు మించిన క్షేత్రం లేదని వెంకటేశ్వర స్వామికి మించిన దైవం లేదని అటువంటి దైవం పోటుమెరకలో కొలువుదీరి ఉందని అన్నారు.బొల్లిముంత సుందరరామిరెడ్డి తనయుడు బొల్లిముంత వెంకయ్యనాయుడు భక్తులకు అన్నప్రసాదం అందించారు.ఈ కార్యక్రమంలో మండల సహ కన్వీనర్ శొంఠి బాబూరావు,రేపల్లె చెంచయ్య,శ్రీకృష్ణయ్య, జి.లీలాకుమారి,కాగితాల వెంకట పున్నమ్మ,అర్చకుడు కట్టా మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మంత్రి అనగాని పర్యటన

రేపల్లె, డిసెంబరు 13, ప్రభాతవార్త:రేపల్లె మండలంలో ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పర్యటిస్తారు.రూ.10.2 కోట్లతో నిర్మించనున్న పెనుమూడి-లంకెవానిదిబ్బ రహదారికి రాజుకాల్వ వద్ద శంకుస్థాపన చేస్తారు.అనంతరం లంకెవానిదిబ్బ గ్రామంలో యానాదుల సామాజిక సభా మందిరాన్ని ప్రారంభిస్తారు.రాష్ట్ర గృహ నిర్మాణ, విఆర్ఓ సంస్థల సంయుక్త సహకారంతో నిర్మితమవుతున్న 39 పిఎంఎవై గృహాలకు మంత్రి అనగాని సత్యప్రసాద్ శంకుస్థాపన చేస్తారు.

## డిసెంబరు 31న పెన్షన్లు పంపిణీ

భట్టిప్రోలు(రేపల్లె), డిసెంబరు 13, ప్రభాతవార్త:డిసెంబరు నెలకు సంబంధించి 2026 సంవత్సరం జనవరి 1వ తేదీ కాకుండా డిసెంబరు 31వ తేదీ ఉదయం 6.30 గంటలకు గ్రామ,వార్డు,సచివాలయ సిబ్బంది పెన్షన్లను అందజేస్తారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా శనివారం తెలిపారు.సాంకేతిక సమస్యలు తలెత్తితే జనవరి 2వ తేదీ పెన్షన్ పంపిణీ చేస్తారని ఆయన చెప్పారు.పెన్షన్ దారులు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్ళాల్సిన పన్లేదని ఇంటి వద్దనే పెన్షన్లు పొందవచ్చునన్నారు.

## నేడు పూర్వవిద్యార్థుల సమ్మేళనం

భట్టి ప్రోలు(రేపల్లె), డిసెంబరు 13, ప్రభాతవార్త:భట్టి ప్రోలులోని తమ్మన మల్లికార్జునరావు ఉన్నత పాఠశాలలో ఆదివారం 1974-79 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరుగుతుందని నిర్వాహకులు తూనుగుంట్ల రమేష్,తూనుగుంట్ల మల్లికార్జునరావులు శనివారం తెలిపారు.ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని వారు పేర్కొన్నారు.

## బున్నీనగర్‌లో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

యడ్లపాడు, డిసెంబర్ 13, ప్రభాతవార్త : మండల పరిధిలోని చెంఘీస్ఖాన్‌పేట పంచాయితీ పరిధిలోని బున్నీనగర్‌లో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలలో ముఖ్య అతిథులుగా గుంటూరు జిల్లా పరిషత్ చైర్మన్ హెనీ క్రిస్టినా, మండల టీడీపీ అధ్యక్షులు కామినేని సాయిబాబు పాల్గొన్నారు. పాస్టర్లు క్రిస్ మస్ సందేశాన్ని చదివి వినిపించారు. అనంతరం విచ్చేసిన



వారికి బట్టల పంపిణీ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా మతభేదం లేకుండా జరుపుకునే ప్రధాన మతపరమైన మరియు సాంస్కృతిక పండుగగా పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ 25న జరిగే ఈ పండుగ రోజు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించటం జరుగుతుందన్నారు. ప్రేమ, ఆశ, శాంతి, దయలను ప్రపంచానికి అందించిన యేసు క్రీస్తును స్మరించుకోవడమే ఈ పండుగ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ఎలీషా, స్థానిక సర్పంచ్ ఏనాదుల అంజనేయులు, మండల బీసీ సెల్ అధ్యక్షులు నాగేశ్వరరావు, గద్దం శ్రీను, డి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని పర్యవేక్షించుకోవాలి:కమిషనర్ రామచంద్రరావు

రేపల్లె, డిసెంబరు 13, ప్రభాతవార్త:పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని రాజం మున్సిపల్ కమిషనర్ ఆకురాతి రామచంద్రరావు అన్నారు.శనివారం రేపల్లె ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలి,నీరు,భూమి,చెట్లు వంటి సహజ వనరులను రక్షించుకోవడం ద్వారా పర్యావరణ పరిరక్షణ ఏర్పడగలదన్నారు.ప్రజల కార్యకలాపాల వల్ల కలిగే కాలుష్యాన్ని తగ్గించి ప్రకృతి సమతుల్యతను కాపాడుకోవాలని ఆయన పేర్కొన్నారు.మొక్కలు నాటడం ప్లాస్టిక్ నిర్మూలన,నీటిని సంరక్షించడం,వ్యర్థాలను నిర్మూలించడం వంటి చర్యలు తీసుకుంటే ఆరోగ్యకరమైన వాతావరణం లభిస్తుందని రామచంద్రరావు చెప్పారు.భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందుబాటులోకి తేవాలని ఆయన కోరారు.రేపల్లె ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ పృధ్వీ గణేష్ మాట్లాడుతూ ప్రకృతిని రక్షిస్తే ప్రకృతి మనల్ని కాపాడుతుందని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు.పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని భూమిని కాపాడుకుందామని ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో షేక్ మొహిద్దీన్,దార్ల వెంకట్రావు,వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాపట్ల జిల్లా వార్త



## ప్రతి రైతు ధాన్యం... కొనుగోలు చేయాల్సిందే

పొన్నూరు, డిసెంబర్ 13,ప్రభాతవార్త: ప్రతి రైతు ధాన్యం కొనుగోలు చేయాల్సిందేనని తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ ఆదేశించారు. నిడుబ్రోలులోని ఓ రైస్ మిల్లు యజమానులు రైతులను అగౌరవపరిచేవిధంగా మాట్లాడడంతో మిల్లు యజమానులు, రైతుల మధ్య వాగ్వాదం చోటు



చేసుకొంది. దీంతో రైతులు మిల్లు వద్ద ఆందోళన చేశారు. ఈ విషయాన్ని తహశీల్దార్‌కు చేరవేశారు. దీంతో తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ హుటాహుటిన మిల్లు వద్దకు వచ్చి పరిస్థితిని చక్కదిద్దారు. తాము ధాన్యం విక్రయించుకునేందుకు వస్తే మిల్లు యజమానులు వారి ఇష్టం వచ్చినట్లు మాట్లాడడతంతో పాటు సరైన సమాధానం చెప్పకపోవడంతో ఆందోళన చేపట్టాల్సి వచ్చిందని పలువురు రైతులు తహశీల్దార్‌కు వివరించారు. దీంతో తహశీల్దార్ ఇరువురితో మాట్లాడి పరిస్థితిని చక్కదిద్దారు. మిల్లర్లు ప్రతి రైతు వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేయాల్సిందేనని, కుంటి సాకులు చెప్పి తప్పించుకోవాలనుకుంటే కుదరదని తేల్చి చెప్పారు. కొంత మంది మిల్లుల యజమానులు గోతాలు ఇవ్వకుండా తిప్పించుకొంటున్నారని తమ దృష్టికి వచ్చిందని, ప్రభుత్వం సరిపడా గోతాలు సరఫరా చేస్తుందని, గోతాలకు ఎలాంటి కొరత లేదని తహశీల్దార్ చెప్పారు. ఏ మిల్లు యజమాని అయినా గోతాలు కొరత ఉంట తమ దృష్టికి తీసుకువస్తే ఉన్నతాధికారులతో మాట్లాడి అవసరమైన మేరకు గోతాలను తెప్పిస్తామని చెప్పారు. రైతులను పదే పదే మిల్లుల వెంట తిప్పించుకుంటే సహించేది లేదన్నారు. జిల్లా ఉన్నతాధికారులు, సాక్షాత్తు పౌరసరఫరాల మంత్రి, స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ రైతులను ఇబ్బంది పెట్టకుండా ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారని, తహశీల్దార్ గుర్తు చేశారు. ఆపదలో ఉన్న రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత, ధర్మం ప్రభుత్వంతో పాటు మిల్లుల యజమానులకు, రైతు సేవా కేంద్రం సిబ్బందిపై ఉందన్నారు.మండలంలో ఎవరూ మా ధాన్యం కొనుగోలు చేయడం లేదని తమ దృష్టికి తీసుకురాకుండా మిల్లుల యజమానులు దృష్టి సారించాలని తహశీల్దార్ ఆదేశించారు.

## పొన్నూరు రూరల్ ఎస్సైగా వాగాల శ్రీహరి




పొన్నూరు, డిసెంబర్ 13,ప్రభాతవార్త: పొన్నూరు రూరల్ ఎస్సైగా వాగాల శ్రీహరి శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. పొన్నూరు అర్బన్ ఎస్సైగా పనిచేస్తున్న శ్రీహరి బదిలీపై రూరల్‌కు వచ్చారు. ఈయన గతంలో కర్లపాలెం, తుళ్ళూరు, తెనాలి, అమరావతి తదితర స్టేషన్లలో పనిచేశారు. శ్రీహరి ఎక్కడ పనిచేసినా అక్కడి పరిస్థితులకు అనుగుణంగా శాంతిభద్రతలను పరిరక్షిస్తూ మంచి పేరు తెచ్చుకున్నారనే పేరుంది. పొన్నూరు అర్బన్‌లో కూడా పనిచేసి మంచి ఎస్సైగా గుర్తింపు పొందారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీహరి మాట్లాడుతూ రూరల్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పరిరక్షిస్తానన్నారు. గంజాయి, పేకాట, తదితర అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు.

## లోక్ అదాలత్‌లో 696 కేసులకు పరిష్కారం

పొన్నూరు, డిసెంబర్ 13,ప్రభాతవార్త: స్థానిక సవిల్ జడ్జి కోర్టులో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 696కేసులకు పరిష్కారం లభించిందని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.రుక్మిణి చెప్పారు. వీటిలో సివిల్, క్రిమినల్ కేసులు-168, ఎస్‌టీసి కేసులు-528, వెరశి 696కేసులకు పరిష్కారం




లభించిందన్నారు. ఈ పరిష్కారం కింద రూ.33,73,378 కక్షిదారులకు ఇప్పించడం జరిగిందన్నారు. సివిల్ కేసులు-25, అమలు పిటీషన్-12, మనోవర్తి కేసు-1, చెక్ బౌన్స్ కేసులు-2, ఎక్సైజ్ కేసులు-27,క్రిమినల్ కేసులు-112 పరిష్కరించినట్లు చెప్పారు. రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకునేందుకు ఈ లోక్ అదాలత్‌లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి జి.రుక్మిణితోపాటు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ బాజిసాహెబ్,మాజీ అధ్యక్షుడు పొందుగల జయరాజు, మునిసిపల్ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాది తుమాటి రమేష్, న్యాయవాదులు వట్టికూటి లీలాప్రసాద్, గండు శ్రీనివాసరావు, మగ్బుల్‌బేగ్, మల్లెల ఈరేష్, నక్కా కృష్ణ, సదానందరావు, పి.విజయకుమార్, మునిపల్లె సాయిబాబు, న్యాయవాది గుమాస్తాలు,పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. లోక్ అదాలత్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి జడ్జి రుక్మిణి కృతజ్ఞతలు తెలిపారు.

## హెల్మెట్ బరువు కాదు....అది మీ ప్రాణానికి రక్షణ కవచం

బాపట్ల, డిసెంబర్ 13,ప్రభాతవార్త: హెల్మెట్ బరువు కాదు....అది మీ ప్రాణానికి రక్షణ కవచం అని, ప్రతి ఒక్కరూ తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బాపట్ల జిల్లా పోలీసు అధికారులు శనివారం జిల్లా వ్యాప్తంగా హెల్మెట్ వినియోగంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. దిచక్ర వాహనదారుల్లో హెల్మెట్ ధారణతో పాటు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. పోలీసులు ప్రధాన రహదారులు, కూడళ్ళలో వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రమాదం సంభవించినప్పుడు హెల్మెట్ తలకు తీవ్ర గాయాలు కాకుండా





రక్షిస్తుందన్నారు. ప్రతి ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ ధరించాలని కోరారు. ప్రత్యేకంగా హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించిన వాహనదారులను అభినందించారు. హెల్మెట్ ధరించడం కేవలం చట్టపరమైన బాధ్యత మాత్రమే కాదని, తమ ప్రాణాలను కాపాడుకునే ముఖ్యమైన భద్రతా చర్యగా భావించాలని కోరారు. రోడ్డు ప్రమాదంలో మరణిస్తున్నవారిలో ఎక్కువ మంది ద్విచక్రవాహనాలపై ప్రయాణించే వారేనన్నారు. దీనికి ప్రధాన కారణం హెల్మెట్ ధరించకపోవడమేనన్నారు. ఇటీవల చెరుకుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రధానంగా తలకు తగిలిన తీవ్రమై గాయాల కారణంగా ఇద్దరు వ్యక్తులు ప్రాణాలను కోల్పోయారన్నారు. అదేవారు హెల్మెట్ ధరించి ఉన్నట్లయితే ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉండేదన్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిరంతరం అగాహనా కార్యక్రమాలు, ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల సహకారం ఉంటేనే ప్రమాదాలను సమర్ధవంతంగా తగ్గించగలమన్నారు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని ఎస్పీ ఉమామహేశ్వర్ కోరారు.

## శాంతి బాటలోనే సంతోషం

రేపల్లె, డిసెంబరు 13, ప్రభాతవార్త:క్రీస్తు చూపిన శాంతి బాటలో పయనిస్తే సంతోషంతో జీవితం కొనసాగుతుందని రేపల్లె సీనియర్ సివిల్ జడ్జి వెన్నెల అన్నారు. రేపల్లె బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి.క్రిస్మస్ కేక్ కట్ చేసి క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఏసు క్రీస్తు జన్మదినాన్ని జరుపుకోవడం విశేషమన్నారు.సర్వ మానవాళి సుఖ సంతోషాలతో ఆనందంగా జీవించాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవిసాయి శ్రీవాణి,అడిషనల్ సివిల్ జడ్జి గీతా భార్గవి,రేపల్లె బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గరికపాటి గిరిధర్,రేపల్లె మున్సిపల్ వైస్ ఛైర్మన్,సీనియర్ న్యాయవాది గుజ్జర్లమూడి ప్రశాంత్ కుమార్,పెద్దపల్లి జాన్ హనోక్,సీనియర్ న్యాయవాదులు మేకా పూర్ణచంద్రరావు,ఎ.సుష్మా స్వరాజ్,న్యాయవాదులు పాల్గొన్నారు.



## ఆయుర్వేద వైద్యానికి మరింత ఆదరణ

కొల్లిపర,డిసెంబరు 13 ప్రభాతవార్త: ఆయుర్వేదం అనేది శరీరం..మనస్సు..ఆత్మ..పర్యావరణం మధ్య సమతుల్యతను ప్రోత్సహించే భారతదేశ సంప్రదాయ వైద్యవిధానమని మండల ఆయుర్వేద వైద్యాధికారి సాయికుమార్ అన్నారు.శనివారం మండల పరిధిలోని మున్నంగిలో ఆయుర్వేద




వైద్యాధికారులు ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు.షుగర్,బీపీ వ్యాధిగ్రస్తులు చలికాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై తగిన సూచనలు..సలహాలు ఇచ్చారు.ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం వలన ఎటువంటి సైడ్ఎఫెక్ట్స్ ఉండవని వైద్యులను సంప్రదించి మందులను వాడుకోవటం మంచిదన్నారు.ఆయుర్వేద వైద్యానికి రాను రాను మరింత ఆదరణ పెరుగుతుందన్నారు.ఆయుర్వేద వైద్యం మన పూర్వికుల నుండి అనాదిగా వస్తుందన్నారు.ఆయుర్వేద వైద్య విధానంలో అన్ని రకాల వ్యాధులకు వైద్యం పొందవచ్చన్నారు.నేటి దైనందిన జీవితంలో ఆయుర్వేదం వైద్యం వలన ఎంతో మేలు జరుగుతుందన్నారు.కార్యక్రమంలో మాజీ మండల ఉపాధ్యక్షుడు కళ్ళం వెంకటప్పారెడ్డి,గ్రామ పెద్దలు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ధాన్యాన్ని ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలి

వేమూరు డిసెంబర్ 13 (ప్రభాతవార్త) : రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వమే నేరుగా ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా కొనుగోలు చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాడికొండ వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం వేమూరులో విలేఖర్లతో మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతు సేవా కేంద్రాల ద్వారా రైస్ మిల్లులకు ధాన్యం పంపిస్తుందన్నారు. మిల్లర్లు రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు రైతులను నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తేమ శాతంలో వ్యత్యాసం ఉందంటూ ధాన్యంలో తరుగు తీస్తున్నారన్నారు. అంతే కాకుండా రైతులు తీసుకువెళ్ళిన ధాన్యాన్ని బ్యాంక్ గ్యారంటీ లేదంటూ వెనక్కి పంపుతున్నారన్నారు. మిల్లర్లు పెట్టే ఇబ్బందులు పడలేక రైతులు తమ ధాన్యాన్ని తక్కువ రేట్లకు విక్రయించుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందని వెంకటేశ్వరరావు



తెలియజేశారు. ఇందుమూలంగా రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వమే ధాన్యాన్ని నేరుగా కొనే విధంగ మార్క్‌ఫెడ్, బిసిఎంఎల్‌ల ద్వారా కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలుపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం కూడా ఉందన్నారు. లేని పక్షంలో రైతు పక్షంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని తాడికొండ వెంకటేశ్వరరావు హెచ్చరించారు.

## నిబంధనల ప్రకారం మద్యం విక్రయాలు జరగాలి



వేమూరు డిసెంబర్ 13 (ప్రభాతవార్త) : ప్రభుత్వ నిబంధనల మేరకు మద్యం దుకాణాల్లో విక్రయాలు జరగాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమీషనర్ కె.విజయ తెలియజేశారు. శనివారం వేమూరు ఎక్సైజ్ స్టేషన్ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మద్యం దుకాణాల విక్రయాల్లో జరుగుతున్న తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు వివరాలు, లోక్ అదాలత్ ద్వారా పరిష్కారం పొందిన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సురక్ష యాప్ వినియోగంపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని తెలియజేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమెతో పాటు ఎక్సైజ్ సిఐ ఏ.రవి, ఎస్సై శ్రీరామ్ శ్రీకాంత్ సిబ్బంది ఉన్నారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ఏఐఎస్ఎఫ్ రాష్ట్రవ్యాప్త ధర్నా:

తెనాలి మున్సిపాలిటీ డిసెంబర్13 (ప్రభాతవార్త): రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణను నిరసిస్తూ,అఖిల భారత విద్యార్థి సమితి (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో డిసెంబర్ 18న రాష్ట్రవ్యాప్త ధర్నాకు పిలుపు ఇచ్చినట్లు ఏఐఎస్ఎఫ్ నాయకులు తెలిపారు. శనివారం పట్టణంలోని గాంధీ నగర్ లో గల సిపిఐ




పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీ లను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడాన్ని నిరసిస్తూ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ధర్నా డిసెంబర్ 18న రాష్ట్రవ్యాప్త ధర్నా నిర్వహించనున్నట్లు,ఈ సందర్భంగా ప్రభుత్వ నిర్ణయాన్ని ఖండిస్తున్నట్లు నాయకులు తెలిపారు. ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం ప్రభుత్వ పరిధిలోని విద్యా విధానం అమలుపై నిరంతర పోరాటాలు చేస్తుందని పేద విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం స్కాలర్షిప్ల మంజూరు కాస్మటిక్ చార్జీల పెంపు మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై నిరంతరం పోరాటాలు చేస్తుందని, నేడు కూడా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్త ధర్నాలు విద్యార్థులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## తెనాలి కోర్టులో జాతీయ లోక్ అదాలత్:

తెనాలి మున్సిపాలిటీ డిసెంబర్13(ప్రభాతవార్త):పట్టణంలో కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ శనివారం నిర్వహించారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి. శ్రీనివాసులు నేతృత్వంలో జరిగిన లోక్అదాలత్ కార్యక్రమంలో, న్యాయమూర్తులు, ఎలంవుర్ం న్యాయవాదులు, పోలీస్ అధికారులు,కక్షి దారులు పాల్గొన్నారు. కేసుల పరిష్కారాలకు గాను పలు బెంచ్ లను ఏర్పాటు చేసి విచారణ జరిపారు. లోక్ అదాలత్ అనేది కోర్టుల బయట వివాదాలను త్వరగా ఉచితంగా సామరస్యంగా పరిష్కరించడానికి ఏర్పాటు చేయబడిన ఒక వేదికని,దీనికి చట్టబద్ధమైన హోదా ఉందని, ఇది పెండింగ్లో ఉన్న కేసులను మరియు కోర్టులకు వెళ్ళని కేసులను కూడా పరిష్కరిస్తుందని,దీని తీర్పులు సివిల్ కోర్టు తీర్పులతో సమానమని,అంతే కాకుండా ప్రజలకు న్యాయాన్ని సులభంగా పొందేందుకు సహాయపడుతుందని న్యాయమూర్తి డి.శ్రీనివాసులు తెలిపారు.ముఖ్యంగా ఆస్తి వివాదాలు,కుటుంబ సమస్యలు,చెక్ బౌన్స్,ట్రాఫిక్ చలాన్లు వంటి సమస్యలను లోక్అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని ఆయన సూచించారు.




## అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసిన పోలీసులు:

తెనాలి టౌన్ డిసెంబర్13(ప్రభాతవార్త): ఎటువంటి అనుమతులు, బిల్లులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసి,ఇసుక తరలిస్తున్న వ్యక్తులను అరెస్టు చేసిన తెనాలి రూరల్ పోలీసులు. రూరల్ గ్రామం పెదరావూరు లో శనివారం ఉదయం అక్రమంగా ఇసుకను తరలించి అమ్ముకుంటున్నారని వచ్చిన సమాచారం మేరకు తెనాలి రూరల్ సీఐ షేక్ నాయబ్ రసూల్,ఎస్సై ఆనంద్ మరియు సిబ్బంది ప్రత్యేక నిఘా పెట్టగా, కొల్లూరు మండలం పెసర్లంక కృష్ణానది తీరం నుండి అక్రమంగా ఇసుకను లోడ్ చేసుకుని ఎటువంటి అనుమతులు గాని ప్రభుత్వబిల్లులు గాని లేకుండా తరలించి ఇతర ప్రాంతాల్లో అధిక రెట్లకు అమ్ముకుంటున్న ఏడు ట్రాక్టర్లను,వాటి డ్రైవర్లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసిన రూరల్ పోలీస్ సిబ్బంది.ఈ సందర్భంగా రూరల్ సీఐ షేక్ నాయబ్ రసూల్ మాట్లాడుతూ,వచ్చిన సమాచారం మేరకు అక్రమ ఇసుక రవాణా వాహనాలను సీజ్ చేసి డ్రైవర్ల పై కేసులు నమోదు చేశామని, ఇకపై నిరంతరం ఇసుక అక్రమ రవాణాపై మరింత నిఘా పెంచుతామని,గతంలో కూడా అక్రమ ఇసుకరవాణా వాహనాలను సీజ్ చేయటం జరిగిందని,అలాగే కొల్లిపర ప్రాంతంలో కూడా పది ట్రాక్టర్లను పట్టుకుని కేసులు నమోదు చేశామని కావున ఎవరూకూడా ఇలాంటి చర్యలకు పాల్పడవద్దని,అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.



## మెగా లోక్ అదాలత్‌లో 1608 కేసులకు పరిష్కారం

రేపల్లె, డిసెంబరు 13, ప్రభాతవార్త:న్యాయస్థాన ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు.మూడు బెంచ్‌లను ఏర్పాటు చేసి 59 సివిల్,1547 క్రిమినల్,2 ప్రీలిటిగేషన్ కేసులను పరిష్కరించారు.1608 కేసులను పరిష్కరించడం ద్వారా కక్షిదారులకు రూ.80 లక్షలు మేర ఆర్థిక ప్రయోజనం చేకూరింది.మండల న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షురాలు,సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌పిడి వెన్నెల పర్యవేక్షణలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.దేవీసాయి శ్రీవాణి,అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.గీతా భార్గవి,లోక్ అదాలత్ సభ్యులు మోర్ల కృష్ణారావు,ఉప్పాల శ్రీనివాసరావు,సీనియర్ న్యాయవాది మేకా పూర్ణచంద్రరావు,కక్షదారులు,పోలీసులు,న్యాయవాదులు పాల్గొన్నారు.



## మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

గుంటూరు విద్య, డిసెంబర్ 13, ప్రభాతవార్త : గుంటూరు అమరావతి రోడ్డు లోని హిందూ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు నిరుద్యోగ అభ్యర్థుల నుండి విశేష స్పందన వచ్చింది. ఈ కార్యక్రమం కు రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ అధ్యక్షతన వహించారు.మెగా జాబ్ మేళా ద్వారా 951మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. హిందూ కాలేజ్ ఆఫ్ ఫార్మసి అమరావతి రోడ్ జరిగిన మెగా జాబ్ మేళాలో కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొని నిరుద్యోగులకు ఉద్యోగ



జాయినింగ్ ఆర్డర్స్ అందజేశారు. మెగా జాబ్ మేళాలో 2850 మంది పాల్గొన్నారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ గడచిన 5 ఏళ్లలో రాష్ట్రం పూర్తిగా నష్టపోయిందని ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో రాష్ట్రం 20 లక్షల ఉద్యోగాలే లక్ష్యంగా పనిచేస్తూ ఉన్నదని చెప్పారు.,బ్రాహ్మణులు ఎల్లప్పుడూ సమాజ శ్రేయస్సు కోసం పనిచేస్తుంటారని కొనియాడారు.ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్రంలో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టి 951 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడం శుభ పరిణామం అభినందనీయమని కొనియాడారు. శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జాబ్ మేళాల ద్వారా చైతన్యాన్ని పెంచి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తూ సామాజిక సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం ప్రశంసనీయమన్నారు. ఏపీ బయోడైవర్సిటీ బోర్డ్ చైర్మన్ నీలాయపాలెం విజయకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గాలలోను జాబ్ మేళాలను ప్రోత్సహిస్తున్నదని, అందుకు భిన్నంగా ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య జాబ్ మేళా ద్వారా తన సామాజిక వర్గంలోని నిరుద్యోగులకు కాక ఇతర సామాజిక వర్గాల్లో నిరుద్యోగులకు కూడా ఉద్యోగాలు ఇప్పించే ఆలోచన చేయటం అభినందనీయమన్నారు,కార్యక్రమంలో కాలేజ్ చైర్మన్ జూపూడి రంగరాజు,సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్ కె మనోహరరావు,కోశాధికారి పులిపాక ప్రసాద్,సత్యవాడ దుర్గా ప్రసాద్,మండా రవి,కొప్పర్తి సీతా రమేష్,రామచంద్రమూర్తి,డాక్టర్ సిరిపురపు మధుసూదన్ రావు,ఎంపీపీ కైకలూరు అడవి కృష్ణ,ఏలేశ్వరపు జగన్మోహన్ రాజు ,తెలికేపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

## టెన్త్ విద్యార్థులకు 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక తప్పకుండా అమలు చేయాలి



గుంటూరు విద్య, డిసెంబర్ 13, ప్రభాతవార్త : పదవ తరగతి విద్యార్థులకు ప్రతి పాఠశాల లో ప్రకటించిన విధంగా వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక తప్పక అమలు చేయాలని గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి సలీం బాషా స్పష్టం చేశారు. పదవ తరగతి వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమం తనిఖీ లో భాగంగా జిల్లా విద్యాశాఖ అధికారి నగరం లోని ఎల్ ఈ ఎం ఉన్నత పాఠశాల ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తో ఆయన మాట్లాడారు. సిలబస్ మరియు ఎస్ఏ 1 మార్కులను అడిగి తెలుసుకున్నారు. షైనింగ్ స్టార్స్ మరియు రైజింగ్ స్టార్స్ తో మాట్లాడారు. విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం గుడ్లు చిక్కి అందుతుందా అని విద్యార్థులను అడిగారు. .ఈ కార్యక్రమం లో గుంటూరు మండల విద్యాశాఖ అధికారి ఎస్ ఎం ఎం అబ్దుల్ ఖుద్దుస్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు .బి. సునీతి,ఉపాధ్యాయులు షావలి పాల్గొన్నారు

## ఆర్.వి.ఆర్ జె.సి. ఎన్.ఎస్.ఎస్ విద్యార్థుల స్పెషల్ క్యాంప్ ప్రారంభం

గుంటూరు విద్య , డిసెంబర్ 13 ప్రభాతవార్త: స్వచ్ఛభారత్ మిషన్ లక్ష్యసాధనలో ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులు భాగస్వాములవ్వాలని, ఎన్.ఎస్.ఎస్ కార్యక్రమాలు విద్యార్థులను బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని కళాశాల అధ్యక్షులు డా. రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డా. జగదీష్ కె. మద్దినేని పేర్కొన్నారు. ఆర్.వి.ఆర్ జె.సి. ఇంజనీరింగ్ కళాశాల ఎన్.ఎస్.ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో




నిర్వహించిన ఎన్.ఎస్.ఎస్ స్పెషల్ క్యాంపు సందర్భంగా వివిధ గ్రామాల్లో స్వచ్ఛ భారత్ కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాలకి చెందిన 50 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చురుకుగా పాల్గొన్నారు.

శిబిరం సందర్భంగా గ్రామాలలో పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమాలు, రోడ్లు-కాలనీల శుభ్రత, కాల్వల శుభ్రపరిచే కార్యక్రమాలు, ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు వంటి సేవా కార్యక్రమాలను విద్యార్థులు నిర్వహించారు. స్వచ్ఛత, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ అంశాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల అభివృద్ధిలో యువత భాగస్వామ్యం ఎంతో అవసరమని, పరిశుభ్రతే ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది అని కళాశాల సెక్రెటరీ కరెస్పాండెంట్ శ్రీ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డా. కొండబోలు కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు.ఈ స్పెషల్ క్యాంపు ప్రారంభోత్సవంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.కొల్లా శ్రీనివాస్, అకడమిక్ అండ్ ఆర్ డి డైరెక్టర్ డా.కె.రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ అడ్మినిస్ట్రేషన్ డా.ఎన్.వి.శ్రీనివాస రావు , కళాశాల ఎన్.ఎస్.ఎస్ యూనిట్స్ కోఆర్డినేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రపంచ ఆర్థిక అసమానతల నివేదికపై చర్చ

గుంటూరు కల్చరల్,డిసెంబర్ 13,ప్రభాతవార్త : అపర కుబేరులున్న పేద దేశంగా గల నివేదికలో భారతదేశాన్ని అభివర్ణించిన ప్రపంచ ఆర్థిక అసమానతల నివేదిక కొత్తగా విడుదల చేసిన నివేదికలో నానాటికీ మరింత హెచ్చుతున్న ఆదాయ అసమానతలతో భారత్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉందని తెలియజేయడం ఆందోళన చెందాల్సిన విషయమని అవగాహన సంస్థ నిర్వహించిన చర్చా కార్యక్రమంలో పాల్గొన్న మేధావులు,విశ్లేషకులు మాట్లాడుతూ అన్నారు.సంస్థ కార్యాలయంలో ప్రపంచ ఆర్థిక అసమానతల నివేదిక-2026పై పాల్గొన్నవారు చర్చించారు.కార్యక్రమంలో సీమాంధ్ర మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎన్.మూర్తి మాట్లాడుతూ అధికారం,ఆదాయం,సంపద,విజ్ఞానం తో పాటు అర్థమయ్యే రీతిలో అసమానతలకు కారణాలు తెలియజెప్పటంతోపాటు,పరిష్కార మార్గాలను సూచించడంలో మంచి గుర్తింపు ఉన్న వరల్డ్ ఇన్ ఇక్వాలిటీ ల్యాబ్ అనే సంస్థ ఆధ్వర్యంలో వెలువరింపబడిన 2026నివేదిక భారత్‌లో మిలియనీర్లు బిలియనీర్లుగా మారుతుంటే పేదలు తిరోగమిస్తున్నారని తమ నివేదికను ప్రభుత్వాలు పరిగణనలోనికి తీసుకోవాలని హెచ్చరించిందన్నారు. చర్చలో విశ్రాంత అర్థశాస్త్ర అధ్యాపకులు సి.సుబ్బారెడ్డి,విద్యావేత్త పోతురాజు,విశ్లేషకులు అమరావారి,సంస్థ సభ్యులు సాయిబాబు,అవధానులు హరి తదితరులు ప్రసంగించారు.

## గుంటూరు కార్మిక న్యాయస్థానం జిపి గా సురేష్‌బాబు

గుంటూరు లీగల్,డిసెంబర్ 13,ప్రభాతవార్త : ప్రభుత్వరంగ కార్మిక వివాదాలకు సంబంధించి 5జిల్లాల పరిధిలోని కేసులను విచారించే గుంటూరులోని,కార్మిక న్యాయస్థానం ప్రభుత్వ ప్లీడర్‌గా గుంటూరు



బార్ అసోసియేషన్ కు చెందిన సీనియర్ న్యాయవాది ముఖబాలం సురేష్‌బాబు నియమితులయ్యారు.ఈ మేరకు రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శి గొట్టు ప్రతిభాదేవి జారీ చేసిన ఉత్తర్వులు శనివారం సురేష్ అందుకున్నారు.గుంటూరు,పశ్చిమ గోదావరి,కృష్ణా,ప్రకాశం,నెల్లూరు జిల్లాలకు సంబంధించిన కేసులను ప్రభుత్వం తరఫున సురేష్ 3ఏళ్ళపాటు వాదిస్తారు.తుళ్ళూరు మండలం,ఐనవోలు గ్రామానికి చెందిన సురేష్‌బాబు 2002లో జేసి న్యాయ కళాశాల్లో లా డిగ్రీ పూర్తిచేసి,అదే ఏడాది న్యాయవాదిగా నమోదయ్యారు.సీనియర్ హైకోర్టు న్యాయవాది మిరియాల పిచ్చయ్య వద్ద జూనియర్‌గా ప్రాక్టీస్ మొదలుపెట్టారు.గత 22సంవత్సరాలుగా కార్మిక వివాదాల కేసులు,సివిల్,క్రిమినల్ కేసులు వాదించారు.సురేష్‌బాబు జీపిగా నియమితులు కావడం పట్ల పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తంచేశారు.

## ముగిసిన 99వ శ్రీరామకోటి మహోత్సవాలు

గుంటూరు కల్చరల్,డిసెంబర్ 13,ప్రభాతవార్త : స్థానిక ఆర్.అగ్రహారంలోని శ్రీరామనామ క్షేత్ర 99వ



శ్రీరామకోటి మహోత్సవాలు ఆలయ ట్రస్టీస్ రాగం వెంకట లీలాసుందరి, బెల్లంకొండ మస్తాన్‌రావు దంపతుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 99వ శ్రీరామకోటి మహోత్సవాలు శనివారం అఖండ మంది రంలో శ్రీసీతారాముల పవళింపు సేవతో ముగిసాయి.ఈ సందర్భంగా రాగం వెంకట లీలాసుందరి మాట్లాడుతూ కార్యక్రమాలు విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి భక్తులకు,దాతలకు ధన్యవాదాలు తెలిపారు.స్వామివారి పవళింపు

## ముగిసిన బాల మహోత్సవ్ జోనల్ పోటీలు

నరసరావుపేట, డిసెంబర్ 13 ప్రభాతవార్త :: విద్యార్థులే దేశ భవిష్యత్తు అని, తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. పట్టణంలోని జిల్లా స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహించిన బాల మహోత్సవ్ జోనల్ పోటీలు శనివారం ముగిశాయి.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు మాట్లాడుతూ ఇటువంటి ఉత్సవాల్లో పాల్గొనడం ద్వారా సమాజంలో ఎలా మెలగాలి, సమూహంతో ఎలా పనిచేయాలి అన్నది తెలుస్తుందన్నారు. ప్రతి విద్యార్థి ఎమోషనల్‌గా, మెంటల్‌గా ధృఢంగా ఉండాలన్నారు. ఓటములను తట్టుకునే మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.ప్రతి



విద్యార్థికి జీవితంలో స్పష్టమైన లక్ష్యం ఉండాలన్నారు. ఆ లక్ష్యాన్ని సాధించే వరకు అవిశ్రాంతంగా శ్రమించాలని చెప్పారు. మారుతున్న జీవనశైలిలో ఆరోగ్యంగా ఉండాలంటే ఏదో ఒక క్రీడలో ఆసక్తి చూపాలని సూచించారు. సమూహ క్రీడల వల్ల నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, సమన్వయం పెరుగుతాయని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు వివరించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు క్రియేటివిటీ, ఇన్నోవేషన్‌తో ముందుకు సాగాలన్నారు. బాల మహోత్సవ్‌లో భాగంగా బాలబాలికలకు నిర్వహించిన వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, చెస్, 100 మీటర్లు, 800 మీటర్లు, 4 100 రిలే, లాంగ్ జంప్, షాట్‌పుట్ తదితర క్రీడా పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ట్రోఫీలు, ప్రశంసా పత్రాలు, విలువైన నగదు బహుమతులు అందజేశారు. అండర్ 14 బాయ్స్ 4 100 రిలే లయోలా హై స్కూల్, వినుకొండ, మొదటి స్థానం, సంసిద్ధ హై స్కూల్ వినుకొండ రెండవ స్థానం లో నిలిచాయి. అండర్ 17 బాయ్స్ 4 100 రిలే లయోలా హై స్కూల్, వినుకొండ, మొదటి స్థానం సింధు హై స్కూల్, నరసరావుపేట రెండవ స్థానం లో బహుమతి సాధించాయి.అండర్ 14 బాలికలు సింధు హై స్కూల్ నరసరావుపేట మొదటి స్థానం, అండర్ 17 గర్ల్స్ ఖోఖో జడ్.పి.హెచ్.ఎస్ హై స్కూల్ కొచ్చర్ల మొదటి స్థానం సంసుద్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్, నరసరావుపేట రెండో స్థానలలో నిలిచాయి. బాల మహోత్సవ్‌లో నరసరావుపేట, వినుకొండ, చిలకలూరిపేట నియోజకవర్గాల్లోని 56పైగా పాఠశాలల నుంచి వేలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో 2,000 మందికి పైగా విద్యార్థులు వివిధ క్రీడాంశాల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు. విజేతలకు సర్టిఫికెట్లు, మెమెంటోలు, నగదు బహుమతులు అందజేయగా, ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో కోచ్‌లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## లింగంగుంట్ల భూముల సమస్యపై ఎంపి, ఎమ్మెల్యే సమావేశం.

నరసరావుపేట డిసెంబర్ 13 ప్రభాతవార్త ::నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు లింగంగుంట అగ్రహారం భూముల రిజిస్ట్రేషన్ సమస్యల పై ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలతో సమావేశం అయ్యారు. ఈ భేటీలో రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఎదురవుతున్న అడ్డంకులను త్వరితగతిన తొలగించి న్యాయం చేయాలన్నారు. అగ్రహారం భూములు దశాబ్దాలుగా రైతుల ఆధీనంలో ఉన్నప్పటికీ, ఈనాం (అగ్రహారం) భూములుగా ఉండటం వల్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అడ్డంకులు ఎదురవుతున్నాయని దాదాపు 1,470 ఎకరాల భూమి సంబంధించిన ఈ సమస్యపై రైతులు ఎన్నో సార్లు అధికారులు, నాయకులను ఆశ్రయించారన్నారు. జూన్‌లో ఎండోమెంట్స్ మంత్రిని కలిసి ప్రక్రియను పొడిగించాలని రైతులు కోరగా సెప్టెంబర్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుతో జరిగిన భేటీలో, రిజిస్ట్రేషన్ అడ్డంకులను తొలగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కపిలవాయి విజయ్ కుమార్, గంగుల పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే డా. గోపిరెడ్డి పర్యటన

నరసరావుపేట డిసెంబర్ 13 ప్రభాతవార్త :: వైయస్సార్సీపి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి శనివారం నియోజకవర్గంలో పర్యటించారు. పట్నంలోని టౌన్ చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో ఆయన పాల్గొని మాట్లాడారు. నూతన మందిరాన్ని నిర్మించుకున్న కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే అతిపెద్ద పండుగ క్రిస్మస్ రోజుల్లో ఈ కార్యక్రమం నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. శాంతి కరుణ, ప్రేమలు యేసు చూపిన మార్గమన్నారు. ఆయన మార్గంలో నడవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. అదేవిధంగా పట్టణంలో గురువాయిపాలెం గ్రామానికి చెందిన గుడిపూడి వారి వివాహ వేడుకల్లో ఆయన పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ నాయకులు, కుటుంబ పెద్దలు ఈ సందర్భంగా ఘనంగా స్వాగతం పలికారు. మండలంలోని లింగంగుంట్ల గ్రామంలో ఆయన పర్యటించి వాసుపల్లి నారాయణ జ్ఞాపకార్థ కూడికలో పాల్గొన్నారు. వారి కుటుంబ సభ్యుల వెంట వైయస్ఆర్సీపీ ఎల్లప్పుడు ఉంటుందని పేర్కొన్నారు. డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డివంట మండల, పట్టణ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

## టెన్త్ ఫలితాల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి : ఎంఈఓ ఏసుబాబు

నరసరావుపేట, డిసెంబర్ 13 ప్రభాతవార్త :: రానున్న పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు సర్వసన్నద్ధమై ఫలితాల్లో పల్నాడు జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని నరసరావుపేట మండల విద్యాశాఖ అధికారి ఏసుబాబు కోరారు. రానున్న టెన్త్ క్లాస్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించే విధంగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వందరోజుల యాక్షన్ ప్లాన్ ను విజయవంతం చేసేందుకు స్థానిక శ్రీరామకృష్ణ ఓరియంటల్



ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా టెన్త్ క్లాస్ విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు.జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా ఆదేశాల మేరకు మండలంలోని 23 హైస్కూల్స్ లో ఒక్కొక్క పాఠశాల కు ఒక్కొక్క గజిటెడ్ ఆఫీసర్ ను టెన్త్ క్లాస్ విద్యార్థుల చదువుల మెరుగు కోసం పర్యవేక్షకులను నియమించారని ఏసుబాబు తెలిపారు. అందులో భాగంగా ఈ పాఠశాల బాధ్యత తాను స్వీకరించినట్లు తెలిపారు.. విద్యార్థులకు అన్ని విధాలుగా వసతులు కల్పిస్తూ, ఎలాంటి ఆర్థిక భారం లేకుండా చదువుపైనే శ్రద్ధ వహించే విధంగా ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు. ప్రభుత్వం అన్ని విధాలుగా విద్యార్థుల కోసం చేస్తున్నప్పటికీ పదో తరగతి ఫలితాల్లో మరింత ఉత్తీర్ణత పెరిగి విద్యార్థులు పై చదువులకు వెళ్లే విధంగా వందరోజుల యాక్షన్ ప్లాన్ అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. వచ్చే ఏడాది మార్చి 15 వరకు జరిగే ఈ యాక్షన్ ప్లాన్ నిర్మల కోసం సెలవుల్లో సైతం మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నామని ఏసుబాబు వివరించారు. విద్యార్థులు ఉన్నత ఫలితాలు సాధించే దిశగా చదువుపైనే దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ఈ వంద రోజుల్లో అనవసరమైన విషయాల జోలికి వెళ్ళవద్దన్నారు. . ఈ యాక్షన్ ప్లాన్ ద్వారా విద్యార్థులు మరింత ఏకాగ్రతగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు, అధికారులకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఎం ఈ ఓ ఏసుబాబు విద్యార్థుల ఉద్దేశించి అన్నారు. తొలుత యాక్షన్ ప్లాన్ లో భాగంగా టెన్త్ విద్యార్థుల స్టడీ అవర్స్ ను పరిశీలించారు. విద్యార్థులను ఇంగ్లీష్ సబ్జెక్ట్ లో వారి సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంగ్లీష్ టీచర్ జ్యోతిని ఏసుబాబు అభినందించారు. పాఠశాల నూరుశాతం ఫలితాలు సాధించాలని ఆయన కోరారు.. అనంతరం టెన్త్ విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఏం రెడ్డి విద్యాసంస్థల ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు.. రొంపిచర్ల,డిసెంబర్ 13 ప్రభాతవార్త :: ఏం రెడ్డి విద్యాసంస్థల ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను నిర్వహించినట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ అట్లూరు శాంతి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కళాశాల ఆవరణలో శనివారం క్రీడా పోటీల బ్రోచర్ను విడుదల చేశారు. డిసెంబర్ 21, 22, 23 తేదీలలో డిప్లమో కళాశాల విద్యార్థులకు ఈ పోటీలు జరుగుతాయి అన్నారు. డిసెంబర్ 27,28,29 తేదీలలో ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు ప్రత్యేక పోటీలు నిర్వహిస్తామన్నారు.

## బాలికలపై లైంగిక దాడుల నియంత్రణపై ఒక్కరోజు వర్క్‌షాప్

తాడేపల్లి,డిసెంబర్ 13,ప్రభాతవార్త : మండల పరిధిలోని వడ్డేశ్వరం గ్రామంలో గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ స్వచ్ఛంద సంస్థ వారి చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టులో భాగంగా స్థానిక కమ్యూనిటీ హాల్లో ఒక్కరోజు బాలికలపై జరిగే లైంగిక దాడులు,బాల్య వివాహాలు,ప్రభుత్వ ఉచిత హెల్ప్‌లైన్ నంబర్ ్ల గురించి



ట్రైనింగ్,వర్క్‌షాప్ జరిగింది.కార్యక్రమాన్ని ఉద్దేశించి చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సిస్టర్ విద్యా మాట్లాడుతూ మేము మన తాడేపల్లి మండలంలో 10గ్రామాల్లో బాలల హక్కుల పరిరక్షణ కోసం,బాల్యవివాహాలు నివారణ కోసం,బడిఈడు పిల్లలు ఎవరూ కూడా బడి బయట ఉండకూడదనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు.బాలబాలికలకు ఎదురయ్యే సమస్యలు,వాటి పరిష్కార మార్గాలు వారికి వారే ఆలోచించే విధంగా,ఆ సమస్యలు గురించి ఏ అధికారికి రిపోర్టు చేయాలో అనే విషయాలు చర్చించుకునే విధంగా ఈ వర్క్‌షాప్‌లో నేర్పించడం జరిగిందన్నారు.ప్రతిగ్రామంలో ప్రభుత్వ అధికారులను కలుపుకొని గ్రామపెద్దలతో ఏర్పాటు చేసిన విసిపిసి కమీటీల వల్ల కూడా పిల్లలకు కొంత సపోర్టు దొరికిందన్నారు.ప్రాజెక్టు కోఆర్డినేటర్ కె.అనూష మాట్లాడుతూ విసిపిసి కమీటీ ఉంటే పిల్లలకు ఒక భరోసా కలుగుతుందని,ప్రతి ముగ్గురి పిల్లల్లో ఇద్దరు శ్రమదోపిడికి గురవుతున్నారన్నారు.50శాతం పిల్లలు ఒకటి లేదా పలు రకాలైన శ్రమదోపిడికి గురవుతున్నారని అత్తోట పోతురాజు అన్నారు.కార్యక్రమంలో మహాత్మాగాంధీ బాలల పార్లమెంట్,తేజ బాలల పార్లమెంట్,ఏపిజేఅబ్దుల్ కలాం బాలల పార్లమెంట్ పిల్లలు మొత్తం 96మంది,గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్,స్వచ్ఛంధ సంస్థ స్టాఫ్ అత్తోట పోతురాజు,కె.అనూష,జే.ఇజ్రాయేల్,తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్‌అదాలత్‌లో 23,466 కేసుల పరిష్కారం

గుంటూరు లీగల్,డిసెంబర్ 13,ప్రభాతవార్త : రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సూచనల మేరకు శనివారం ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో ఒకేరోజు 23,466కేసులు పరిష్కారం అయ్యాయి.గుంటూరు జిల్లా కోర్టు ప్రాంగణంలో 17బెంచీలతో కలిపి




జిల్లా వ్యాప్తంగా 53బెంచీలు ఏర్పాటుచేశారు.సంస్థ చైర్మన్,జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కళ్యాణచక్రవర్తి ఆధ్వర్యంలో 1,376 సివిల్, 21,415క్రిమినల్,578చెక్ బౌన్స్, 97 ప్రీలిటికేషన్ కేసుల్లో 57,68, 57,572రూపాయల మొత్తం మేరకు పరిష్కారమయ్యాయి.

## డివిజన్ స్థాయి క్రికెట్ పోటీలో ప్రతిభ కనబరిచిన పెదనందిపాడు ఉపాధ్యాయ సంఘం కు అభినందన

పెదనందిపాడు, డిసెంబర్ 13, (ప్రభాతవార్త)గుంటూరు డివిజన్ స్థాయి లో గుంటూరు ఎల్ఈఎం



స్కూల్ లో శనివారం జరిగిన గుంటూరు డివిజన్ స్థాయి ఉపాధ్యాయ క్రికెట్ పోటీలలో వట్టిచెరుకూరు జట్టుపై పెదనందిపాడు మండలం ఉపాధ్యాయుల జట్టు 8 వికెట్లతో గెలుపొంది ఫైనల్ కు చేరుకుంది. తొలుత ఈ పోటీలను డీఈవో డాక్టర్ సలీం భాష ప్రారంభించారు. ఈ మ్యాచ్ లో అద్భుత ప్రతిభ కనపరిచిన జట్టు సభ్య లు మోహన్ రావు .రామారావు .దాసు. పాణి రెడ్డి. వెంకటేశ్వరరావు. శ్రీనివాస్ రెడ్డి. తదితర సభ్యుల కు పెదనందిపాడు ఎంఈఓ1 సిహెచ్ రమేష్ బాబు. ఎంఈఓ 2 పోపూరి జాకబ్ లు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## 'క్రీడలతో అనేక రకాల ఉపయోగాలు'

### విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య

పెదనందిపాడు, డిసెంబర్ 13, (ప్రభాతవార్త): క్రీడల వలన ఆరోగ్యపరమైనయే కాకుండా పలు రకాల ఉపయోగాలు ఉన్నాయని, మానసిక ప్రశాంతతో పాటు దేహ దారుఢ్యం బాగుంటుందని, ప్రతి ఒక్కరు వారికి ఇష్టమైన క్రీడల్లో రాణించాలని విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం పాలపర్రు లో శనివారం మొదటి రోజు ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి వెటరన్ క్రీడా పోటీల ను క్రీడాజ్యోతి వెలిగించి ప్రారంభించిన అనంతరం








లావు రత్తయ్య మాట్లాడుతూ. పాలపర్రు గ్రామానికి మంచి పేరు ఉన్నదని 60 సంవత్సరాల క్రితం పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్సస్ కళాశాల స్థాపన లో ముఖ్య పాత్ర పోషించిన న్యాయమూర్తి స్వర్గీయ జస్టిస్ తేళ్ళ కృష్ణమ్మ చౌదరి, ప్రముఖ విద్యావేత్త నంగినేని చౌదరి ఈ గ్రామంలో జన్మించి గ్రామానికి చాలా మంచి పేరు తీసుకువచ్చారని తెలిపారు. ముఖ్యంగా చౌదరి బాబుతో నాకు చాలా ఆత్మీయ సంబంధం ఉన్నదని ఈ పాఠశాల ఆవరణలో వారి విగ్రహావిష్కరణ జరగడం చాలా సంతోషంగా ఉన్నదని, అయన తో ఉన్న జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. విద్యార్థులు క్రీడలతో పాటు విద్యలో కూడా రాణించాలని సూచించారు. ఇంటర్మీడియట్ వరకు బాగా చదివితే పై చదువులకు ఇబ్బందులు ఉండవని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో వారికి విలువలు ఎక్కువగా తెలుసునని, సామాన్య పాఠశాలల్లో చదివిన వారే బాగా చదివి 70 శాతం ఉన్నత ఉద్యోగాలు సాధిస్తున్నారని, ప్రజల కష్ట సుఖాలు, తెలుసని ఆకలి అంటే తెలుస్తుందని, పంటలంటే తెలుస్తుంది, ఇవే కద జీవితం అంటే , ఇవ్వన్నీ తెలిసిన వారే భవిష్యత్ లో మంచి లీడర్ల గా ఎదుగుగుతారని అయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఎం వరప్రసాద్, జిల్లా సెక్రటరీ గణేశుని రాంబాబు, జిల్లా జాయింట్ సెక్రెటరీ చెన్నుపాటి శివ నాగేశ్వరరావు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు దాసరి శేషగిరిరావు,ముద్దన రాఘవయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముద్దన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఆర్ఎం వర్సిటీకి క్యూ ఎస్ఐ గేజ్ హ్యాపీనెస్ అవార్డు

మంగళగిరి, డిసెంబరు 13, ప్రభాతవార్త: ఏపీ ఎస్ ఆర్ ఎమ్ యూనివర్సిటీకి ప్రతిష్టాత్మక విద్యారంగ సంస్థ క్యూ ఎస్ ఐ గేజ్ హ్యాపీనెస్ అవార్డు లభించింది. శుక్రవారం సాయంత్రం న్యూఢిల్లీలో జరిగిన క్యూ.ఎస్.ఐ గేజ్ వార్షిక అవార్డుల ప్రధాన ఉత్సవంలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య సతీష్ కుమార్, క్వాలిటీ అష్యూరెన్స్ అండ్ ర్యాంకింగ్స్





అసోసియేట్ డీన్ డాక్టర్ కార్తీక్ రాజేంద్రన్ లు సంయుక్తంగా అవార్డును అందుకున్నారు.

క్యూ ఎస్ ఐ గేజ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రవీన్ నాయర్ చేతుల మీదుగా అవార్డును స్వీకరించారు.

క్యూఎస్ఐ గేజ్ సంస్థ ఏటా దేశంలోని కళాశాలలు విద్యాసంస్థల పనితీరును వివిధ రంగాల్లో విశ్లేషించి ర్యాంకులను ప్రకటిస్తుంది. ఏపీ ఎస్ఆర్ ఎం యూనివర్సిటీ పనితీరును వివిధ కోణాల్లో విశ్లేషించిన క్యూ ఎస్ఐ గేజ్ సంస్థ 2025 26 సంవత్సరానికి ఆనందమయ యూనివర్సిటీగా పరిగణించి హ్యాపీనెస్ అవార్డుకు ఎంపిక చేసింది. ఏపీ ఎస్ ఆర్ ఎమ్ యూనివర్సిటీ కి హ్యాపీనెస్ అవార్డు లభించడం పట్ల వర్సిటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ పి.సత్యనారాయణన్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఆరోగ్యకర ఆనందమయ వాతావరణాన్ని కల్పించడం ద్వారా విద్యార్థుల ఉత్తీర్ణత ప్రమాణాల పెంపుదల సాధ్యమని డాక్టర్ సత్యనారాయణన్ అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా సానుకూల అభ్యాస వాతావరణాన్ని కల్పించడం విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించడం తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు .విద్యార్థుల శ్రేయస్సుతోపాటు విద్యా నైపుణ్యాన్ని పెంపొందించడానికి కృషి చేస్తున్నామని యూనివర్సిటీ ఉప కులపతి డాక్టర్ సతీష్ కుమార్ పేర్కొన్నారు.

## వైభవోపేతంగా మంగళగిరి డాన్ బోస్కో స్వర్ణోత్సవం

తాడేపల్లి,డిసెంబర్ 13,ప్రభాతవార్త : ఎర్రబాలెం డాన్‌బోస్కో తెలుగు మీడియం పాఠశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు."మంగళగిరి డాన్ బోస్కో స్కూల్" అనే పుస్తకాన్ని సలేషియన్ ప్రొవిన్షియల్ ఆఫ్ హైదరాబాద్ వారు ఫాదర్ శాంటియాగు థామస్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థి,పుస్తక రచయిత,ప్రముఖ సీనియర్ జర్నలిస్టు ఈపూరి



రాజారత్నం రచించిన ఈ పుస్తకంలో తెలుగు మీడియం పాఠశాల చరిత్ర,పాఠశాల వ్యవస్థాపకులు కీ.శే.ఫాదర్ థామస్ చిన్నప్ప సేవలు,విద్యా బోధనలో ఉపాధ్యాయుల అంకితభావం వంటి ఎన్నో విషయాలు రాశారు. గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల్లో పాల్గొన్న 40బ్యాచ్‌ల విద్యార్థులు వారి కుటుంబాలు,ప్రస్తుత విద్యార్థులతో పాఠశాల్లో కొత్త సంబరం నడుమ విద్యార్థులు సంతోషంగా గడిపారు.తొలుత టైటిల్ పేజీ ఆవిష్కరణ జరగగా,91-92విద్యార్థులతో కలసి మంగళగిరి "డాన్ బోస్కో స్కూల్" పుస్తకాన్ని ఆవిష్కరించడం జరిగింది. ఈ పుస్తకాన్ని ఈ-బుక్స్‌గా కూడా విడుదల చేశారు.పుస్తకం కావాలి అనుకున్న వారు ఏపి న్యూస్ హంట్ డాట్ కామ్ తెలుగు వెబ్‌సైట్ నుండి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పుస్తక రచయిత ఈపూరి రాజారత్నం తెలిపారు.కార్యక్రమంలో 91-92బ్యాచ్ విద్యార్థులు,విద్యార్థినులు,పూర్వ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్ లో 1,583 కేసుల పరిష్కారం

నరసరావుపేట, క్రైమ్ డిసెంబర్ 13 ప్రభాతవార్త ::జాతీయ, రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు శనివారం నరసరావుపేట న్యాయస్థాన భవనాల ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ ను నిర్వహించారు. అదాలత్ లో సివిల్, క్రిమినల్, బ్యాంకు, చెల్లని చెక్కు కేసులు, మనోవర్తి, గృహ హింస, మోటార్ వాహన ప్రమాద కేసులు ముందస్తు వ్యాజ్యాలు మొత్తం కలిపి 1583 కేసులు పరిష్కారమయ్యాయి. మోటార్ వాహన ప్రమాద కేసు లను గుంటూరు లోని 4వ జిల్లా అదనపు న్యాయ అధికారి శరత్ బాబు పరిష్కరించారు. మిగతా కేసులను స్థానిక న్యాయాధికారులు 4 బెంచ్ లుగా ఏర్పడి కేసులను పరిష్కరించారు. పరిష్కారమైన కేసుల్లో కక్షిదారులకు రూ 4.85 కోట్ల మేరకు లబ్ధి చేకూరింది. అదాలత్ లో న్యాయాధికారులు ఎన్ లావణ్య, ఆర్ ఆశీర్వాదం పాల్, ఏ సలోమీ, ఎం గాయత్రి, న్యాయవాదులు ఎం చంద్రశేఖర్, కిరణ్ తేజ, అమూల్య, అబ్బూరి ఏడుకొండలు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

14-12Pg 9_14-12Pg5.qxd 13/Dec/25 10:26 PM Page 1



# మెస్సీ రాకతో కోల్‌కతాలో హడావుడి

## సాల్ట్‌లేక్ స్టేడియంలో కట్టలు తెంచుకున్న అభిమానుల ఆగ్రహం

## పది నిమిషాల్లోనే మెస్సీ వెళ్లిపోవడంపై నిరాశ

## అభిమానులకు, మెస్సీకి క్షమాపణలు చెప్పిన బెంగాల్ సిఎం మమత





**కోల్‌కతా,డిసెంబరు 13:** కోల్‌కతాలో ఫుట్‌బాల్ ప్లేయర్ మెస్సి ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో ఆడకపోవడంతో సాల్ట్ లేక్ స్టేడియంలో అభిమానులు విధ్వంసం సృష్టించారు. గోట్‌దూర్ ఆఫ్ ఇండియాలో పాల్గొనేందుకు వచ్చిన మెస్సీని సమీపంనుంచి చూడాలని, ఆతడి ఆటను చూడాలని అభిమానులు ఎంతో ఆశతో వచ్చారు. ఈసమయంలో ఇలా వచ్చి అలా స్టేడియంనుంచి వెళ్లిపోవడాన్ని అభిమానులు తట్టుకోలేకపోయారు. పట్టుమని పదినిమిషాలుకూడా ఉండలేదని ఆగ్రహం వ్యక్తంచేసారు. స్టేడియంలో ఫ్లెక్సీలు చించి గ్రౌండ్‌లోకి కుర్చీలు, బాటిళ్లు విసిరేశారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బారికేడ్లు దాటి స్టేడియంలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో అక్కడ గందరగోళం నెలకొంది. ఈవెంట్ చూసేందుకుగాను రాజకీయ నాయకులు, ఫుట్‌బాల్ మాజీ క్రీడాకారులు కోచ్‌లు అందరూ వచ్చారు. స్టాండ్స్ చుట్టూ వీరే ఉండటంతో మెస్సీ ఫ్యాన్స్‌కు ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఈ గందరగోళం వల్లనే ముందుగా నిర్ణయించిన రెండు ఈవెంట్లను నిర్వహించలేకపోయారు. పదినిమిషాల్లోనే ఆతడిని స్టేడియం నుంచి తీసుకెళ్లిపోవడంపై ఆగ్రహావేశాలతో అభిమానులు ఊగిపోయారు. సాల్ట్‌లేక్‌లోకి దూసుకొచ్చారు. టెంట్లు, ఇతర టెంపరరీ ఆకృతులన్నింటినీ ధ్వంసంచేసారు. భద్రతా సిబ్బంది నియంత్రించలేనిస్థితి నెలకొంది. ఒక్కొక్కరూ రూ.4500 నుంచి రూ.10వేల వరకూ వెచ్చించారని ఇందుకోసమా మేం వచ్చింది అంటూ నిలదీసారు. ఫిర్యాదులు వెల్లువలా రావడంతో గవర్నర్ కూడా ప్రభుత్వం సంబంధిత అధికారులనుంచి నివేదిక కోరారు.

**నిర్వాహకుడు అరెస్టు:** ఉద్రిక్తపరిస్థితులు నెలకొనడంతో పోలీసులు భారీ ఎత్తున మోహరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అలాగే కోల్‌కతా పోలీసులు శనివారం ఆ ఈవెంట్ ఆర్గనైజర్ శతాతాద్రు దత్తను అరెస్టు చేశారు. ఆకస్మికంగా మెస్సీని స్టేడియం నుంచి తీసుకెళ్లడంతో ప్రేక్షకులు వీరంగం సృష్టించారు. ఎయిర్‌పోర్టులో శతాద్రు దత్తను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు చెప్పారు. సాల్ట్ లేక్ స్టేడియంలో తీవ్ర స్థాయిలో ప్రాపర్టీకి నష్టం జరిగింది. పలు రకాల సెక్షన్ల కింద నిర్వాహకుడిపై కేసు పెట్టనున్నారు. త్వరలో ఎఫ్ఐఆర్ నమోదు చేయనున్నట్లు కోల్‌కతా పోలీసులు వెల్లడించారు. లీగల్ చర్యలు తీసుకుంటామని శాంతిభద్రతల అదనపు డీజీ జావెద్ షామిమ్ తెలిపారు. అభిమానుల్ని విస్మరించడం పట్ల ఆరా తీస్తామని, ఎక్కడ లోపం జరిగిందో తెలుసుకుని చర్యలు తీసుకుంటామన్నారు. కోల్‌కతా ఘటనను సుమోటోగా స్వీకరించిన కేసును నమోదు చేయనున్నట్లు కోల్‌కతా పోలీసులు తెలిపారు. ప్రేక్షకుల టికెట్ డబ్బును రిఫండ్ చేయాలని నిర్వాహకులకు పోలీసులు ఆదేశాలు ఇచ్చారు. ఇలాంటి మేనేజ్మెంట్‌ను సహించబోమని కోల్‌కతా పోలీసు కమీషనర్ రాజీవ్ కుమార్ తెలిపారు. అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ ప్లేయర్ లియోనల్ మెస్సి భారత పర్యటనకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కోలకతాలో ఇవాళ ఉదయం ల్యాండ్ అయ్యారు. అనంతరం స్థానిక సాల్ట్ లేక్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇక మెస్సిని చూసేందుకు కోల్‌కతా సహా పలు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున ఫ్యాన్స్ తరలివచ్చారు. అక్కడ అభిమానులకు నిరాశే ఎదురైంది. ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో మెస్సి ఆడాల్సి ఉండగా ఆడకుండానే స్టేడియం నుంచి వెళ్లిపోయారు. దీంతో ఫ్యాన్స్ ఆగ్రహంతో ఊగిపోయారు. అప్రమత్తమైన అధికారులు వారిని అడ్డుకున్నారు. స్టేడియం వద్ద భద్రతను పెంచారు.

**మెస్సీకి మమతా బెనర్జీ క్షమాపణలు:** సాల్ట్‌లేక్ స్టేడియంలో జరిగిన ఉద్రిక్తతలపై పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ స్పందించారు. జరిగిన సంఘటనలు దురదృష్టకరమని పేర్కొంటూ ప్రపంచ దిగ్గజ ఆటగాడు లియోనెల్ మెస్సీకి, మెస్సీ అభిమానులకు క్షమాపణలు చెప్పారు. స్టేడియంలో నిర్వహణ లోపం పట్ల దిగ్భ్రాంతి కలిగిందని, మెస్సీని చూసేందుకు వచ్చిన వేలాదిమంది క్రీడాభిమానులతోకలిసి నేనుకూడా చూద్దామని స్టేడియానికి బయలుదేరానని, అక్కడి పరిస్థితిని తెలిసి వెనుదిరిగినట్లు చెప్పారు. స్టేడియంలోజరిగిన ఘటనకు మెస్సీకి, ఆయన అభిమానులకు క్షమాపణలు చెపుతున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై జస్టిస్ ఆషిమ్ కుమార్ అధ్యక్షతన విచారణ కమిటీని ఏర్పాటు చేస్తున్నానని, దర్యాప్తు అనంతరం నిర్వహణ వైఫల్యానికి కారకులపై చర్యలు తీసుకుంటామని, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

# పార్లమెంటుపై ఉగ్రదాడికి 24 యేళ్లు: నివాళులర్పించిన ప్రముఖనేతలు

**న్యూఢిల్లీ, డిసెంబరు 13:** ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలిచే భారత పార్లమెంటుపై ఉగ్రదాడికి నేటితో 24 ఏళ్లు పూర్తి. 2001 డిసెంబర్ 13వ తేదీన ఢిల్లీలోని పార్లమెంటు భవనంపై ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే. ఆ దాడిలో మరణించిన జవాన్లకు పలువురు నేతలు నివాళులర్పించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్, కేంద్ర మంత్రులు కిరెన్ రిజుజు, జితేంద్ర సింగ్, అర్జున్ రామ్ మేఘ్వాల్, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా పలువురు ఎంపీలు, సీనియర్ లీడర్లు జవాన్లకు నివాళులర్పించారు.

2001, డిసెంబర్ 13న పార్లమెంటు శీతాకాల సమావేశాలు జరుగుతున్న సమయంలో ఉగ్రమూక పథకం ప్రకారం పార్లమెంటు ప్రాంగణంలోకి చొరబడింది. హోం శాఖ అనుమతి ఉన్న స్టిక్కర్‌తో ఎరుపు రంగు అంబాసిడర్ బుగ్గకారులో లోపలికి ప్రవేశించింది. అక్కడ నిలిపిఉన్న ఉపరాష్ట్రపతి కారును ఢీ కొట్టింది. అనంతరం కిందకు దిగిన ముష్కరులు కాల్పులతో బీభత్సం సృష్టించారు. అడ్డువచ్చిన వారిని కాల్చుకుంటూ పోయారు.

# హెచ్1బి వీసా ఫీజు పెంపుపై యుఎస్‌లో ఆగ్రహం

## కోర్టుకెక్కిన 20 కీలక రాష్ట్రాలు




**కాలిఫోర్నియా, డిసెంబరు 13:** అధ్యక్షుడు ట్రంప్ 2025 సెప్టెంబర్ 19న జారీ చేసిన ఆదేశాల మేరకు హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం జారీచేసిన హెచ్1బి వీసా లక్షడాలర్ల ఫీజులపై కాలిఫోర్నియాతో సహా 20 రాష్ట్రాలు అమెరికా కోర్టులో దావా దాఖలుచేసాయి. ట్రంప్ ఆదేశాలమేరకు హోంల్యాండ్ సెక్యూరిటీ ఈ కొత్త ఫీజును అమలులోకి తెచ్చింది. ఈ విధానం వల్ల ఆసుపత్రులు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు వంటి సంస్థలు తీవ్రంగా నష్టపోతాయని రాష్ట్రాలు వాదిస్తున్నాయి. ఈ దావాకు నాయకత్వం వహిస్తున్న కాలిఫోర్నియా అటార్నీ జనరల్ రాబ్ బొంటా మాట్లాడుతూ, ఈ అక్రమ ఫీజు వల్ల ప్రభుత్వ సంస్థలపై తీవ్ర ఆర్థిక భారం పడుతుంది. కీలక రంగాల్లో ఇప్పటికే ఉన్న సిబ్బంది కొరత మరింత పెరుగుతుందని అన్నారు. ఈ ఫీజును విధించే అధికారం ప్రభుత్వానికి లేదని, ఇది అమెరికా రాజ్యాంగాన్ని, అడ్మినిస్ట్రేటివ్ ప్రొసీజర్ యాక్ట్‌ను ఉల్లంఘించడమేనని రాష్ట్రాలు తమ పిటిషన్‌లో పేర్కొన్నాయి. ప్రస్తుతం హెచ్1బీ పిటిషన్లకు 960 డాలర్ల నుంచి 7,595 డాలర్ల వరకు మాత్రమే ఫీజులు ఉన్నాయి. ఈ కొత్త నిర్ణయం వల్ల విద్య, వైద్య రంగాల్లో ఖాళీలను భర్తీ చేయడం మరింత కష్టమవుతుందని రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే దేశంలోని అనేక పాఠశాలలు ఉపాధ్యాయుల కొరతతో ఇబ్బంది పడుతున్నాయి. అలాగే 2036 నాటికి అమెరికాలో 86,000 మంది వైద్యుల కొరత ఏర్పడవచ్చని అంచనాలున్నాయి. భారత్ నుంచి వెళ్లే టెక్ నిపుణులు, వైద్యులకు హెచ్1బీ వీసా అత్యంత కీలకమైన మార్గంగా ఉన్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది. కాలిఫోర్నియా, మసాచుసెట్స్ సహా న్యూయార్క్, న్యూజెర్సీ, అరిజోనా వంటి రాష్ట్రాలు ఈ దావాలో పాలుపంచుకున్నాయి. దీనివల్ల భవిష్యత్తులో ప్రతిభావంతులైన నిపుణులు అమెరికాకు రాకపోవచ్చని, ఇప్పటికే నిపుణుల కొరతను ఎదుర్కొంటున్నట్లు కాలిఫోర్నియా అటార్ని జనరల్ వెల్లడించారు. కీలక రాష్ట్రాల్లో భారీ ఎత్తున భారతీయ విదేశీ నిపుణులు పనిచేస్తున్నారని వీరి నిష్క్రమణం వల్ల ఇపుడు ఈ కంపెనీలకు నిపుణుల కొరత ఎదురవుతుందని, ఫలితంగా వీటిద్వారా లేఆఫ్‌లు కూడా పెరుగుతాయని ఆందోళన వ్యక్తంచేసారు. ఇప్పటికే ప్రతినిధుల సభలో ట్రంప్ సుంకాలు వ్యతిరేకిస్తూ ముగ్గురు ప్రతినిదులు తీర్మానం తెచ్చారు. డెబోరా రాస్, మార్క్ వీసీ, రాజాకృష్ణమూర్తిలు ఈ తీర్మానం ప్రవేశపెట్టారు. సుంకాలు చట్టవిరుద్ధం అని వీటివల్ల అమెరికన్లకే ఎక్కువ నష్టమని వారు తమ తీర్మానంలో వెల్లడించారు.

# మహిళల కోసం 'వయాగ్రా' క్రీమ్..

## డేర్ బయోసైన్సెస్ ప్రత్యేక ఆవిష్కరణ

**శాన్‌ఫ్రాన్సిస్కో, డిసెంబరు 13:** పురుషుల లైంగిక సామర్థ్యాన్ని పెంచే వయాగ్రా అందుబాటులోకి వచ్చి మూడు దశాబ్దాలు దాటింది. ఇపుడు మహిళల కోసం కూడా ప్రత్యామ్నాయంగా ఒక కొత్త ఉత్పత్తిని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. అమెరికాకు చెందిన డేర్ బయోసైన్స్ అనే సంస్థ మహిళల్లో లైంగిక ప్రేరేపణను పెంచే ఒక ప్రత్యేకమైన క్రీమ్‌ను తయారు చేసింది. డేర్ టు ప్లే పేరుతో వస్తున్న ఈ క్రీమ్ కేవలం 10 నిమిషాల్లోనే ప్రభావం చూపుతుందని సంస్థ చెబుతోంది. ఈ క్రీమ్‌లో వయాగ్రాలో ఉపయోగించే ఖిసిల్డెనాఫిల్‌ఖి అనే రసాయనాన్నే వాడారు. దీన్ని ప్రైవేట్ భాగాల్లో రాసుకోవడం ద్వారా రక్త ప్రసరణ పెరిగి, స్పర్శ జ్ఞానం, లైంగిక వాంఛ మెరుగుపడతాయని తయారీదారులు చెబుతున్నారు. "మహిళల శరీరాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా రూపొందిస్తే సిల్డెనాఫిల్ అద్భుతంగా పనిచేస్తుందని శాస్త్రీయంగా నిరూపించాం. 1998లో వయాగ్రా పురుషుల లైంగిక వైద్యంలో విప్లవం సృష్టించింది. కానీ మహిళల విషయంలో దాదాపు 30 ఏళ్లుగా ఎలాంటి పురోగతి లేదు" అని డేర్ బయోసైన్స్ సీఈఓ సబ్రినా మార్టుక్కీ జాన్సన్ తెలిపారు. ఈ ఉత్పత్తి భద్రత, సామర్థ్యాన్ని పలు క్లినికల్ ట్రయల్స్ ద్వారా నిర్ధారించామని, అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ అనుమతుల కోసం ప్రయత్నిస్తున్నామని కంపెనీ పేర్కొంది. సుమారు 200 మంది మహిళలపై జరిపిన ప్రయోగాల్లో ఎలాంటి దుష్ప్రభావాలు లేకుండానే వారిలో లైంగిక ఆసక్తి, కోరికలు, భావప్రాప్తి వంటివి గణనీయంగా పెరిగినట్లు తేలింది. పురుషులకు ఉన్నట్లుగా మహిళలకు పిల్ ఎందుకు తయారు చేయలేదన్న ప్రశ్నకు, దానికి చాలా ఎక్కువ మోతాదులో సిల్డెనాఫిల్ అవసరమవుతుందని, అది ఆచరణ సాధ్యం కాదని జాన్సన్ వివరించారు. ప్రస్తుతం అమెరికాలోని 10 రాష్ట్రాల్లో ఈ క్రీమ్ కోసం ప్రీఆర్డర్లు స్వీకరిస్తుండగా, 2026 ప్రారంభం నాటికి దేశవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

# ఎలాన్ మస్క్‌కు ఇమ్రాన్‌ఖాన్ మాజీ భార్య బహిరంగ లేఖ



**ఇస్లామాబాద్, డిసెంబరు 13:** ప్రపంచ కుబేరుడు ఎలాన్‌మస్క్‌కు పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ మాజీ భార్య జెమీమా గోల్డ్‌స్మిత్ బహిరంగ లేఖ రాశారు. తన ఎక్స్ ఖాతాలో విజిబిలిటీ ఫిల్టరింగ్‌ను సరిచేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. జైలులో ఉన్న ఇమ్రాన్‌ఖాన్ పరిస్థితి గురించి తాను పెడుతున్న పోస్టులు ప్రజలకు చేరడం లేదని వెల్లడించారు. ఈ మేరకు జెమీమా తన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. దీనికి మస్క్‌ను ట్యాగ్ చేశారు. ఆ పోస్టులో 'ఎలాన్‌మస్క్‌కు ఓ వ్యక్తిగత విజ్ఞప్తి. చట్టవిరుద్ధంగా ఏకాంత నిర్బంధంలో నా భర్త ఇమ్రాన్‌ను చూసేందుకు, మాట్లాడేందుకు నా ఇద్దరు కుమారులకు అనుమతి ఇవ్వడం లేదు. కేవలం 'ఎక్స్' ద్వారా మాత్రమే ఇమ్రాన్ ఖాన్ గురించి మా ఆవేదనను ప్రపంచానికి చెప్పగలుతున్నాం' అని రాసుకొచ్చారు. పాక్ అధికారులు ఇమ్రాన్‌పై వ్యవహరిస్తున్న తీరు గురించి తాను పెడుతున్న పోస్టులు బయటకు రావడం లేదని జెమీమా ఆరోపించారు. అవి ప్రజలకు చేరడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో తన ఎక్స్ ఖాతాలో విజిబిలిటీ ఫిల్టరింగ్‌ను సరిచేయాలని ఆమె మస్క్‌కు విజ్ఞప్తి చేశారు. 2023 నుంచి ఇమ్రాన్‌ఖాన్ అడియాలా జైలులోనే ఉన్నారు. ఇటీవల ఆయన మృతి చెందినట్లు సామాజిక మాధ్యమాల్లో పెద్దఎత్తున ప్రచారం జరిగింది. ఈ క్రమంలో ఆయన మద్దతుదారులు ఇమ్రాన్‌ను కలిసేందుకు అవకాశమివ్వాలని నిరసనలు వ్యక్తం చేశారు. ఆ తర్వాత ఇమ్రాన్ సోదరి ఉజ్మా ఖానుమ్‌కు మాత్రమే ఆయనను కలిసే అవకాశం కల్పించారు. జైలులో ఇమ్రాన్ సురక్షితంగానే ఉన్నారని ఆ తర్వాత ఖానుమ్ ప్రకటించారు.

# కాంగ్రెస్ పునరుజ్జీవం ఒక జాతీయ బాధ్యత



కేంద్ర మాజీ మంత్రి అశ్వినీకుమార్

**న్యూఢిల్లీ, డిసెంబరు 13:** దేశంలో కాంగ్రెస్ పార్టీ లేకుండా సమర్థవంతమైన ప్రతిపక్షాన్ని ఊహించలేమని, అయితే ఆ పార్టీ తన ప్రాభవాన్ని ఎక్కడో కోల్పోయిందని మాజీ కేంద్ర మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత అశ్వనీ కుమార్ అభిప్రాయపడ్డారు. పార్టీ పునరుజ్జీవం పొందడం ఒక జాతీయ బాధ్యత అని ఆయన వ్యాఖ్యానించారు. తన కొత్త పుస్తకం గార్డియన్స్ ఆఫ్ ది రిపబ్లిక్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్ష పార్టీలలో తప్పులు వెతకడం కంటే, కాంగ్రెస్ తనలోని బలహీనతలను గుర్తించేందుకు ఆత్మపరిశీలన చేసుకోవాలని ఆయన సూచించారు. రాహుల్ గాంధీ హృదయం సరైనదే, ఆయన పేదల పక్షాన మాట్లాడతారు. కానీ ఎక్కడో పార్టీ సందేశం ప్రజల్లోకి బలంగా వెళ్లడం లేదు. ఈ విషయాన్ని వారే గుర్తించాలని కుమార్ అన్నారు. ఈవీఎంల ద్వారా ఎన్నికల్లో మోసాలు జరుగుతున్నాయని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలపైనా ఆయన స్పందించారు. హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో గెలిచినప్పుడు ప్రభుత్వాలను ఏర్పాటు చేసి, ఓడిపోయినప్పుడు మాత్రమే ఈవీఎంలను నిందించడం వల్ల నైతిక విశ్వసనీయతను కోల్పోతారు. ఈ ద్వంద్వ వైఖరి సరికాదని ఆయన హితవు పలికారు. తాను పార్టీని వీడినప్పటికీ, సోనియాగాంధీ పట్ల తనకు అపారమైన గౌరవం ఉందని అశ్వనీ కుమార్ తెలిపారు. ప్రజా జీవితంలో ఆమె చూపిన హుందాతనాన్ని, ఎందరో ప్రధాని అభ్యర్థులు ఉన్నప్పటికీ తన నాగరికత, గౌరవం కారణంగా మన్మోహన్ సింగ్‌ను ఎంపిక చేయడాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. ప్రస్తుత ప్రభుత్వం, ప్రధాని ప్రతిదీ తప్పు చేస్తున్నారనే భావన కూడా సరైంది కాదని ఆయన పేర్కొన్నారు.

# పేరు మార్చడం కాదు..ప్రయోజనం పెరగాలి: ప్రియాంక



**న్యూఢిల్లీ, డిసెంబరు 13:** కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును పూజ్య బాపు గ్రామీణ్ రోజ్‌గార్ యోజనగా మార్చి నిర్ణయంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకాగాంధీ స్పందించారు. ఉపాధి హామీ పథకం పేరును మార్చడంవల్ల ప్రజలకు చేకూరే ప్రయోజనం ఏమిటని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇలాంటి చర్యలతో డబ్బు ఖర్చు తప్ప మరే ఉపయోగం లేదని విమర్శించారు. వంద రోజులు ఉపాధి కల్పించడం ద్వారా పల్లెప్రాంత పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం కోసం ఎన్నో ఏళ్లుగా అమలు చేస్తున్న ఈ పథకానికి ఇప్పుడు పేరు మార్చాల్సిన అవసరం ఏమిటో తనకు అర్థం కావడం లేదని అన్నారు. పథకం పేరు మార్చితే దానికి సంబంధించిన అన్ని కార్యాలయాలు, వస్తువులపై ఇప్పటికే ముద్రించిన పేర్లను మార్చాల్సి వస్తుందని ప్రియాంకాగాంధీ అన్నారు. ఇది ఖరీదైన ప్రక్రియ అని, చాలా డబ్బు ఖర్చు చేయాల్సి వస్తుందని ఆమె చెప్పారు. కాగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును పూజ్య బాపు గ్రామీణ్ రోజ్‌గార్ యోజనగా మారుస్తూ శుక్రవారం కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అలాగే పనిదినాల సంఖ్యను 100 నుంచి 125కి పెంచింది. ఒక రోజుకు ఇచ్చే కనీస వేతనాన్ని రూ.240కి సవరించింది.



# ట్రంప్ సుంకాలతో అమెరికాకే నష్టం

## ముగ్గురు రిపబ్లికన్లు సభలో తీర్మానం

**వాషింగ్టన్, డిసెంబరు 13:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ దిగుమతులపై విధించిన 50 శాతం సుంకాలను రద్దు చేయాలని కోరుతూ ముగ్గురు అమెరికా చట్టసభ సభ్యులు నిన్న ప్రతినిధుల సభలో తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ టారిఫ్‌లు చట్టవిరుద్ధమని, అమెరికా కార్మికులకు, వినియోగదారులకు, ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని వారు ఆరోపించారు. కాంగ్రెస్ సభ్యులు డెబోరా రాస్, మార్క్ వీసే, రాజా కృష్ణమూర్తి ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆగస్టు 27, 2025న అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం కింద భారత్‌పై అదనంగా విధించిన 25 సుంకాలను రద్దు చేయాలని ఈ తీర్మానం లక్ష్యంగా పెట్టుకుంది. అంతకుముందు విధించిన సుంకాలను కలుపుకొని భారత ఉత్పత్తులపై మొత్తం టారిఫ్‌లు 50 శాతానికి చేరిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కాంగ్రెస్ సభ్యురాలు డెబోరా రాస్ మాట్లాడుతూ, భారత కంపెనీలు మా రాష్ట్రమైన నార్త్ కరోలినాలో బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టాయి. వేలాది ఉద్యోగాలు సృష్టించాయి. ఈ టారిఫ్‌లు మా ఆర్థిక వ్యవస్థకు నష్టం కలిగిస్తున్నాయని అన్నారు. మరో సభ్యుడు మార్క్ వీసే స్పందిస్తూ, భారత్ మాకు ముఖ్యమైన భాగస్వామి. ఈ చట్టవిరుద్ధ సుంకాలు ఇప్పటికే అధిక ధరలతో ఇబ్బంది పడుతున్న సామాన్యులపై మరింత భారం మోపుతాయని తెలిపారు. భారత సంతతికి చెందిన కాంగ్రెస్ సభ్యుడు రాజా కృష్ణమూర్తి మాట్లాడుతూ ఈ సుంకాల వల్ల అమెరికా ప్రయోజనాలకు బదులు నష్టమే ఎక్కువ. ఇవి సరఫరా గొలుసులను దెబ్బతీసి, కార్మికులకు నష్టం కలిగించి, వినియోగదారులపై భారం పెంచుతాయి. వీటిని రద్దు చేయడం ద్వారా అమెరికాభారత్ ఆర్థిక, భద్రతా సహకారాన్ని బలోపేతం చేసుకోవచ్చని వివరించారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలును కొనసాగిస్తోందన్న కారణంతో ట్రంప్ ఆగస్టులో భారత్‌పై దశలవారీగా 50 సుంకాలు విధించారు. ట్రంప్ ఏకపక్ష వాణిజ్య విధానాలను వ్యతిరేకించడంలో భాగంగా కాంగ్రెస్‌లోని డెమొక్రాట్లు ఈ ప్రయత్నాలు చేస్తున్నారు. గత అక్టోబర్‌లో కూడా ఈ ముగ్గురు సభ్యులతో పాటు మరో 19 మంది కాంగ్రెస్ సభ్యులు ట్రంప్‌కు లేఖ రాసి, టారిఫ్ విధానాలను మార్చుకోవాలని కోరారు.

# కనుమరుగవుతున్న ద్వీపకల్పదేశం 'తువాలు'

## వాతావరణ మార్పులే కారణం

## దేశ పౌరులకు ఆస్ట్రేలియా ఆహ్వానం



**ఫునాఫుటి(తువాలు), డిసెంబరు 13:** వాతావరణ మార్పుల కారణంగా ఒక దేశం నెమ్మదిగా కనుమరుగైపోతుంటే, మరో దేశం ఆ ప్రజల భవిష్యత్తుకు భరోసా ఇస్తూ అండగా నిలుస్తోంది. సముద్ర మట్టాలు పెరిగి అస్తిత్వాన్ని కోల్పోతున్న పసిఫిక్ ద్వీప దేశం 'తువాలు' పౌరులకు ఆస్ట్రేలియా ఆశ్రయం కల్పిస్తోంది. ఈ చరిత్రాత్మక ఒప్పందం కింద, తువాలు నుంచి తొలి వలసదారుల బృందం ఈ వారం ఆస్ట్రేలియాలో అడుగుపెట్టింది. వాతావరణ మార్పుల వల్ల ముంపునకు గురవుతున్న తమ పౌరులకు 'గౌరవప్రదమైన వలస'అవకాశం కల్పించాలని తువాలు చేసిన విజ్ఞప్తి మేరకు 2023లో ఆస్ట్రేలియాతో ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం, తువాలు పౌరులకు ప్రత్యేక వీసాలు జారీ చేస్తున్నారు. ఈ వీసా ద్వారా వారు ఆస్ట్రేలియాలో నివసించవచ్చు, చదువుకోవచ్చు, పని చేసుకోవచ్చు. అర్హత సాధించిన వారికి ఆస్ట్రేలియా పౌరసత్వం కూడా లభిస్తుంది. ఇక్కడికి వచ్చిన వెంటనే వారికి విద్య, వైద్య బీమా (మెడికేర్), ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుబాటులోకి వస్తాయి. సుమారు 11,000 జనాభా మాత్రమే ఉన్న తువాలు దేశం నుంచి, ఈ ఏడాది జూన్‌లో వీసా దరఖాస్తులు ప్రారంభం కాగానే 3,000 మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. అయితే, తువాలులో మేధోవలసను నివారించేందుకు ఏటా కేవలం 280 మందికి మాత్రమే వీసాలు జారీ చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి పెన్నీ వాంగ్ మాట్లాడుతూ, వాతావరణ మార్పుల ప్రభావం తీవ్రమవుతున్న వేళ, తువాలు పౌరులకు ఆస్ట్రేలియాలో కొత్త జీవితం ప్రారంభించే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. మరోవైపు, తమ దేశ సంస్కృతి, సంప్రదాయాలను ఎప్పటికీ మర్చిపోవద్దని వలస వెళుతున్న పౌరులకు తువాలు ప్రధాని ఫెలెటి టియో సూచించారు. ప్రపంచంలోనే ఈ తరహా ఒప్పందం ఇదే మొదటిది కావడం గమనార్హం.


# సంక్షిప్తంగా..

## చమురు ట్యాంకర్‌ను సీజ్ చేసిన ఇరాన్



**టెహ్రాన్, డిసెంబరు 13:** భారీ పరిమాణంలో చమురును మోసుకెళ్తోన్న ఒక నౌకను ఇరాన్ సీజ్ చేసింది. గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో శుక్రవారం అర్ధరాత్రి తర్వాత ఈ ఘటన చోటుచేసుకొంది. అందులోని సిబ్బందిలో భారతీయులు కూడా ఉన్నారని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ నౌకలో మొత్తం 18 మంది సిబ్బంది ఉండగా.. వారిలో బంగ్లాదేశ్, శ్రీలంక వాసులు కూడా ఉన్నారని పేర్కొన్నాయి. '60 లక్షల లీటర్ల చమురును ఒక నౌకలో అక్రమంగా తరలిస్తున్నారు. అందుకే నౌకలోని నావిగేషన్ వ్యవస్థలన్నింటినీ నిలిపివేశారు' అని ఇరాన్ మీడియా వెల్లడించింది. గల్ఫ్‌లో అక్రమంగా ఇంధనం రవాణా చేస్తోన్న నౌకలను అడ్డుకుంటున్నట్లు ఇరాన్ ఇప్పటికే పలుమార్లు వెల్లడించింది.

## పాక్ గూఢచర్యంపై అసోం రిటైర్డ్ ఎయిర్‌ఫోర్స్ అధికారి అరెస్టు



**గువాహతి, డిసెంబరు 13:** పాకిస్థాన్ గూఢచర్య నెట్‌వర్క్‌తో సంబంధాలున్నాయన్న ఆరోపణలపై భారత వైమానిక దళానికి చెందిన ఒక రిటైర్డ్ అధికారిని అసోం పోలీసులు అరెస్ట్ చేశారు. తేజ్‌పూర్‌లోని పాటి యా ప్రాంతానికి చెందిన కులేంద్ర శర్మను నిన్న రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. కొంతకాలంగా కులేంద్ర శర్మపై నిఘా పెట్టిన పోలీసులు, ప్రాథమిక విచారణ అనంతరం అతడిని అరెస్ట్ చేశారు. నిందితుడు పాకిస్థాన్ గూఢచర్య సంస్థతో సంబం ధాలున్న వ్యక్తులతో టచ్‌లో ఉంటూ, వారికి దేశభద్రతకు సంబంధించిన సున్ని తమైన సమాచారాన్ని చేరవేస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అతని మొబైల్ ఫోన్, ల్యాప్ టాప్‌ను స్వాధీనం చేసుకోగా, అందులో కొన్ని అనుమానాస్పద ఆధారాలు లభించినట్లు తెలిసింది. అయితే, కొంత డేటాను నిందితుడు డిలీట్ చేసి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

## నోయిడా ఎక్స్‌ప్రెస్‌వేపై ఢీకొన్న వాహనాలు



**నోయిడా, డిసెంబరు 13:** ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతాన్ని దట్టమైన పొగమంచు కమ్మేయడంతో శనివారం ఉదయం ఘోర ప్రమాదం జరిగింది. నొయిడా ఎక్స్‌ప్రెస్‌వేపై పొగమంచు కారణంగా దారి కనిపించక, 12కు పైగా వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కార్లు, ట్రక్కులు ధ్వంసం కాగా, పలువురు గాయపడ్డారు. ప్రమాదం కారణంగా ఎక్స్‌ప్రెస్‌వేపై కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈఘటన హర్యానా, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల మీదుగా వెళ్లే 135 కిలోమీటర్ల పొడవైన ఈస్టర్న్ పెరిఫెరల్ ఎక్స్‌ప్రెస్‌వే (కుండ్లిఘజియాబాద్‌పాల్వాల్ ఎక్స్‌ప్రెస్‌వే)పైచోటుచేసుకుంది. ప్రమాద స్థలంలో కనిపించిన దృశ్యాలు తీవ్రతను తెలియజేస్తున్నాయి. ఒక కారు ముందు భాగం నుజ్జునుజ్జై డివైడర్‌పైకి ఎక్కగా, మరో కారు ట్రక్కు కింద ఇరుక్కుపోయి కనిపించింది. ఈ ప్రమాదంపై గౌతమ్ బుద్ధ నగర్ (నొయిడా) పోలీస్ కమిషనరేట్ కార్యాలయం ఎక్స్ (ట్విట్టర్) ద్వారా స్పందించింది.

## యుపి బిజెపి చీఫ్‌గా కేంద్ర సహాయమంత్రి పంకజ్ చౌదరి



**లక్నో, డిసెంబరు 13:** కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరీని ఉత్తరప్రదేశ్ బీజేపీ పార్టీ చీఫ్‌గా హైకమాండ్ నియమించనున్నది. ఆదివారం లక్నోలో గ్రాండ్ ఆ సెర్మనీ జరిగే ఛాన్సు ఉన్నట్లు తెలు స్తోంది. ఇవాళ ఆయన తన నామినేషన్ పేపర్స్ దాఖలు చేసే అవకాశం ఉన్నది. నామినేషన్ దాఖలు కార్యక్రమానికి కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ హాజరుకానున్నారు. జాతీయ కార్యదర్శి వినోద్ తవడే కూడా హాజరవుతారు. మహారాజ్‌గంజ్ నియోజకవర్గం నుంచి పంకజ్ చౌదరీ ఏడుసార్లు ఎంపీగా గెలిచారు.

## నోబెల్ పురస్కార గ్రహీతను అరెస్టు చేసిన ఇరాన్



**టెహ్రాన్, డిసెంబరు 13:** నోబెల్ శాంతి పురస్కార గ్రహీత, ఇరాన్‌కు చెందిన మానవ హక్కుల కార్యకర్త నర్గెస్ మొహమ్మదిని స్థానిక పోలీసులు మరోసారి అరెస్టు చేశారు. ఇటీవల మరణించిన ఓ మానవ హక్కుల న్యాయవాది స్మారక చిహ్నాం వద్ద నివాళులర్పిస్తుండగా ఆమెను అదుపులోకి తీసుకున్నట్లు ఆమె మద్దతుదారులు, సంబంధిత స్వచ్ఛంద సంస్థలు వెల్లడించాయి. అయితే, ఆమె అరెస్టుపై ఇరాన్ ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు. మహిళల హక్కుల కోసం, ఇరాన్ ప్రభుత్వ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా నర్గెస్ మొహమ్మది మూడు దశాబ్దాలకు పైగా పోరాడుతున్నారు. ఆమె అలుపెరగని పోరాటానికి గుర్తింపుగా 2023లో నోబెల్ శాంతి బహుమతి లభించింది. ఆ పురస్కారం ప్రకటించే సమయానికి కూడా ఆమె జైల్లోనే ఉండటం గమనార్హం.

14-12Pg6exHMNWJQE 10_14-12Pg6exHMNWJQE.qxd 13/Dec/25 11:14 PM Page 1



# కానిస్టేబుల్ అభ్యర్థులకు నియామక పత్రాలు 16న జారీ: హోంమంత్రి అనిత



:కానిస్టేబుల్ అభ్యర్థులకు నియామక పత్రాల జారీ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న అనిత

**విజయవాడ,డిసెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** కానిస్టేబుల్ అభ్యర్థులకు నియామక పత్రాల 16వ తేదీన జారీచేస్తున్నామని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. కానిస్టేబుళ్ళ ఎంపిక పరీక్షలను సీఎం చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించినట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు వెంటనే పోస్టింగ్ పత్రాలు ఇస్తారని వివరించారుకూటమి ప్రభుత్వం మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. డీఎస్సీ లో ఉద్యోగాలు సాధించిన వారికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా ఆఫర్ లెటర్స్ ఇచ్చారు. ఇదే పంథాను మరోసారి కొనసాగిం చనున్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పోలీసు శాఖలో సుమారు 6 వేల కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేసింది. వీరికి ఈనెల 16న ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా నియామక పత్రాలు ఇవ్వనున్నారు. అందుకోసం గుంటూరు జిల్లా మంగళగిరి ఆరో బెటాలియన్ పరేడ్ గ్రౌండ్‌లో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం 18 వేల మంది హాజరయ్యేలా అధికారులు చర్యలు తీసుకుం టున్నారు మంగళగిరి లోని 6వ బెటాలియన్‌ను రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత సందర్శించారు. ఈ నెల 16వ తేదీన జరగనున్న కానిస్టేబుల్ అభ్యర్థులకు నియామక పత్రాల జారీ కార్యక్ర మానికి సంబంధించిన ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అనిత పోలీస్ ఉన్నతాధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ, సభా వేదిక నిర్మాణం, వేదికకు చేరుకునే మార్గాలు, పార్కింగ్ సౌకర్యాలు, వీవీఐపీ మరియు వీఐపీలకు ఏర్పాటు చేసే వసతులు, ఇతర జిల్లాల నుండి హాజరయ్యే అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు, బందోబస్తుకు వచ్చే పోలీస్ అధికారులు., సిబ్బందికి కల్పించాల్సి న సౌకర్యాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. అనంతరం, ఎక్కడ ఎలాంటి లోటుపాట్లు లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని, కార్యక్రమాన్ని సజావుగా మరియు విజయవ ంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలని, తగినంత పోలీస్ బలగాలతో సమర్థవంతమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని హోం మంత్రి పోలీస్ ఉన్నతాధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమం లో డీఐజీ సత్య యేసు బాబు, గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఐపీఎస్, బెటాలియన్ కమాండెంట్ నగేష్ ఐపీఎస్, జిల్లా అదనపు ఎస్పీ ఏటీవీ రవికుమార్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# నైపుణ్య విద్యలో అగ్రగామి సెంచూరియన్ వర్సిటీ!

**- వికసిత్ భారత్ నిర్మాణంలో యువత పాత్ర కీలకం**

**- ఘనంగా 5వ స్నాతకోత్సవం**

**- విశిష్ట అతిధులు డాక్టర్ ఎస్.ఎన్.సాబత్, శంకరన్ నరేన్**



**నెల్లిమర్ల (విజయనగరం జిల్లా), డిసెంబర్ 13 ప్రభాతవార్త :** ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ నివ్వడంలో సెంచూరియన్ విశ్వవిద్యాలయం (సియుటిఎం) ఒక ప్రత్యేకతను సంతరించుకొని అగ్రగామిగా నిలిచిందని ఉత్తరప్రదేశ్ సబార్డినేట్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డు చైర్మన్ డాక్టర్ ఎస్.ఎన్.సాబత్ అన్నారు. శనివారం సెంచూరియన్ విశ్వవిద్యాలయ 5వ స్నాతకోత్సవ వేడుకలకు ఆయన విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్.ఎన్.సాబత్ మాట్లాడుతూ నాణ్యమైన విద్య, ఆచరణాత్మక జ్ఞానం, అభ్యాస ఆధారిత విద్యకు సెంచూరియన్ నిదర్శనమన్నారు. యువత నిజాయితీ, నైతిక విలువలతో ముందడుగు వేయాలన్నారు. వికసిత్ భారత్ నిర్మాణంలో కూడా యువత భాగస్వాములు కావాలన్నారు. మరో విశిష్ట అతిథి ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ ఎఎంసి సిఐఒ శంకరన్ నరేన్ మాట్లాడుతూ రాబోయే కాలంలో కృత్రిమ మేధస్సు, జన్యు చికిత్స, బయో టెక్నాలజీ వంటి ఆవిష్కరణలతో కొత్త కొత్త మార్పులు రాబోతున్నాయన్నారు. ఎవరైతే సాంకేతిక మార్పుతో వేగం పెంచుకోలేకపోయారో వారు వెనుకబడినట్టు చరిత్ర ద్వారా నిరూపితమవుతుందన్నారు. అందువల్లనే యువత మార్పును స్వాగతించాలన్నారు. ఈ వేడుకలకు అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు మాట్లాడుతూ సెంచూరియన్ యూనివర్శిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్ మెంట్ అనేది నైపుణ్య సమీకృత ఉన్నత విద్యా కేంద్రమని కొనియాడారు. ఈ విశ్వవిద్యాలయాన్ని స్థాపించిన ప్రొఫెసర్ ముక్తికాంత్ మిశ్రా, ప్రొఫెసర్ డి.ఎన్.రావు గొప్ప నాయకత్వ లక్షణాలు కలిగిన విద్యావేత్తలని శ్లాఘించారు. విద్యార్థులు తమ జీవితంలో ఎదురయ్యే అనేక సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. ప్రతి ఒకరు ఉన్నతంగా ఎదగడానికి కావాల్సి న లక్షణాల గురించి వివరించారు. అనంతరం ఛాన్సలర్ ప్రొఫెసర్ రాజు, విశిష్ట అతిధులు డాక్టర్ ఎస్.ఎన్.సాబత్, శంకర్ నరేన్, ప్రొఫెసర్ ముక్తికాంత్ మిశ్రా, ప్రొఫెసర్ డి.ఎన్.రావు అతిధుల చేతుల మీదుగా ఆరు పిహెచ్ డిలతోపాటు 409 మందికి డిగ్రీలను ప్రధానం చేశారు. అలాగే ఉత్తరప్రదేశ్ సబార్డినేట్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డు చైర్మన్ డాక్టర్ ఎస్.ఎన్.సాబత్, ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ ఎఎంసి సిఐఒ శంకరన్ నరేన్‌లకు గౌరవ డాక్టరేట్లను ప్రధానం చేశారు. అలాగే వివిధ విభాగాలలో టాపర్లకు 14 బంగారు పతకాలను, 8 మందికి నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. అనంతరం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి మాట్లాడుతూ విద్య నాణ్యత, పరిశోధనలను పెంపొం దిం చేందుకు సెంచూ రియన్ తీసు కుంటున్న చర్యల గురించి వివ రించారు.

# ఇండియా జట్టులో రెడ్డిచర్ల దేవీప్రియ



**తిరుపతి క్రీడ, డిసెంబర్ 13, ప్రభాతవార్త** తిరుపతి జిల్లాకు చెందిన నెరబైలు రెడ్డిచర్ల దేవి ప్రియ ఇటీవల పంజాబ్ రాష్ట్రంలో గత నవంబర్‌లో జరిగిన గోల్ షాట్ బాల్ ఇండియా జట్టు ఎంపికలకు హాజరై ప్రతిభ కనబరిచి ఇండియా జట్టులో స్థానం సంపాదించారు. దేవీప్రియ డిసెంబర్ నెలలో 5వ తేదీ నుండి 13వ తేదీ వరకు ఇండియా జట్టులో ప్రాక్టీస్ క్యాంప్‌లో మహారాష్ట్ర పుణె లో పాల్గొని డిసెంబర్ 15 నుండి 19వ తేదీ వరకు జరిగే సౌత్ ఆసియా అంతర్జాతీయ ఛాంపియన్షిప్ నేపాల్ దేశం ఖాట్మండులో జరగనున్న పోటీలలో పాల్గొననున్నారని గోల్ షాట్ బాల్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి మనోహర్ రెడ్డి తెలిపారు. తండ్రి రామకృష్ణ కుటుంబ పోషణకై కువైట్‌లో పనిచేస్తారు. తల్లి సుబ్బమ్మ వ్యవసాయం చేస్తారు. దేవి ప్రియ మెరిటస్ అకాడమీ జూనియర్ ప్రైవేట్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. దేవీ ప్రియ క్రీడాప్రస్థానం తన చిన్ననాటి నుండి మొదలు 2010 నుండి 2025 వరకు హాకీ, ఫుట్బాల్, వాలీబాల్, షూటింగ్ బాల్ మొదలగు వాటిల్లో రాష్ట్ర మరియు జాతీయ స్థాయిలో రాణించింది.

# 'సరస్వతిపవర్' ఒప్పందాలు అందుకే రద్దు

## షర్మిలకు చట్టబద్ధ హక్కులు లేవు: ఎన్‌పిఎస్‌టిలో జగన్

**విజయవాడ,డిసెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** సరస్వతి పవర్ లిమిటెడ్‌తో పాటు కొన్ని ఆస్తులను ప్రేమతో చెల్లి షర్మిలకు ఇవ్వాలని నిర్ణయించి 2019 ఆగస్టు 31న అవగాహన ఒప్పందం, వాటాల బదిలీల ఒప్పందం కుదుర్చుకున్నామని, అయితే షర్మిళ రాజకీయంగా వ్యక్తిగతంగానూ తన ప్రతిష్టను దెబ్బతీయంతో ఈ ఒప్పందాలను అమలు చేయకూడదని నిర్ణయించుకున్నట్లు ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చెన్నై లోని జాతీయ కంపెనీ అప్పీలెట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ)కి నివేదించారు. సరస్వతి పవర్ లిమిటెడ్ ఆస్తుల జప్తునకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తెలంగాణ హైకోర్టులో అప్పీలు దాఖలు చేసిందని, ఈ కేసులన్నీ పూర్తయ్యాక ఆస్తులు వాటాల బదలాయింపు అమలు చేయాలని గతంలో నిర్ణయించుకున్నట్లు తెలిపారు. చెల్లిపై ప్రేమతో భవిష్యత్తులో ఆస్తులు బదలాయించడానికే గతంలో ఒప్పందం కుదిరిందన్నారు. ఈ ఆస్తులన్నీ తన స్వార్జితమని, షర్మిళకు ఎలాంటి పట్టబద్దమైన హక్కులూ లేవన్నారు. ఎలాంటి చట్టబద్దమైన పత్రాలు లేకుండా విజయమ్మ, చాగరి జనార్ధనరెడ్డిల తేఖల ఆధారంగా తమ పేర్లతో ఉన్న వాటాలను బదలాయిస్తూ సరస్వతి కంపెనీ బోర్డు ఏకపక్షంగా తీర్మానం చేసిందని, ఈ తీర్మానాన్ని సవాలు చేస్తూ, తాను హైదరాబాద్ జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో పిటీషన్ వేసినట్లు తెలిపారు. దీనిపై విచారించిన ఎన్‌సీఎల్‌టీ సరస్వతి కంపెనీ బోర్డు తీర్మానాన్ని రద్దు చేసి వాటాలను పునరుద్దరించాలని ఆదేశించిందన్నారు. ఈ ఆదేశాల అనంతరం తన వాటా 29.88 భారతిరెడ్డి 16.30 క్లాసిక్ రియాలిటీ వాటా 4.83, విజయమ్మ వాటా 48.99 శాతం చొప్పున పునరుద్దరించాల్సి ఉందన్నారు. దీనికి విరుద్ధంగా ఎన్‌సీఎల్‌టీ ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సరస్వతి పవర్ లిమిటెడ్ ఇక్కడ అప్పీలు దాఖలు చేసిందన్నారు. ఇలా అప్పీలు దాఖలు చేసే అర్హత సరస్వతి పవర్ లిమిటెడ్‌కు లేదని తెలిపారు. ఎన్‌సీఎల్‌టీ ఉత్తర్వుల వల్ల కంపెనీకి ఎలాంటి నష్టం వాటిల్లలేదన్నారు. తటస్థంగా ఉండాల్సి న సరస్వతి పవర్ కంపెనీ వైఎస్ విజయమ్మ, చాగరి జనార్ధన్‌రెడ్డిల తరపున వకాల్తా పుచ్చుకునేందుకు వీల్లేదన్నారు. బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ చట్ట విరుద్ధంగా వ్యవహరించినపుడు వారిని సమర్థిస్తూ కంపెనీ అప్పీఊలు చేయడానికి వీల్లేదన్నారు. తల్లి విజయమ్మ ట్రస్టీగా చెల్లికి వాటాలతో సహా కొన్ని ఆస్తులు ఇవ్వడానికి అవగాహన ఒప్పందం కుదిరిందన్నారు. కోర్టు కేసులు తేలిన తర్వాత బదలాయింపు నిమిత్తం వాటాల సర్టిఫికెట్లు కూడా ఇవ్వలేదన్నారు. వాటాల బదలాయింపును సమర్థించుకునేందుకు సరస్వతి కంపెనీ ప్రయత్నిస్తోందన్నారు. తనతో పాటు భారతిరెడ్డి, క్లాసిక్ రియాలిటీలు విజయమ్మకు గిఫ్ట్‌డీడ్‌లు ఇచ్చామని, ఇందులో సరస్వతి కంపెనీ ప్రమేయం లేకపోయినా వారి తరపున వాదనలు వినిపించిందన్నారు. వాటాల బదలాయింపు ఒప్పందం జరిగిన మూడేళ్ళు మౌనంగా ఉండి తర్వాత బదలాయించడాన్ని సమర్థించుకోవడానికి సరైన కారణం లేదన్నారు. ఎన్‌సిఎల్‌టీ తీర్పుపై ఇచ్చిన స్టే ఉత్తర్వులు తొలగించాలని అభ్యర్థించారు.

# చినగొలుగువలసలో అగ్ని ప్రమాదం

## వృద్ధురాలు మృతి.. 12 పూరిళ్లు దగ్ధం.. ఆరు లక్షల ఆస్తి నష్టం



**తెర్లాం (విజయనగరం జిల్లా) డిసెంబర్ 13 ప్రభాతవార్త:** విజయనగరం జిల్లా తెర్లాం మండలంలో కొరటాం గ్రామపంచాయతీ మధుర గ్రామం సీతారాంపురం (చిన గొలుగువలస) గ్రామంలో శుక్రవారం రాత్రి 11 గంటలకు అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కోస్ట్ పాపమ్మ (70) అగ్నికి ఆహుతయ్యింది. ఈ ప్రమాదంలో 12 ఇళ్లు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాద బాధితులంతా కూలీలు, గీత కార్మికులు. రాత్రి ఒక్కసారి మంటలు రావడంతో, అనంతరం పెద్ద శబ్దం రావడంతో ప్రజలు భయాందోళనతో పరుగులు తీశారు. సంఘటన స్థలానికి స్థానిక ఎస్సై జి.సాగర్‌బాబు, తహసిల్దార్, సిబ్బంది హాజరయ్యారు. రాజాం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే తహసిల్దార్ జి.హేమంత్ కుమార్ రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేశారు. బాధితులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సహాయక చర్యలు చేపట్టారు. శనివారం బాధితులకు ఐదు రోజులకు సరిపడ వంటసామగ్రిని అందజేశారు. బొబ్బిలి రెవెన్యూ డివిజనల్ అధికారి రామ్మోహన్‌రావు సంఘటన స్థలాన్ని పరిశీలించి బాధితులకు తక్షణ సహాయం కింద 13 వేల రూపాయలు వంట సామాగ్రి కలిపి అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. రూరల్ సీఐ కే.నారాయణరావు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాద సంఘటనలో హెచ్‌డిటి జి. సత్యనారాయణ, ఆర్ఐ కృష్ణమూర్తి, విఆర్వోలు గణపతి, రాము, రవికుమార్, సుధాకర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ ప్రమాదంలో రెండున్నర తులాల బంగారం, 80 వేల రూపాయలు నగదు, 50 తులాలు వెండి కాలి బూడిద అయిందని, అదేవిధంగా కోస్ట్ అప్పడుకు చెందిన అర తులం బంగారం, లక్ష రూపాయలు నగదు కాలిపోయాయి.

# లింగాలవలస ఎయిర్‌పోర్ట్ కాలనీలో దారుణ హత్య

**భోగాపురం (విజయనగరం జిల్లా), డిసెంబర్ 13 ప్రభాతవార్త:** విజయనగరం జిల్లా భోగాపురం మండలం లింగాలవలస ఎయిర్‌పోర్ట్ కాలనీలో దారుణ హత్య చోటుచేసుకుంది. ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలు ముడసల అప్పయ్యమ్మను గుర్తు తెలియని దుండగులు హతమార్చి, ఆమె మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. అదే విధముగా మృతురాలు ఇంటి పక్కనే ఉన్న వాటర్ ట్యాంక్ సమీపంలో మృతదేహం ఉండటం గమనార్హంగావుంది. కుటుంబ సభ్యులు తీరదయాత్రకు వెల్లిన సమయంలో ఈ ఘటన జరిగినట్టు తెలిపారు. అప్పయ్యమ్మ మృతదేహం సమీపంలోని వాటర్ ట్యాంక్ వద్ద పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అలాగే పోలీసులకు సమాచారం అందించడముతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దుండగులను గుర్తించి త్వరలో అరెస్ట్ చేస్తామని పోలీసులు తెలిపారు. ఈ ఘటనతో లింగాలవలస ఎయిర్‌పోర్ట్ కాలనీలో భయాందోళనలు నెలకొన్నాయి.

# ఇన్ సర్వీస్ వైద్యులకు డిఎన్‌బి సీట్ల కేటాయింపు

**విజయవాడ,డిసెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** సర్వీసులో ఉన్న వైద్యుల కోసం (ఇన్ సర్వీస్) 2025-26 సంవత్సరానికి సంబంధించి డీఎన్‌బీ (డిప్లొమేట్ ఆఫ్ నేషనల్ బోర్డు) సీట్లు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మూడేళ్ళ కాలపరిమితితో కూడిన పోస్ట్ ఎంబీబీఎస్ డీఎన్‌బీ కోర్సుకు సంబంధించి విజయనగరంలోని వైద్యకళాశాలలకు ఆర్థోపెడిక్, నంద్యాల వైద్య కళాశాలకు ఎమర్జెన్సీ మెడిసిన్, అనకాపల్లిలో ఎబీజీ విభాగాల్లో ఒక్క సీటు కేటాయించింది. పోస్టు ఎంబీబీఎస్ రెండేళ్ళ డీఎన్‌బీ కోర్సుకు సంబంధించి రాష్ట్రంలోని 18 భోధనాస్పత్రుల్లో అనస్థీషియా-6, ఎబీజీ-5, పీడియాట్రిక్స్- 3, ఈఎన్‌టీ-2, ఆర్థోపెడిక్-5, మెడిసిన్-5, రేడియోలజీ-5 సీట్లు చొప్పున మొత్తం 27 సీట్లు కేటాయించింది. ఈ మేరకు వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్‌గౌర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మెడికల్ కౌన్సిల్ ఎన్నికల నిర్వహణకు ఆర్వో నియామకం ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ ఎన్నికల నిర్వహణకు సెకండరీ హెల్త్ డైరెక్టర్‌ను రిటర్నింగ్ అధికారిగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఏపీ హైకోర్టు గత నెల 11న ఇచ్చిన ఆదేశాలకనుగుణంగా త్వరగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.

# ఎన్టీఆర్ జిల్లాలో సమసిపోని టిడిపి వర్గపోరు

**- ఎంపి కేశినేని నానిపై తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు ఆరోపణలు - అధిష్ఠానం చెప్పినా బేఖాతర్**



**విజయవాడ, డిసెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్టీఆర్ జిల్లాలో టీడీపీ వర్గపోరు సమసి పోలేదు. స్వయంగా టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాలతో తిరువూరు ఎంఎల్ఏ కొలికపూడి శ్రీనివాసరావు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) నడుమ దాదాపు 18 నెలలుగా సాగుతుంది. రెండు వర్గాలు మీడియా సమావేశాల్లోను, సామాజిక మాధ్యమాల్లో నేరుగా ఆరోపణలకు దిగాయి. ఎప్పటికప్పుడు ఇరు వర్గాల మధ్య సఖ్యత కుదిరించేందుకు టీడీపీ అధిష్టానం ప్రయత్నం చేస్తుంది. విషయం పరిష్కారమయినట్లే అవుతుంది. మళ్ళీ రాజుకుంటుంది. ఎంపీ చిన్నికి కొలికలపూడికి మధ్య జరగుతున్న వర్గపోరులో పరోక్షంగా ఉన్నత సామాజిక వర్గ అహంభావం స్పష్టం ఉందని ఎంఎల్ఏ అనుచరులు బహిరంగంగా ఆరోపణలు సాగించాయి. ఈ వివాద పరిష్కారానికి వేసిన కమిటీలోను అవే వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వడం తనకు అన్యాయం జరుగుతుందని కొలికలపూడి వ్యాఖ్యానించినట్లు చెబుతున్నారు. అయితే ఈ వివాదంలో ఎంపీ కేశినేని చిన్ని వర్గీయులు తప్ప, ఆయన పెద్ద స్పందించి ప్రకటనలు చేసిన సందర్భాలు లేవు. ఈ క్రమంలో "నువ్వు దేనికి అధ్యక్షుడివి? పేకాట క్లబ్‌కా ? పేకాట కోసం ఆఫీస్ పెట్టావంటే నువ్వు నిజంగా రాయల్‌వ్వే అంటూ ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తన వాట్సప్ స్టేటస్‌లో పోస్టు పెట్టడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 'కొండపర్వ గట్టు దగ్గర డే అండ్ నైట్ పేకాట మ్యాచ్ ఆడిస్తున్నావ్వు అంటూ స్టేటస్‌లో వ్యాఖ్యలు పెట్టారు. ఈ పోస్టులు ఎవరినుద్దేశించో పెట్టారో అర్థంగాక టిడిపి శ్రేణులు జుట్టు పీక్కుంటున్నాయి. దీంతో తిరువూరు నియోజకవర్గ టిడిపిలో రచ్చ మరోసారి తారాస్థాయికి చేరినట్లయింది. విజయవాడ ఎంపి, టిడిపి నాయకులు కేశినేని శివనాథ్ (చిన్ని) గ్రూపునకు చెందిన వారు ఇటీవల ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య వద్దకు వెళ్లి ఎంఎల్ఎ కొలికపూడి వ్యవహారశైలిపైనా, తిరువూరు నియోజకవర్గంలో పార్టీ దుస్థితిపైనా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే ఎంఎల్ఎ కొలికపూడి పైవిధంగా ఎంపి గ్రూపునకు చెందిన వారిపై స్పందించినట్లు ప్రచారం జరుగుతోంది. వర్ల రామయ్య వద్దకు వెళ్లిన వారిలో టిడిపి విస్సన్నపేట మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావు కూడా ఉన్నారు. ఎంఎల్ఎ పెట్టిన పోస్టుపై రాయల సుబ్బారావు స్పందించి మీడియా ముందుకు వచ్చారు. తననుద్దేశించే ఎంఎల్ఎ పోస్టు పెట్టారని భావించిన ఆయన విస్సన్నపేటలో మీడియా సమావేశం పెట్టి కొలికపూడిపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. బెల్ట్ షాపులు లేకుండా చేస్తానని చెప్పి వైన్‌షాపు డీలర్ల నుండి ఎంఎల్ఎ డబ్బులు తీసుకున్నారని, గత ఏడాది సంక్రాంతి పండుగ సమయంలో కోడిపందేల బరుల వద్దకు వెళ్లి పందెందారుల నుండి ఎన్ని డబ్బులు తీసుకున్నారో అందరికీ తెలుసునని విమర్శించారు. గోపాలపురం క్వారీలో అక్రమంగా గ్రావెల్ తోలించారని ఆరోపించారు.

# ఏ రాష్ట్రంలో లేని విధంగా నూతన పారిశ్రామిక విధానం ఎపిలో ఉంది: మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**విజయవాడ, డిసెంబరు 13,ప్ర భాత వార్తప్రతినిధి:** దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా నూతన పారిశ్రామిక విధా నాన్ని ఆంధ్రప్రదేశ్‌లో [illegible] ప్రభుత్వం తీసుకొచ్చిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఏపీ చాంబర్స్ బిజినెస్ ఎక్స్ పోలో మంత్రి మాట్లాడుతూ.. పాతికేళ్ళ క్రితం చంద్రబాబు ఎలా ఆలోచించారో చూశామని.. ఐటీకి భవిష్యత్తు ఉంటుందని, నాటి యువతను ప్రోత్సహించారని గుర్తుచేశారు. అవసరమైన మౌళిక సదుపాయాలను ఆ నాడు ఏర్పాటు చేశారని తెలిపారు. తాను ఐటీ రంగంలో 16 ఏళ్ళు రాణించానంటే చంద్రబాబు నాయుడు ఆనాడు ఏర్పాటు చేసిన విధానాలే కారణమని చెప్పుకొచ్చారు. ప్రతీ ప్రొడక్ట్ కూడా భారత సమాజంలో విక్రయించే అవకాశం ఉంటుందని.. ప్రపంచంలో వాడే ప్రతీ వస్తువు భారత్‌లో వినియోగిస్తారని తెలిపారు. భారత్ వైపు ప్రపంచం చూస్తోందన్నారు. భారత్‌లో పెట్టుబడులు ఎలా పెట్టాలని.. భారత్ మార్కెట్‌లో ఎలా అడుగు పెట్టాలనే దానిపై ప్రపంచ దేశాలు చూస్తున్నాయని వెల్లడించారు. ఈ మేరకు ఎన్డీఏ ప్రభుత్వం, ప్రధాని పని చేస్తున్నారని అన్నారు. డ్రోన్ టెక్నాలజీ, ఏరో స్పేస్, బయో టెక్నాలజీ ఇలా అనేక రంగాల్లో క్లస్టర్‌లను ఏర్పాటు చేశారని మంత్రి తెలిపారు. చంద్రబాబు నాయుడు పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేసే దిశగా పని చేస్తున్నారన్నారు. చిన్న తరహా పరిశ్రమలు అన్నీ ఆ దిశగా అడుగులు వేయాలని.. పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయని సూచనలు చేశారు. పెద్ద పరిశ్రమలు వచ్చే దగ్గర చిన్న తరహా పరిశ్రమలకు అవకాశాలు ఉన్నాయని.. వాటిని చిన్న తరహా పరిశ్రమల పారిశ్రామిక వేత్తలు వినియోగించుకోవాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తులకు భారత్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు.

# జరీబు భూముల సమస్యలను నెల రోజుల్లో పరిష్కరిస్తాం : కేంద్ర మంత్రి పెమ్మసాని

**విజయవాడ,డిసెంబరు 13. ప్రభాతవార్తప్రతినిధి:** జరీబు భూముల సమస్యల పరిష్కారానికి నెల రోజుల సమయం పడుతుందని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. నేల స్వభావంపై పరీక్షలు నిర్వహించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. సీఆర్డీఏ కార్యకలాపాలపై ఆయన సమీక్ష నిర్వహించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. సీఆర్డీఏ కార్యకలాపాలపై ఆయన సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఉండవల్లి లేఅవుట్ అభివృద్ధి ప్రారంభమైదని పేర్కొన్నారు. లంక జభూముల సమస్య కూడా పరిష్కారమైందని చెప్పారు. 7 వేల ప్లాట్ల రిజిస్ట్రేషన్ పెండింగ్‌లో ఉందని వివరించారు. 'భూ సమీకరణ చేయని భూముల్లో ప్లాట్లు పొందిన వారి సమస్య పెండింగ్‌లో ఉంది. అక్కడ రైతులతో ఎంఎల్ఏ మంత్రి మాట్లాడాక భూసేకరణకు వెళ్తాం. వేరే చోట్ల ప్లాట్లు కావాలని అడిగిన వారికి లాటరీ ద్వారా కేటాయించే చర్యలు తీసుకుంటాం. పెద్ద పాల్లట్లు పొందేవారు కొంత సమయం వేచి ఉండాలి. కమర్షియల్ ప్లాట్లలో వాస్తు ప్రకారం ఉండాలని కొందరు అడిటారు. 7 ఎకరాల మేర ప్లాట్లు మార్చాల్సి ఉంటుంది. రైతులు మళ్ళీ వాస్తు పేరిట రావొద్దని కోరుతున్నాం. 26 గ్రామాల్లో అభివృద్ధి పనుల డీపీఆర్‌లు సిద్ధం చేస్తున్నాం. వారంలో డీపీఆర్‌లు సిద్ధం చేసి నెలాఖరులోగా పనులు ప్రారంభిస్తాం. సామాజిక అభివృద్ధిలో భాగంగా కమ్యూనిటీ హాళ్ళు, శ్మశానాలు నిర్మిస్తాం. వీటికి భూమి, నిధులు సమకూరుస్తున్నాం.

# ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరులో కిడ్నీ వ్యాధుల నియంత్రణకు చర్యలు

**- ఎ.కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని నాలుగు పడకల డయాలసిస్ కేంద్రం ద్వారా సేవలు : జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. ఎం.సుహాసిని**

**విజయవాడ,డిసెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఎ.కొండూరులో కిడ్నీ వ్యాధుల నియంత్రణకు విస్తృత, నిరంతర ఆరోగ్య చర్యలు చేపడుతున్నామని ఆ శాఖ జిల్లా అధికారి డాక్టర్ ఎం. సుహాసిని తెలిపారు. రోగుల జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలుచేస్తున్నామన్నారు. ఈ చర్యల కారణంగానే సీకేడీ వ్యాధి తీవ్రత తగ్గిందని గ్రామస్థాయిలోనే వ్యాధికి జీవనాధార చికిత్సలు అందుబాటులో ఉన్నాయని.. ఎ.కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని నాలుగు పడకల డయాలసిస్ కేంద్రం ద్వారా సేవలు అందుతున్నాయన్నారు. ప్రస్తుతం ఇక్కడ 26 మంది రోగులు ఈ సేవలు పొందుతున్నారన్నారు. విజయవాడకు వెళ్లాల్సి న అవసరం లేకుండానే రోగులు ఇక్కడ సేవలు పొందుతున్నారన్నారు. ప్రతి డయాలసిస్ రోగికి ప్రభుత్వం ద్వారా నెలకు రూ. 10 వేల ఆర్థిక సహాయం అందుతోందన్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు సమగ్ర వైద్య పర్యవేక్షణ అందించేందుకు నెఫ్రాలజిస్ట్ ఓపీ సేవలను విస్తరించినట్లు తెలిపారు. ఈ సేవల ద్వారా రోగులకు నేరుగా నిపుణుల సలహాలు, చికిత్స మార్గదర్శకాలు, మందుల సర్దుబాటు, అవసరమైన సూచనలు అందుతున్నాయని.. దీనివల్ల వ్యాధి తీవ్రతను తొలిదశలోనే గుర్తించి నియంత్రించే అవకాశం పెరిగిం దన్నారు. జిల్లా కలెక్టర్ వారి మార్గ నిర్దేశనంతో ఎ.కొండూరు ప్రాంతంలో వైద్య ఆరోగ్య శాఖతో పాటు సమన్వయ శాఖల అధికారుల బృందాలు నిరంతర పర్యవేక్షణలో ప్రత్యేక సర్వేలు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్వో తెలిపారు. మొదటి సర్వేలో 242 కేసులను గుర్తించగా.. ఇటీవలి సర్వే నాటికి ఈ సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. నిరంతర మందుల వినియోగం, జీవనశైలి మార్పులు, వైద్య పర్యవేక్షణ వల్ల కొందరు రోగులు పూర్తిగా కోలుకోగా, మరికొందరిలో వ్యాధి తీవ్రత తగ్గిందని వివరించారు. డయాలిసిస్ అవసరమైన రోగుల సంఖ్య స్థిరంగా ఉండటం చికిత్సల ప్రభావం ఇచ్చిన ఫలితాలకు నిదర్శనమన్నారు. మూత్రపిండ వ్యాధిగ్రస్తులకు అవసరమైన మందులు, పోషక సప్లిమెంట్లు పూర్తిగా ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి ఎప్పటికప్పుడు రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలు నిర్వహిస్తూ రోగుల ఆరోగ్య స్థితిని సమగ్రంగా పరిశీలిస్తున్నారు. డయాలిసిస్, ఇతర చికిత్సల కోసం రోగులకు ప్రత్యేక రవాణా సౌకర్యం అందుబాటులో ఉంది.



కిడ్నీ వ్యాధిగ్రస్తులను పరామర్శిస్తున్న ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. ఎం.సుహాసిని

# ఇడబ్ల్యుఎస్, కాపు వర్గాలకు క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీల ఏర్పాటు : మంత్రి ఎస్.సవిత



**విజయవాడ,డిసెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ తరహాలో అన్ని ఇడబ్ల్యుఎస్, కాపు వర్గాలకు క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీలను ఏర్పాటు చేయనున్నట్లు బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. ఇడబ్ల్యుఎస్, కాపు కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లతో రాష్ట్ర సచివాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 201419ల మధ్య ఇడబ్ల్యుఎస్ సామాజిక వర్గాల కోసం అమలు చేసిన అన్ని పథకాలను తిరిగి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆర్యవైశ్యులు కోరిన విధంగా కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినాన్ని అధికారిక కార్యక్రమంగా నిర్వహించామన్నారు. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్తను తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేయనున్న ఎంఎస్ఎంఇ పార్కుల్లో ఇడబ్ల్యుఎస్ సామాజిక వర్గాలకు ప్రాధాన్యమిస్తున్నట్లు వెల్లడించారు. వివిధ పథకాల అమలులో భాగంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఇడబ్ల్యుఎస్ కార్పొరేషన్‌లకు కూటమి ప్రభుత్వం రూ.10,608.61 కోట్లు కేటాయించిందన్నారు. వాటిలో ఇబిసిలకు రూ.915.28 కోట్లు, కమ్మ కార్పొరేషన్‌కు రూ.1,711.42 కోట్లు, క్షత్రియ కార్పొరేషన్‌కు రూ.1,946.36 కోట్లు, క్షత్రియ కార్పొరేషన్‌కు రూ.260.20 కోట్లు, కాపు కార్పొరేషన్‌కు రూ.4,884.83 కోట్లు, ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు రూ.545.05 కోట్లు, బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ.345.46 కోట్లు కేటాయించామని తెలిపారు. కాపుల అభ్యున్నతి కోసం సీఎం చంద్రబాబు పెద్దపీట వేస్తున్నారని మంత్రి సవిత తెలిపారు. 201419లో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం రూ.172 కోట్లతో మంజూరు చేసిన 13 జిల్లా స్థాయి కాపు భవనాలను, 487 మినీ కాపు భవనాలు/కాపు కమ్యూనిటీ హాళ్లను గాలి కొదిలేసిందన్నారు.

## శేషవస్త్రం కొనుగోలు టెండరు రద్దు - నూతనంగా కొనుగోలుకు అనుమతి

**తిరుమల,డిసెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి దర్శనంలో భాగంగా ప్రముఖులు, దాతలు, ఆర్జితసేవల భక్తులకు కల్పించే వేదాశీర్వచనంకోసం పట్టుశేషవస్త్రాల సరఫరా టెండర్‌ను టిటిడి రద్దుచేసింది. ఆ స్థానంలో కొత్తవారికి అవకాశం ఇచ్చి అసలైన పట్టువస్త్రాల కొనుగోలుపై దృష్టి సారించింది. గత కొన్నేళ్ళుగా పట్టుదుప్పట శేషవస్త్రంకు బదులు పాలిస్టర్‌తో తయారైన వస్త్రం సరఫరాతో నగరి ఏకాంబరకుప్పానికి చెందిన విఆర్ఎస్ ఎక్స్‌పోర్ట్స్ టెండర్‌ను బోర్డు రద్దుచేసింది. ప్రస్తుతానికి అందుబాటులో ఉన్న వస్త్రాలతోనే వేదాశీర్వచనం చేయాలని నిర్ణయించింది. అంతేగాక పలు సంస్థలతో టిటిడి అధికారులు సంప్రదింపులు చేస్తున్నారు. నకిలీ వస్త్రాలు సరఫరా చేయడంతోనే ఈ చర్యలు తీసుకుంది.

# మైనర్ బాలికను మాదక ద్రవ్యాల ఉచ్చులోకి లాగిన వారిపై కఠిన చర్యలు: ఈగల్ ఐజి ఎకె రవికృష్ణ



**గుంటూరు ఈస్ట్ క్రైమ్, డిసెంబర్ 13, ప్రభాతవార్త:** మైనర్ బాలికకు, ఆమె కుటుంబానికి పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా సమగ్ర దర్యాప్తు చేపట్టి, నిందితులకు సత్వర శిక్ష పడే విధంగా చర్యలు తీసుకుంటామని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ వెల్లడించారు. లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్నబజార్ ప్రాంత నివాసితులైన ఒక దంపతుల కుమార్తె (మైనర్) ఇంటర్మీడియట్ చదువుచుండగా, ఆమెకు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమైన ఇద్దరు యువకులు ప్రేమ పేరుతో ఆమెను నమ్మించి, మాదక ద్రవ్యాల మత్తుకు అలవాటు చేసి, వాటికి బానిసగా మార్చినట్లు ప్రాథమిక విచారణలో వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనతో తీవ్ర మానసిక ఆవేదనకు గురైన బాలిక తల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే గుంటూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే ఈగల్ ఐజీ శ్రీ ఏ.కే. రవికృష్ణ, గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, గుంటూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సందర్శించి, డ్యూటీలో ఉన్న వైద్యుల నుంచి బాధితురాలి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె ఆత్మహత్యాయత్నానికి గల కారణాలపై వివరాలు తెలుసుకుని, బాధ్యులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని బాధిత కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. అదేవిధంగా డ్రగ్స్‌కు బానిసైన మైనర్ బాలికకు అవసరమైన కౌన్సెలింగ్ నిర్వహించి, డీఅడిక్షన్ కేంద్రం ద్వారా చికిత్స అందించి ఆమె సాధారణ స్థితికి చేరుకునేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈగల్ ఏ.కే. రవికృష్ణ మాట్లాడుతూసోషల్ మీడియా ద్వారా మైనర్ విద్యార్థినిని మాదక ద్రవ్యాల ఉచ్చులోకి లాగిన ఘటన అత్యంత తీవ్రమైనదని, ఈ కేసులో బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ తన మాట వినడం లేదని బాలికను ఆమె తల్లి వారించే సరికి బాలిక ఆమెపై తిరగబడిందని, అదే విధంగా ఆమె కొంతకాలంగా డ్రగ్స్ తీసుకుంటుందని తెలుసుకుని ఆ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం జరిగింది. ఆ బాలికకు డ్రగ్స్ ఎక్కడ నుండి వస్తున్నాయి?, ఎవరు ఇస్తున్నారు? అనే కోణంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి విచారించడం జరుగుతుందన్నారు. గడిచిన మూడు నెలల్లో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు సేవిస్తున్న సుమారు 150 మందిని గుర్తించి, వారిపై కేసులు నమోదు చేయడం జరిగింది. ఈ కేసుల్లో మాదక ద్రవ్యాలు ఎక్కడ నుండి వస్తున్నాయి?, ఎవరు తెస్తున్నారు?, ఎవరు విక్రయిస్తున్నారు? అనే కోణంలో దర్యాప్తులు జరుపుతూ బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయడం జరుగుతుంది కొన్ని కాలేజీల్లోని విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతున్నారని మాకు సమాచారం ఉంది.

# వైభవంగా భవానీ దీక్షల విరమణ ఉత్సవాలు



**ఇంద్రకీలాద్రి, డిసెంబర్ 13, ప్రభాత వార్త :** మూడోరోజు భవానీ దీక్షలు విరమణ ఉత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. శనివారం దీక్షధారులు భక్తుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. వారికి సరైన వసతులు, సౌకర్యాలు అందేలా ఇఒ, చైర్మన్ పాలకమండలి, అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. భక్తిశ్రద్ధలతో దీక్షాధారులు ఇరుముడులను శిరస్సున ధరించి దుర్గమ్మవారి ఆలయానికి జై దుర్గా... జైజై దుర్గా నామస్మరణతో చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి ఇరుముడులు భక్తితో సమర్పించుకున్నారు. శ్రీ అమ్మవారు దీక్షల సందర్భంగా అమ్మవారి ప్రత్యేక పూల అలంకరణతో భక్తులను అనుగ్రహించారు. - మూడోరోజు ఆదాయం: దుర్గమ్మవారి ఆలయంలో శ్రీ భవానీ దీక్షల విరమణల సందర్భంగా ప్రసాదాల అమ్మకాలు, కేశఖండన తదితరాల ద్వారా మొత్తం రు,62,09,425ల ఆదాయం లభించిందని ఇఒ తెలిపారు. అదేవిధంగా రెండోరోజైన శుక్రవారం రు.72,16,431ల ఆదాయం లబించిందన్నారు.

# వికసిత్ భారత్ 2047 సాధనకు విద్యారంగంలో ఉపాధ్యాయుల పాత్ర గురుతరం:సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ




ఆంధ్రప్రదేశ్ ప్రాంత అభ్యాస వర్గ (స్టేట్ ఫ్యాకల్టీ ట్రైనింగ్) కార్యక్రమంలో మాట్లాడుతున్న వీవీ లక్ష్మీ నారాయణ

**విజయవాడ,డిసెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** వికసిత భారత 2047 సాధనకు విద్యారంగంలో ఉపాధ్యాయుల పాత్ర గురుతరమని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్, వీవీ లక్ష్మీ నారాయణ అన్నారు. తాడేపల్లి, వడ్డేశ్వరం లోని కే ఎల్ విశ్వవిద్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ (ఏబీఆర్ఎస్ఎం), ఆంధ్రప్రదేశ్ ప్రాంత అభ్యాస వర్గ (స్టేట్ ఫ్యాకల్టీ ట్రైనింగ్) కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర తరగతి నుండి మొదలవుతుందని ప్రాచీన గురు శిష్య విధానం ఎప్పటికీ అనుసరణీయమని, విశేషమైందని అన్నారు. భారత్ అంటేనే సూర్య కాంతి, జ్ఞాన కాంతిల సమ్మేళనం అన్నారు. వేదాల స్పూర్తితో విద్యార్థులను జ్ఞాన సముపార్జన దిశగా ప్రోత్సహించాలన్నారు. గురు శిష్య పరంపర విశేషమైందని విద్యార్థులలో ప్రశ్నించే అలవాటును కలగ చేయాలన్నారు. తర్కం, మీమాంస, భారతీయతత్వం లో ఇమిడి ఉన్నాయన్నారు. విద్యార్థులను చైతన్యవంతులుగా మార్చుతూ ధర్మబద్ధమైన జీవనం ఎలా ఉంటుందో చెప్పాలన్నారు. ఆలోచనా పరిధిని విస్తృతం చేయాలన్నారు. మాతృ భాషను వాడుక భాషనుఅలవరు చుకోవడం అత్యవసరమన్నారు.. పిల్లల్లో సృజనాత్మక శక్తి పెంపొందించాలి, కొత్తగా ఆలోచించడం అవసరం, విలువలు, నైతికత జీవనసాఫల్యతకు ఎంత అవసరమో మార్గదర్శనం చేయవలసిన అవసరం ఉంది అని లక్ష్మీ నారాయణ అన్నారు. కే ఎల్ యు వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్ రావు మాట్లాడుతూ దేశానికి ఉపాధ్యాయులు అందరూ జాతీయ స్పూర్తితో పాటు తమ సబ్జెక్టులో అద్భుతమైన నైపుణ్యాలు కలిగి ఉండి విద్యార్థులు తమ సబ్జెక్టులలో ప్రతిభ కనబరచే విధంగా పనిచేయాలని కోరారు. ఏబీఆర్ఎస్ఎం జాతీయ కార్యదర్శి, ప్రధాన వక్త గుంత లక్ష్మణ్ జీ మాట్లాడుతూ దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే అగ్రగామి ఉపాధ్యాయ సంస్థ అని, భారతదేశంలో ప్రాథమిక దశ నుండి ఉన్నత విద్యా సంస్థల వరకు 15 లక్షల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని తెలియజేశారు. దేశ సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచారాలు, విలువలు, మానవీయత ఆధారంగా విద్యా విధానము ముందుకు వెళ్లాలని తద్వారా మాత్రమే భారత విశ్వ గురువుగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ కే. మధుమూర్తి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ 2047 నాటికి భారతదేశాన్ని విశ్వ గురువు గా మార్చడములో ముఖ్యంగా విద్యా వ్యవస్థ, ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. పరిశ్రమ, వ్యవసాయం, గృహనిర్మాణం, ఆరోగ్యం వంటి రంగాలలో దేశాభివృద్ధికి, సమాజ అవసరాలకు సరిపోయేలా భారతీయ విద్యా వ్యవస్థను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం జాతీయ విద్యా విధానం 2020 తీసుకువచ్చిందని మరియు మరిన్ని ఉద్యోగాలను సృష్టించడం, దేశంలో పేదరికాన్ని నిర్మూలించడం లక్ష్యంగా పని చేస్తుందన్నారు. భారతీయ విద్యా వ్యవస్థను ఆధునీకరించడం లో ప్రాచీన భారతీయ విజ్ఞాన వ్యవస్థ మరియు భారతీయ వారసత్వాన్ని గుర్తించాలన్నారు. వికసిత్ భారత్ ,స్వర్ణాంధ్ర సాధన లో నూతన జాతీయ విద్యా విధానం ప్రముఖమైన పాత్ర పోషిస్తుందని తెలియజేశారు. డిగ్రీ ,ఇంజనీరింగ్ , ఇంటర్మీడియట్ కళాశాలలు, రాష్ట్ర, మరియు కేంద్రీయ విశ్వవిద్యాలయాలు. ఇతర ఉన్నత విద్యా సంస్థల నుండి 200 మంది ప్రతినిధులు రాష్ట్ర అభ్యాస వర్గకు హాజరయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎబిఆర్ ఎస్ఎం ప్రొఫెసర్ డిఎస్వవిఎస్ బాల సుబ్రమణ్యం, డాక్టర్ సంధ్య అధూరి, రాష్ట్ర మహిళా ప్రముఖులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఇంధన సంరక్షణలో ఎపికి నాలుగోసారి పురస్కారం

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ వెల్లడి

## అవార్డు అందుకోనున్న ఎపి ఎస్పీడిసిఎల్ సిఎండి శివశంకర్



**విజయవాడ, డిసెంబర్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం మరోసారి ఎనర్జీ ఎఫిషెన్సీ రంగంలో దేశవ్యాప్తంగా తన ప్రతిభను చాటి చెబుతూ వరుసగా నాలుగో ఏడాది ప్రతిష్ఠాత్మక జాతీయ ఇంధన సంరక్షణ అవార్డుని సాధించిందని, ఇది రాష్ట్రం ఇంధన సంరక్షణ, ఇంధన సామర్థ్య అభివృద్ధి రంగాలలో స్థిరంగా ముందుకు సాగుతున్న పురోగతిని ప్రతిబింబించే అసాధారణమైన మైలురాయి అని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ పేర్కొన్నారు. జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డుల ప్రకటనలో భాగంగా, ఏపీకి జాతీయ స్థాయిలో ప్రథమ అవార్డు లభించిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఈ అరుదైన విజయంతో ఆంధ్ర ప్రదేశ్ దేశంలోనే అత్యంత సృజనాత్మకంగా, అన్ని రాష్ట్రాలకు రోల్ మోడల్ గా ఇంధన సామర్థ్యాన్ని పెంపొందిస్తున్న రాష్ట్రంగా నిలిచిందని చెప్పారు. రాష్ట్రం లోని ప్రభుత్వ భవనాలు, పారిశ్రామిక, మునిసిపల్, వ్యవసాయ, డిస్కం, రవాణా వంటి అన్ని ప్రధాన రంగాలలో రాష్ట్రం ఇంధన సామర్థ్య కార్యక్రమాలలో పురోగతి కనబరచడంతోనే నేషనల్ ఎనర్జీ కన్‌జర్వేషన్ అవార్డు-2025లో గ్రూప్ II విభాగంలో మొదటి స్థానంలో నిలిచి అవార్డు కైవసం చేసుకుందని కె విజయానంద్ వివరించారు. విద్యుత్ రంగం సాధిస్తున్న పురోగతి లోను, విద్యుత్ ఆదా లో రాష్ట్రం సాధించిన ఈ విజయం లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి దూరదృష్టి, గొట్టిపాటి రవికుమార్ గారి సహాయ సహకారాలు ఉన్నాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తెలిపారు. సమగ్ర, విస్తృత, ప్రభావవంతమైన విద్యుత్ ఆదా (ఎనర్జీ కన్‌జర్వేషన్) కార్యక్రమాలను రాష్ట్రంలో అమలు చేయడంలో దేశంలోనే అగ్రస్థానంలో ఏపీ ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పాటు ప్రజల పూర్తి సహకారం తోనే జాతీయ స్థాయిలో ఈ గుర్తింపు సాధ్యమయ్యిందని తెలిపారు. నాలుగేళ్ల వరుసగా ఈ ప్రతిష్టాత్మక అవార్డు సాధించడం ద్వారా రాష్ట్రం యొక్క ఇంధన సంరక్షణ సామర్థంలో ఉన్న సంస్థాగత బలం , నిరంతర కృషి కి నిదర్శనమని, ఈ సందర్భంగా ఏపీఎస్ఈసిఎం సిఈఓ ఎస్. నాగలక్ష్మి, ఎస్ఈసిఎం బృందాన్ని , సంబంధిత ప్రభుత్వ శాఖలను సిఎస్ అభినందించారు. జాతీయ ఇంధన సంరక్షణ దినోత్సవం సందర్భంగా

ఈ నెల 14 న న్యూ ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఏపీఎస్ఈసిఎం కు జాతీయ అవార్డును ప్రదానం చేయనున్నారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తెలిపారు . ఈ అవార్డు స్వీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏపీఎస్పీడీసిఎల్ సిఎండీ ఎల్. శివశంకర్ ని రాష్ట్ర ప్రతినిధిగా నామినేట్ చేసారు.

## 15న జరగాల్సిన జిల్లాస్థాయి పిజిఆర్ఎస్ రద్దు

**విజయవాడ (గన్నవరం), డిసెంబర్ 13, ప్రభాతవార్త :** ఈనెల 15వతేదీ సోమవారం విజయవాడలోని ఎన్‌టిఆర్ జిల్లాకలెక్టర్ కార్యాలయంలో జరగాల్సిన జిల్లాస్థాయి పిజిఆర్ఎస్‌ను రద్దు చేస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జికలెక్టర్ ఎస్. ఇలక్కియ తెలిపారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై భవానిదీక్షల విరమణ కార్యక్రమం సోమవారం వరకు కొనసాగనున్నందున జిల్లా అధికార యంత్రాంగం మొత్తం భవానిదీక్షల కార్యక్రమంలో నిమగ్నమై ఉన్నందున ప్రజాసమస్యల పరిష్కారవేదిక( పిజిఆర్ఎస్)ను రద్దుచేస్తున్నట్లు చెప్పారు. తదుపరి సోమవారం నుండి యధావిధిగా పిజిఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని, అర్జీదారులు తమ అర్జీలను మీకోసం వెబ్‌సైట్‌లోనూ నమోదు చేయవచ్చుని సూచించారు. నమోదైన అర్జీల స్థితి, సమాచారం కోసం 1100 నెంబర్‌కు ఫోన్‌చేసి తెలుసుకోవచ్చని సూచించారు.

## ఎన్‌టిఆర్‌జిల్లాలో 79,503 మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు

**విజయవాడ (గన్నవరం), డిసెంబర్ 13, ప్రభాతవార్త :** ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఎన్‌టిఆర్ జిల్లాలో రైతుల వద్దనుండి 79,503మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఈఏడాది మొత్తం 1,50,000మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్దేశించగా జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన రైతుసేవాకేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 10,514మంది రైతుల నుండి 79,503 మెట్రిక్‌టన్నుల ధాన్నాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసినట్లు జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యానికి రూ.160.62కోట్ల నగదును రైతులకు చెల్లించినట్లు వివరించారు. ధాన్యం కొనుగోలు చేసిన 24గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమచేస్తున్నట్లు చెప్పారు. జిల్లాపై తుఫాన్ ప్రభావం ఉండటంతో కల్లాలోని ధాన్యాన్ని నేరుగా కొనుగోలు చేయటంతోపాటు, 2,200 టార్పాలిన్‌లను రైతులకు ఉచింతంగా అందించినట్లు చెప్పారు. ధాన్యం కోనుగోలులో రైతులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు అధికారులు వివరించారు.

## కోనలో వైభవంగా పెనుశిల లక్ష్మీనృసింహుని కళ్యాణోత్సవం



**రాపూరు (నెల్లూరు), డిసెంబర్ 13, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శనివారం శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున 4.30కి స్వామి వారి మూలమూర్తికి అభిషేకం, గోపూజ, పూలాంగి సేవ నిర్వహించారు. ఉదయం 9.30కి స్వామి వారి ఆస్థాన మండపంలో స్వామి వారికి ఉభయ దేవేరులైన ఆధిలక్ష్మీ, చెంచులక్ష్మీ అమ్మవార్లతో వేదపండితులు, వేద మంత్రోచ్ఛరణలతో స్వామి వారి కళ్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను తిరుచ్చిపై వుంచి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. తదుపరి స్వామి అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన, వసతి ఏర్పాట్లను ఆలయ ఉప కమీషనర్ పొరెడ్డి శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ సూపరిడెంట్ పాలవల్లి లక్ష్మీ నారాయణ, సిబ్బంది నరసింహా, వెంకటసుబ్బయ్య, తదితరులు పర్యవేక్షించారు. స్వామి వారి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా ఆలయ ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి, పెంచల పెంచలయ్య స్వామి, ముఖ్య అర్చక స్వామి గుండ్లూరు శశి స్వామి, అర్చక స్వాములు మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలాజీ స్వామి, వినోద్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి తదితరులు నిర్వహించారు.

# ఆర్ఎస్ఎస్ కృషి నిరూపమానం

చిలకలూరిపేట, డిసెంబర్ 13, ప్రభాతవార్త: దేశ సమగ్రత..సార్వభౌమత్వ పరిరక్షణ, హిందూ సమాజ రక్షణకోసం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్.ఎస్.ఎస్) చేస్తున్న కృషి నిరుపమానమని, భారత్ ను విశ్వగురువుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యసాధనలో ఆర్.ఎస్.ఎస్ చాలావరకు విజయం సాధించిందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. శనివారం చిలకలూరిపేటలోని ఆర్.వి.ఎస్.సీ.వీ.ఎస్ హైస్కూల్ మైదానంలో నిర్వహించిన హిందూ సమ్మేళనంలో పాల్గొన్న ప్రత్తిపాటి.. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీశ్రీ నిత్య విద్యానంద భారతిస్వామి, పూజ్యస్వామి శ్రీ యజ్ఞానంద, ప్రధాన వక్త శ్రీ భాగయ్య గారిని ఘనంగా సత్కరించిన అనంతరం సభను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజాచైతన్యవ్యాప్తిలో ఆర్.ఎస్.ఎస్ అప్రతిహతంగా ముందుకు సాగడం సామాన్యం కాదు హిందూ సమాజాన్ని చైతన్యపరిచి, హిందూధర్మం.. సంస్కృతి గొప్పతనాన్ని భావితరాలకు అందించి, భారతావని కీర్తిప్రతిష్ఠలను విశ్వవ్యాప్తం చేయడానికి కంకణ బద్ధులైన ప్రతి ఒక్కరూ ఎప్పటికీ గౌరవనీయులు.. పూజ్యనీయులేననే సత్యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని ప్రత్తిపాటి సూచించారు. ఆర్.ఎస్.ఎస్ 100 సంవత్సరాల ప్రయాణంలో ఎన్నో ఒడిదొడుకులు, ఆటుపోట్లను ఎదుర్కొని, ప్రజాసేవతో పాటు.. ప్రజా చైతన్య వ్యాప్తిలో అప్రతిహతంగా ముందుకుసాగడం సామాన్య విషయం కాదన్నారు. మనిషిగా పుట్టిన ప్రతి ఒక్కరూ సమాజ హితం, పరుల సంతోషం కోసం పాటుపడాలనే ధర్మాన్ని ఆర్.ఎస్.ఎస్ బోధిస్తోందన్నారు. సంఘ్ సభ్యులు దేశ సైనికులకు ఏమాత్రం తీసిపోరన్నారు. సమాజం కోసం ఆరాటపడి, ఆలోచించే వారిలో స్వార్థం తగ్గిపోయి.. దేశక్షేమం..హితం పెరుగుతాయన్నా రు. కుటుంబవ్యవస్థకు పేరు ప్రఖ్యాతులు పొందిన భారతదేశం నేడు.. సాంకేతికత, మితిమీరిన స్వేచ్ఛ, ప్రతికూల ఆలోచనల వల్ల విచ్ఛిన్నమవుతోందని ప్రత్తిపాటి ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాను పరిధి దాటి జీవితాల్లోకి ఆహ్వానించడమే అన్ని అనర్థాలకు కారణమనే సత్యాన్ని నేటి యువత గ్రహించాలన ప్రత్తిపాటి హితవు పలికారు. సమాజానికి ఉపయోగపడాలనే ఆలోచన ఉంటేనే వ్యక్తులు, వ్యవస్థలు చిరకాలం మనుగడ సాగిస్తాయన్నారు. హిందూ సమాజ బలోపేతం.. సనాతన ధర్మ పరిరక్షణకు కృషి చేయడం అంటే మన కుటుంబం.. మన గ్రామం.. మన రాష్ట్రం.. మన దేశమనే భావనను ఆత్మశుద్ధితో ఆచరించడమే అని ప్రత్తిపాటి సూచించారు.








# సురక్షితంగా గమ్యం చేరిన బస్సు ప్రమాద బాధితులు

## బాధితులకు అండగా నిలిచిన ఎపి ప్రభుత్వం

**చింతూరు డిశంబర్ 13 ప్రభాతవార్త** మన్యం ప్రాంతానికి అనుకోని అతిధులుగా వచ్చి ,వారు ప్రయాణిస్తున్న బస్సు ప్రమాదానికి గురై ఆ బస్సులో ప్రయాణిస్తున్న యాత్రికులు 9 మంది మృతిచెందటం, మరో 21 మంది గాయపడటం చాలా బాధాకరం. ఈ ఘటన చింతూరు -మారేడుమిల్లి ఘాట్‌లో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన విషయం అందరికి తెలిసింది. ప్రమాదం జరిగిన వెంటనే ఎపి ప్రభుత్వం స్పందించి ,భాధితులకు అండగా నిలబడి వారిని ఆదుకోవటంలో ప్రభుత్వం, అధికారులు చేపట్టిన చర్యల పట్ల ప్రతి ఒక్కరు సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రమాద ఘటనపై దిగ్ర్భాంది వ్యక్తం చేస్తూ హూటా హూటిన హోమ్ మంత్రి అనిత, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి ,రంపచోడవరం యంయల్ఎ మిరియాల శిరీషదేవిని ఘటన స్థలానికి పంపించి, క్షతగాత్రులను పరమర్శించి వారికి మెరుగైన వైద్యసేవలు అందేలా చేపట్టిన చర్యల పట్ల క్షతగాత్రులతో పాటు స్థానికులు ప్రభుత్వ చర్యలను అభినందించారు. క్షతగాత్రులతో నిండిన చింతూరు ఏరియా ఆసుపత్రిలో ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి కోటి రెడ్డి, డిప్యూటి డియం అండ్ హెచ్ ఒ పుల్లయ, ఆసుపత్రి వైద్యులు ,సిబ్బంది సేవలను అధికారులు కొనియాడారు. బస్సు ప్రమాదం తెల్లవారుజామున 3గం॥జరిగింది. ఘాట్ రోడ్డులో ఆ సమయంలో పెద్దగా రకపోకలు ఉండవు. ఉదయం 5గం॥ల ప్రాంతంలో చింతూరు యస్.ఐ.రమేష్‌కు ఘాట్ రోడ్డులో బస్సు ప్రమాదం జరిగిందని, చాలా మంది ప్రయాణికులు మృతిచెందినట్టు సమాచారం అందింది. దాంతో వెంటనే స్పందిన ఆయన 108కు సమాచారం అందించి విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశారు.

చింతూరు సిఐ.గోపాల కృష్ణ, చింతూరు యస్.ఐ.రమేష్, మోతుగూడెం యస్.ఐ.సాధిక్ తమ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకోని బస్సుఅద్దాలు పగలగొట్టి ప్రమాద భాధితులను బస్సు నుండి బయటకు తీసి చాలామంది ప్రాణాలను రక్షించారు. అప్పటికే 9మంది ప్రాణాలు కోల్పోవటం చాలా భాధకారం. విషయం తెలుసుకున్న చింతూరు ఐటిడిఎ పివో శుభం నోక్వాల్, చింతూరు ఎయస్‌పి హేమంత్ ఘటన స్థలానికి చేరుకోని పోలీసులు, ఐదు 108ల సహాయంతో క్షతగాత్రులను, మృతదేహాలను చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## అమరావతిలో భూమిలేని పేదల పెన్షన్లపై కీలక నిర్ణయం - త్రిసభ్య కమిటీ పునరాలోచన

**విజయవాడ,డిసెంబరు 13,ప్రభాత వార్తప్రతినిది:..** అమరావతిలో భూమిలేని పేదల పెన్షన్లపై మంత్రుల త్రీసభ్య కమిటీ కీలక నిర్ణయం..4,929 మంది పెన్షన్లపై త్రిసభ్య కమిటీ పునరాలోచన చేసింది. రద్దు అయిన పెన్షన్లపై దరఖాస్తుల స్వీకరణకు దిశీదీతికు గ్రీన్‌సిగ్నల్. అర్హులైన వారికి నెలకు రూ.5 వేల పెన్షన్ ఇచ్చే యోచన. గ్రామసభల సమయంలో అర్జీలు సమర్పించవచ్చుభూమి లేని పేదలకు న్యాయం చేస్తామని ఏపీ త్రిసభ్యకమిటీ నిర్ణయించింది.

## సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డును రాష్ట్ర పాఠశాల ప్రమాణాల అథారిటీ (ఎస్ఎస్ఎస్ఏ)గా ప్రభుత్వ ఉత్తర్వులు

**విజయవాడ,డిసెంబరు 13,ప్రభాతవాక్తప్రతినిధి:** రాష్ట్రంలో పాఠశాలల నాణ్యత మదింపు, హామీ ఫ్రేమ్ వర్క్ అమలు కోసం సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డును రాష్ట్ర పాఠశాల ప్రమాణాల అథారిటీ (ఎస్ఎస్ఎస్ఏ)గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలకు అనుమతులు ఇవ్వడం, వాటి నాణ్యతపైన ఈ అథారిటీ దృష్టి సారిస్తుంది. ఆయా పాఠశాలల్లోని ప్రమాణాల ఆధారంగా ప్రగతి, జాగృతి, అభిలాష అనే గ్రేడ్లను ఇస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాల విద్యా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం, నాణ్యత హామీని పెంపొందించడం, మాధ్యమిక పాఠశాలల్లో కనీస వృత్తిపరమైన నాణ్యతా ప్రమాణాలను పాటించేలా చూడటానికి ఎస్ఎస్ఎస్ఏను నియమించింది. ఇందులో పాఠశాల విద్య కార్యదర్శి ఛైర్మన్ గా, డైరెక్టర్ వైస్ ఛైర్మన్ గా, ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యదర్శి, సమగ్ర శిక్షా ప్రాజెక్టు డైరెక్టర్, ఎస్సీ ఈఆర్టీ డైరెక్టర్ సభ్యులుగా ఉంటారు. ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ మెంబర్ కన్వీనర్ గా వ్యవహరిస్తారు.

## పాఠశాలల అభివృద్ధిలో లోకేశ్ మార్క్ పనితీరు చూస్తున్నాం : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, డిసెంబర్ 13, ప్రభాతవార్త: విద్యాశాఖ మంత్రిగా నారాలోకేశ్ బాధ్యతలు నిర్వరిస్తుండటం ఉపాధ్యాయులకు వరమని, వారి సమస్యలతో పాటు, పాఠశాలల అభివృద్ధిలో ఆయన మార్క్ పనితీరు చూస్తున్నామని, మెగా డీఎస్సీ కల నిజం చేయడం ద్వారా వేలమంది ఆశల్ని, ఆకాంక్షల్ని నెరవేర్చారని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. చిలకలూరిపేటలోని అమరావతి రెసిడెన్సీ నందు నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏపీ ఉర్దూ అకాడమీ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా హాజరై, ఉపాధ్యాయుల్ని సన్మానించిన అనంతరం ప్రత్తిపాటి మాట్లాడారు.

ఏటా డీఎస్సీ నిర్వహిస్తామన్న లోకేశ్ ప్రకటనతో భావి ఉపాధ్యాయుల కలలు నిజం కానున్నాయి.. ఇకపై ఏటా డీఎస్సీ నిర్వహిస్తామన్న మంత్రి లోకేశ్ ప్రకటన ఉపాధ్యాయులు కావాలనుకుంటున్న ఎంతోమంది కలల్ని నిజం చేయబోతోందన్నారు. గత ప్రభుత్వం ఉపాధ్యాయుల్ని చిన్నచూపు చూసిందని, విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్న ప్రత్తిపాటి.. భావితరాలను తీర్చిదిద్దే విద్యాబోధ కులకు సక్రమంగా జీతాలు ఇవ్వకుండా వేధించిందన్నారు.

# గోదావరి పుష్కరాలు 2027 జూన్ 26నుంచి జూలై 7వరకు 12 రోజులు

**విజమవాడ,డిసెంబరు 13,ప్రభాత వార్తప్రతినిధి:** గోదావరి పుష్కరాలు 2027 జూన్ 26నుంచి జూలై 7వరకు (12రోజులు) జరుగుతాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు రెవెన్యూ(ఎండోమెంట్స్) శాఖ జీఓ ఆర్‌టి నెంబరు 1575ను విడుదల చేసింది. తిరుమల తిరుపతి దేవస్థానాల ఆస్థాన సిద్ధాంతి తంగిరాల వెంకట కృష్ణ పూర్ణప్రసాద్ అభిప్రాయాలను పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో తెలిపారు. పుష్కరాల తేదీలను అన్ని శాఖలు, దేవస్థానాలు, జిల్లా యంత్రాంగం పరిగణలోకి తీసుకుని, అవసరమైన ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ఇప్పటికే ఏపీ ప్రభుత్వం గోదావరి పుష్కరాల ఏర్పాట్లు ప్రారంభించింది. పాత ఘాట్‌ల అభివృద్ధి, నూతన ఘాట్‌ల ఏర్పాటు, విశ్రాంతి గదులుతో

గోదావరి తీరంలో పర్యాటక సోగసులను కల్పించే దిశలో కార్యచరణ చేపట్టింది. ఎక్కడిక్కడ భద్రతా చర్యలు చేపట్టే దిశలో ముందుకు వెళ్తుంది., దీంతో రహదారులు, వంతెనల నిర్మాణాలు చేపట్టింది.

## వరాహస్వామి ఆలయ దర్శన వేళలు పొడిగింపు

**తిరుమల,డిసెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలక్షేత్రసాంప్రదాయంలో కీలకమైన భూవరాహస్వామి ఆలయం దర్శన వేళలను పొడిగిస్తూ టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి అనుమతించారు. రోజురోజుకూ తిరుమలకు వస్తున్న భక్తుల రద్దీ పెరగడంతోబాటు వరాహస్వామి దర్శనానికి భక్తులు తొలుత ప్రాదాన్యతనిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ తిరుమలకు వచ్చినపుడు వరాహస్వామి ఆలయాన్ని రాత్రి 8గంటలకే మూసివేశారు. ఈ విషయాన్ని టిటిడి అధికారులకు, మీడియాకు తెలిపారు. వరాహస్వామి ఆలయ వేళలు పొడిగించి భక్తులకు అసౌకర్యం లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు అదనపు ఇఒ వెంకయ్యచౌదరికి సూచించారు. ఇక ఆదివారం నుండి వరాహస్వామి ఆలయం రాత్రి 10గంటలవరకు భక్తులకు దర్శనం కల్పించేలా వేళల్లో మార్పులు చేయడంతో భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

# తల్లి,కూతుళ్ల మధ్య డ్రగ్స్ వివాదం- తల్లి ఆత్మహత్యాయత్నం


**గుంటూరు, డిసెంబర్ 13, ప్రభాతవార్త ప్రతినిధి:** తల్లి, కూతుళ్ల మధ్యలో డ్రగ్స్ వివాదాన్ని రేపాయి. కూతురు చెప్పిన మాట వినటం లేదని తల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడమే కాకుండా కూతురు డ్రగ్స్ బానిసైందని ఫిర్యాదు చేయడం కలకలం రేపింది. కూతురు మాత్రం ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని ఆరోపిస్తుంది. దీంతో ఉన్నతాధికారులు రంగంలోకి దిగి కేసు దర్యాప్తు చేపట్టారు. గుంటూరు ఆర్టిసి కాలనీకి చెందిన స్వప్న, రాజేష్ దంపతులకి ఇంటర్ మొదటి ఏడాది చదువుతున్న కుమార్తె ఉంది. స్వప్న హైదరాబాద్‌లో యాంకర్‌గా పనిచేస్తుంది. అయితే కొన్ని రోజులుగా కుమార్తె ప్రవర్ధన అనుమానాస్పదంగా ఉండటంతో ఆమెపై తల్లి దండ్రులు దృష్టి పెట్టారు. ఈ క్రమంలోనే కూతురికి కౌశిక్ అనే యువకుడితో పరిచయం ఉన్నట్లు తేలింది. ఇన్ స్టాలో పరిచయమైన కౌశిక్‌తో మైనర్ చనువుగా ఉన్నట్లు గుర్తించారు. ఈక్రమంలోనే తమ కుమార్తెకు పెళ్లి చేసేందుకు సిద్ధమయ్యారు. అయితే తల్లిదండ్రుల పెళ్లి చేసుకునేందుకు భూమిక ఇష్టపడలేదు. దీంతో శుక్రవారం రాత్రి భూమిక ఫోన్ తీసుకున్న తల్లిదండ్రులు తమ కుమార్తె డ్రగ్స్‌కు బానిసైనట్లు గుర్తించారు. తప్పుడు మార్గంలో ప్రయాణిస్తుందని తనతో గొడవకు దిగారు. తల్లిదండ్రులను టీనేజర్ ఎదిరించి మాట్లాడటంతో తల్లి కుమార్తెను కొట్టింది. ఇద్దరి మధ్య వివాదం మధ్య వివాదం ముదరడంతో మనస్థాపానికి గురైన తల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుమార్తెను డ్రగ్స్ కు బానిస చేసి ఆమెతో చనువుగా ఉంటూ డ్రగ్స్ వినియోగిస్తున్న వీడియోస్ కూడా ఉన్నట్లు తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ క్రమంలోనే ఈ పిర్యాదుపై పోలీసు శాఖ అప్రమత్తమైంది. జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న తల్లి స్వప్నను ఈగిల్ చీఫ్ ఆకే రవికృష్ణ, గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పరామర్శించారు. ఇద్దరి స్టేట్‌మెంట్స్ తీసుకున్నామని కేసును దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు. స్వప్న కుమార్తె డ్రగ్స్ తీసుకున్నట్లు ప్రాథమిక సమాచారం ఉన్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ చెప్పారు. కేసు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

14-12pg12 GNT_14-12pg10.qxd 13/Dec/25 10:23 PM Page 1




ఆట

## జాతీయ రెజ్లింగ్ ఛాంపియన్‌గా పంగల్



**న్యూఢిల్లీ:** జాతీయ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్-2025, భారత్ రెజ్లర్ ఆంటిమ్ పంగల్ ఛాంపియన్‌గా నిలిచింది. అహ్మదాబాద్‌లో జరిగిన జాతీయ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఆంటిమ్ మహిళల 55 కిలోల బంగారు పతక విజేత అయింది. తొలి రోజున పది మహిళల వెయిట్ కేటగిరీలకు సంబంధించిన పోటీలు జరిగాయి. ఆంటిమ్, మనీషా, మాన్సి, ప్రియా మాలిక్, నిషా దహియా, కిరణ్ వంటి అగ్రశ్రేణి రెజ్లర్లు పోటీలో పాల్గొన్నారు. ఆంటిమ్, మనీషా (57 కిలోలు), మరియు నిషా (68 కిలోలు) వారి వారి విభాగాలలో బంగారు పతకాలు సాధించారు. 76 కిలోల విభాగంలో ప్రియా మాలిక్ హర్యానాకు చెందిన జ్యోతి బెర్వాల్ చేతిలో ఓడిపోయి రజత పతకాన్ని గెలుచుకుంది. ప్రపంచ ఛాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత మాన్సి, జాతీయ స్థాయిలో 62 కిలోల విభాగంలో కూడా కాంస్య పతకంతో సంతృప్తి చెందాల్సి వచ్చింది. కాగా హర్యానా 190 పాయింట్లతో మహిళల జట్టు టైటిల్‌ను కైవసం చేసుకుంది.

## స్క్వాష్ ప్రపంచ కప్ సెమీఫైనల్స్‌కు భారత్
### దక్షిణాఫ్రికాపై 3-0తో గెలుపు



**న్యూఢిల్లీ:** క్వార్టర్ ఫైనల్స్‌లో దక్షిణాఫ్రికాపై 3-0 తేడాతో విజయం సాధించిన భారత్ 2025 ఎస్‌డిఎటి స్క్వాష్ ప్రపంచ కప్ సెమీఫైనల్‌కు చేరుకుంది. సెమీఫైనల్లో భారత్ ప్రస్తుత ఛాంపియన్ ఈజిప్టుతో తలపడనుంది. అనుభవజ్ఞురాలైన జోష్నా చిన్నప్ప టీగన్ రస్సెల్‌పై సునాయాస విజయంతో ఆతిథ్య జట్టుకు తొలి ఆధిక్యాన్ని అందించింది. కామన్వెల్త్ గేమ్స్ పతక విజేతకు 3-0 (7-4, 7-4, 7-2) తేడాతో తొలి టైను ముగించడంతో ఆమె విజయం దాదాపుగా ఖరారైంది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 29వ స్థానంలో ఉన్న భారత పురుషుల స్క్వాష్ ఆటగాడు అభయ్ సింగ్ కూడా రెండవ టైలో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చాడు. రెండవ గేమ్‌లో డెవాల్డ్ చేతిలో 2-4తో వెనుకబడినప్పటి దాని నుండి కోలుకుని రెండవ గేమ్‌ను 7-6తో గెలుచుకున్నాడు. చివరికి అతను దక్షిణాఫ్రికా ఆటగాడిని 3-0 (7-1, 7-6, 7-1)తో ఓడించాడు. టోర్నమెంట్‌లో అతి పిన్న వయస్కుడైన అనహత్ సింగ్, హేలీ వార్డ్‌ను 3-0 (7-3, 7-3, 7-4) తేడాతో ఓడించి సెమీఫైనల్‌కు చేరుకునేలా చేశాడు. అంతకుముందు పూల్ స్టేజ్ మ్యాచ్‌లలో, భారత్ తన మొదటి టైలో స్విట్జర్లాండ్‌ను 4-0 తేడాతో ఓడించింది. రెండవ పూల్ స్టేజ్ మ్యాచ్‌లో బ్రెజిల్‌ను 3-0 తేడాతో ఓడించింది.

### విశ్వ సముద్ర ఓపెన్‌లో
## యువరాజ్‌కు టైటిల్




**న్యూఢిల్లీ:** విశ్వ సముద్ర ఓపెన్ 2025లో 6 షాట్ల తేడాతో యువరాజ్ సంధు ఆరో సీజన్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. భారత్‌కు చెందిన 28 ఏళ్ల యువరాజ్ 2025 పిజిటిఐ ఆర్డర్ ఆఫ్ మెరిట్ ఛాంపియన్‌గా నిలిచాడు. అంతేకాకుండా వచ్చే ఏడాది డిపి వరల్డ్ టూర్‌లో తన స్థానాన్ని ఖరారు చేసుకున్నాడు. ఈ టోర్నీలో రన్నరప్ స్థానం నుండి తిరిగి వచ్చిన సంధు ప్రతిష్టాత్మక ఢిల్లీ గోల్ఫ్ క్లబ్‌లో ఆరు అండర్ 66 చివరి రౌండ్‌తో ఎనిమిది షాట్‌లతో అద్భుతమైన విజయాన్ని నమోదు చేశాడు. ఒక షాట్ ఆధిక్యంతో రోజును ప్రారంభించిన సంధు మొదటి రెండు హోల్స్‌లో బర్డీలతో టైటిల్ వైపు తొలి అడుగులు వేశాడు. అక్కడ అతను బంకర్ నుండి పైకి క్రిందికి 12 అడుగుల కన్వర్షన్ చేశాడు. ఆ తర్వాత మరో నాలుగు బర్డీలను జోడించి తన కెరీర్‌లో 15వ టైటిల్‌ను సాధించాడు. భారత్‌కు చెందిన యువరాజ్ వరుసగా రెండోసారి బోగీ లేకుండా 66 పరుగులు చేసి, ఆ వారం మొత్తం 14అండర్ 274 పరుగులు చేశాడు. ఫలితంగా, సంధు రూ.30 లక్షల విలువైన విజేత చెక్కును అందుకుని పిజిటిఐ ర్యాంకింగ్‌లో తిరుగులేని ఆధిక్యాన్ని సాధించాడు. 2021లో విరాజ్ మదప్ప నెలకొల్పిన డిజిసిలో అత్యల్ప విజయ స్కోరు (14అండర్ 274) రికార్డును కూడా యువరాజ్ సమం చేశాడు. శ్రీలంకకు చెందిన ఎన్. తంగరాజా తన చివరి రౌండ్ 68 తర్వాత సిక్స్ అండర్ 282తో రన్నరప్‌గా నిలిచాడు. పిజిటిఐ ర్యాంకింగ్‌లో రెండు స్థానాలు ఎగబాకి రెండవ స్థానానికి చేరుకున్నాడు. అలాగే అక్షయ్ శర్మ (ఐదుఅండర్ 283), మను గందాస్ (మూడుఅండర్ 285), రషీద్ ఖాన్ (రెండుఅండర్ 286) వరుసగా మూడు, నాలుగు మరియు ఐదవ స్థానాల్లో నిలిచారు.







### డబ్ల్యుటిసి పాయింట్స్:
## భారత్‌కు భారీ షాక్
### న్యూజిలాండ్ దెబ్బకు 6వ స్థానం

**న్యూఢిల్లీ:** వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ తాజా పాయింట్స్ టేబుల్‌లో భారత జట్టుకు భారీ నష్టం జరిగింది. న్యూజిలాండ్ తమ రెండవ టెస్ట్ మ్యాచ్‌లో వెస్టిండీస్‌ను 9 వికెట్ల తేడాతో ఓడించి, పట్టికలో అనూహ్యంగా ముందుకు దూకింది. ఈ పరిణామాల కారణంగా భారత జట్టు మరింత వెనుకబడింది. ప్రస్తుతం పాయింట్స్ టేబుల్‌లో పాకిస్తాన్ కూడా భారత్ కంటే ముందు ఉండటం గమనార్హం. వెస్టిండీస్‌పై విజయం సాధించిన తరువాత న్యూజిలాండ్ ఆరో స్థానం నుంచి మూడవ స్థానానికి చేరుకుంది. 2023 వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ విజేత ఆస్ట్రేలియా 100 పాయింట్స్ శాతంతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ప్రస్తుతం ఆస్ట్రేలియా యాషెస్ 2025-26 సిరీస్‌లో ఇంగ్లండ్‌పై 2-0 ఆధిక్యంలో ఉంది. ఇక ఇటీవల భారత్‌ను వారి సొంత గడ్డపై టెస్ట్ సిరీస్‌లో 2-0 తేడాతో క్లీన్ స్వీప్ చేసిన సౌతాఫ్రికా 2వ స్థానంలో ఉంది. వెస్టిండీస్‌పై గెలుపుతో న్యూజిలాండ్ మూడవ స్థానాన్ని దక్కించుకుంది. ఈ మార్పుల కారణంగా శ్రీలంక కూడా ఒక స్థానం దిగజారి నాలుగో స్థానానికి పడిపోయింది. న్యూజిలాండ్ దూకుడు కారణంగా భారత్ ఆరో స్థానానికి పడిపోయింది. ప్రస్తుతం భారత్ కేవలం 48.15 పాయింట్స్ శాతంతో ఉంది. అగ్రస్థానంలో ఉన్న ఆస్ట్రేలియా 100 పాయింట్స్ శాతంతో ఉండటం వల్ల టీమిండియా వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరుకునే ఆశలు తగ్గుతున్నాయి. అంతేకాకుండా పాయింట్స్ టేబుల్‌లో పాకిస్తాన్ కూడా భారత్ కంటే ముందు ఐదవ స్థానంలో ఉంది. ఒకవేళ యాషెస్ సిరీస్‌లో మిగిలిన 3 మ్యాచ్‌లలో ఇంగ్లండ్ గనుక పుంజుకుంటే, భారత జట్టు ఏకంగా ఏడవ స్థానానికి కూడా పడిపోయే ప్రమాదం ఉంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ప్రస్తుత సైకిల్‌లో భారత్ ఇప్పటివరకు 9 టెస్టులు ఆడి కేవలం నాలుగు విజయాలు మాత్రమే నమోదు చేసింది. భారత జట్టు ఇప్పుడు దాదాపు 8 నెలల పాటు ఎలాంటి టెస్ట్ సిరీస్ ఆడదు. టీమిండియా తదుపరి టెస్ట్ సిరీస్ ఆగస్టు 2026 లో శ్రీలంకతో జరగనుంది. 2027 వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలంటే, భారత్ మిగిలిన మ్యాచ్‌లలో అత్యధికంగా గెలవాల్సిన అవసరం ఉంది.

### ఒడిశా మాస్టర్స్‌లో ఫైనల్‌కు
## ఉన్నతి, ఇషారాణి, కిరణ్

**న్యూఢిల్లీ:** ఒడిశా మాస్టర్స్-2025లో భారత్ షట్లర్లు ఉన్నతి హుడా, ఇషారాణి బారువా ఆల్ ఇండియన్ మహిళల సింగిల్స్ ఫైనల్‌కు, పురుషుల సింగిల్స్ విభాగంలో కిరణ్ జార్జ్ ఫైనల్‌కు చేరుకున్నారు. శనివారం జరిగిన ఒడిశా మాస్టర్స్ సూపర్ 100 టోర్నమెంట్‌లో ఇషారాణి, ఉన్నతి గెలుపొందారు. ఇషారాణి 18-21, 21-7, 21-7తో తాన్య హేమంత్‌ను ఓడించగా, టీనేజర్ ఉన్నతి 18-21, 21-16, 21







-16తో తస్నిమ్ మీర్‌ను ఓడించింది. జర్మనీలో జరిగిన సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ మరియు హైలో ఓపెన్‌లలో వరుసగా రెండు సెమీఫైనల్స్‌లో నిష్క్రమించిన తర్వాత ఉన్నతి ఈ సంవత్సరంలో తన తొలి ఫైనల్‌కు చేరుకుంది. అలాగే పురుషుల సింగిల్స్‌లో అనుభవజ్ఞుడైన కిరణ్ జార్జ్ సెమీస్‌లో 21-19, 8-21, 21-18 తేడాతో రౌనక్ చుహాన్‌ను ఓడించి టైటిల్ కోసం పోరాడనున్నాడు. ఆదివారం జరిగే ఫైనల్లో అతను ఇండోనేషియాకు చెందిన 19 ఏళ్ల ముహమ్మద్ యూసుఫ్‌తో తలపడనున్నాడు. తన తోటి ఇండోనేషియా ఆటగాడు బిస్మో ఒక్టోరాపై వరుస గేమ్‌లలో విజయం సాధించిన తర్వాత యూసుఫ్ ఫైనల్‌కు చేరుకున్నాడు. మరోవైపు, భారత యువ మిక్స్‌డ్ డబుల్స్ జోడీ సాత్విక్ కనపురం-రేషికా ఉతయసూరియన్ సెమీఫైనల్లో ఇండోనేషియా జంట చేతిలో ఓడిపోయింది.

వాణిజ్యం

## వడ్డీరేట్లు తగ్గించిన ఎస్‌బిఐ




**న్యూఢిల్లీ, డిసెంబరు 13:** దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తన కీలక రుణ రేట్లతో పాటు ఎంపిక చేసిన టర్మ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను స్వల్పంగా తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఈ కొత్త రేట్లు ఈ నెల 15 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ నిర్ణయంతో గృహ, వాహన, ఎంఎస్‌ఎంఈ రుణాల ఈఎంఐల భారం తగ్గనుంది. అన్ని కాలపరిమితులపై మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేటు (ఎంసీఎల్ఆర్)ను 5 బేసిస్ పాయింట్ల మేర ఎస్‌బీఐ తగ్గించింది. దీంతో ఏడాది కాలపరిమితి గల ఎంసీఎల్ఆర్ 8.70 శాతానికి చేరింది. అలాగే ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేటు (ఈబీఎల్ఆర్)ను 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 7.90 శాతంగా నిర్ణయించింది. పాత రుణ గ్రహీతలకు వర్తించే బేస్ రేటును కూడా 10.00 శాతం నుంచి 9.90 శాతానికి తగ్గించింది. మరోవైపు రూ.3 కోట్ల లోపు రిటైల్ టర్మ్ డిపాజిట్లపై కూడా వడ్డీ రేట్లను సవరించింది. 2 నుంచి 3 ఏళ్లలోపు డిపాజిట్లపై వడ్డీని 6.45 శాతం నుంచి 6.40 శాతానికి తగ్గించింది. సీనియర్ సిటిజన్లకు ఇదే కాలపరిమితిపై వడ్డీ రేటు 6.95 శాతం నుంచి 6.90 శాతానికి తగ్గింది. ప్రజాదరణ పొందిన అమృత్ వృష్టి 444రోజుల డిపాజిట్ పథకంపై వడ్డీ రేటును 6.60 శాతం నుంచి 6.45 శాతానికి తగ్గించింది. ప్రభుత్వ రంగ బ్యాంకుల ఆర్థిక పనితీరు మెరుగుపడటంతో 2022-23 ఆర్థిక సంవత్సరం నుంచి వాటికి ప్రభుత్వం ఎలాంటి మూలధనం అందించలేదని ఇటీవలే కేంద్రం ప్రకటించింది.


### జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీకి
## రూ.330 కోట్లు జరిమానా




**కాలిఫోర్నియా, డిసెంబరు 13:** ప్రముఖ ఫార్మా దిగ్గజం జాన్సన్ అండ్ జాన్సన్‌కు అమెరికా కోర్టులో మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ సంస్థకు చెందిన బేబీ పౌడర్ వాడకం వల్ల తమకు ఒవేరియన్ క్యాన్సర్ వచ్చిందని ఇద్దరు మహిళలు దాఖలు చేసిన కేసులో వారికి అనుకూలంగా తీర్పు వెలువడింది. క్యాన్సర్ ముప్పు గురించి వినియోగదారులను హెచ్చరించడంలో కంపెనీ విఫలమైందని నిర్ధారించిన కాలిఫోర్నియా జ్యూరీ, బాధితులకు 40 మిలియన్ డాలర్లు (సుమారు రూ.330 కోట్లు) నష్టపరిహారంగా చెల్లించాలని ఆదేశించింది. ఈ తీర్పు ప్రకారం ఒక బాధితురాలికి 18 మిలియన్ డాలర్లు, మరో బాధితురాలికి 22 మిలియన్ డాలర్లు పరిహారంగా అందుతాయి. దశాబ్దాలుగా తాము జాన్సన్ అండ్ జాన్సన్ బేబీ పౌడర్‌ను వాడుతున్నామని, దానిలో ఉన్న ఆరోగ్య ప్రమాదాల గురించి తమకు తెలియదని బాధితులు తమ పిటిషన్‌లో ఆరోపించారు. వారి వాదనలతో ఏకీభవించిన జ్యూరీ ఈ మేరకు తీర్పు ఇచ్చింది. టాల్క్ ఆధారిత బేబీ పౌడర్ భద్రతకు సంబంధించి జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీ న్యాయపరమైన చిక్కులను ఎదుర్కోవడం ఇదే మొదటిసారి కాదు. గతంలో కూడా ప్రపంచవ్యాప్తంగా వేలాది కేసులు దాఖలు కాగా, పలు తీర్పులు కంపెనీకి వ్యతిరేకంగా వచ్చాయి. తాజా తీర్పుతో సంస్థకు మరోసారి చట్టపరంగా ఇబ్బందులు తప్పలేదు.

## ఐపిఒల హవా!
### లిస్టింగ్‌తో మరికొన్ని మార్కెట్ ఎంట్రీ!

**ముంబయి, డిసెంబరు 13:** స్టాక్ మార్కెట్లలో ఐపిఒల హవా కొనసాగుతోంది. కొత్త ఐపిఒల కొనుగోళ్లు,మరోవైపు కంపెనీల లిస్టింగ్‌లతో వచ్చేవారం అంటే 15-19 తేదీలమధ్య సందడి వాతావరణం కనిపించనున్నది. మెయిన్‌బోర్డునుంచి ఒకే ఒక్క సంస్థ పబ్లిక్ ఇష్యూకు సిద్ధం అవుతుండగా కొరోనా రెమిడీస్, వేక్‌ఫిట్;ఐసిఐసిఐప్రుడెన్షియల్ ఎఎంసి వంటి సంస్థలు లిస్టింగ్‌కు రానున్నాయి. దీనితో కొత్త ఇష్యూలకంటే లిస్టింగ్‌లపైనే ఎక్కువ మందికి ఆసక్తి నెలకొంది. కెఎస్‌హశ్రీచ్ ఇంటర్నేషనల్ ఒక్కటే వచ్చేవారం మెయిన్‌బోర్డు కేటగిరీలో కొనుగోళ్లకువస్తోంది. ఆఫర్‌ఫర్‌సేల్ కలిపి మొత్తం




రూ.700 కోట్లు సమీకరించాలనినిర్ణయించింది. ఇష్యూ ఈనెల 16రన ప్రారంభం అయి 18న ముగుస్తుంది. రూ.365 నంచి రూ. 384గా ధరలునిర్ణయించారు. బిఎస్‌ఇ ఎన్‌ఎస్‌ఇల్లో ఈషేర్లు లిస్ట్ అవుతాయి. ఎస్‌ఎంఇ సెగ్మెంట్‌లో మొత్తంమూడు కంపెనీలు వచ్చేవారం ఐపిఒకు వస్తున్నాయి. నప్ప్యూట్ లాజిటెక్ ఈనెల 15న ప్రారంభం అవుతుంది. మార్క్ టెక్నోక్రాట్స్, గ్లోబల్ ఓషన్ లాజిస్టిక్స్ కొనుగోళ్లు ఈనెల 17న ప్రారంభం అవుతాయి. ఇక మెయిన్‌బోర్డు కేటగిరీలో కొరోనా రెమిడీస్ ఫర్నిచర్ సంస్థ వేక్‌ఫిట్ ఇన్నొవేషన్ 15న స్టాక్ ఎక్చేంజిల్లో లిస్ట్ అవుతాయి. కొరోనా ఏకంగా 144 రెట్లు బిడ్డు అందుకుంది. వేక్‌ఫిట్ 2.52 రెట్లు కొనుగోలు అయింది. అదేరోజు రిద్ధి డిస్‌ప్లే, ప్రొడాక్స్ సొల్యూషన్స్, కెవిటాయ్స్ షేర్లు ఎస్‌ఎంఇ కేటగిరీనుంచి ఎంట్రీ ఇస్తాయి. మెయిన్‌బోర్డులో నెఫ్రోకేర్ హెల్త్, పార్క్ మెడివరల్డ్ 17న లిస్టింగ్‌కు వస్తాయి. యునిసెమ్ అగ్రిటెక్, షిప్‌వేవ్స్ ఆన్‌లైన్ ఎస్‌ఎంఇ కేటగిరీలో మార్కెట్ ఎంట్రీ సిత్తాయి. పాజ్సన్ ఆగ్రో, హెచ్‌ఆర్‌ఎస్ అలుగ్లేజ్ ఎస్‌ఎంఇ కేటగిరీలోనే 18న లిస్ట్ అవుతాయి.

ఇక ఐసిఐసిఐప్రుడెన్షియల్ ఐపిఒ 19న లిస్టింగ్‌కు వస్తోంది. ఒకోషేరుధరల శ్రేణి 2061నుంచి 2165 రూపాయలుగా కంపెనీ నిర్ణయించింది. 19న లిస్టంగ్‌కు వస్తోంది. ఈ కంపెనీతోపాటే స్టాన్‌బిక్ ఆగ్రో, అశ్విని కంటెయినర్; ఎగ్జిమ్‌రూట్ కంపెనీలు ఎస్‌ఎంఇ సెగ్మెంట్‌లో మార్కెట్‌కు రానున్నాయి.




### గుర్తింపులేని క్లెయిమ్‌లపై
## ఐటిశాఖ నజర్
### పన్ను చెల్లింపుదారులకు సిబిడిటి హెచ్చరికలు

**న్యూఢిల్లీ, డిసెంబరు 13:** విరాళాలపేరిట చేసిన నకిలీ క్లెయిమ్‌లుచేసిన వారిపై ఇపుడు ఆదాయపు పన్నుశాఖ నిఘా పెంచింది. గుర్తింపులేని రాజకీయ పార్టీలు, ఛారిటీలకు విరాళాలపేరిట నకిలీ క్లెయిమ్‌లు ఎక్కువ వస్తున్నట్లు ఐటిశాఖ గుర్తించింది. ఇలాంటి వారిని గుర్తించి ఎస్‌ఎంఎస్‌లు, ఈమెయిల్స్ పంపిస్తున్నట్లు ఆశాఖ శనివారం ప్రకటించింది. పన్నుభారం తగ్గించుకోడానికి పెద్దసంఖ్యలో బోగస్ విరాళాలుచూపిస్తూ క్లెయిమ్‌లు నమోదయ్యాయని కొందరురిఫండ్లు కూడా క్లెయిమ్‌చేసినట్లు కేంద్ర ప్రత్యక్ష పన్నులబోర్డు ప్రకటించింది. ఈ పన్నుచెల్లింపుదారుల రిజిస్టరు మొబైల్ నంబర్లకు ఈనెల 12వ తేదీనుంచి సందేశాలు పంపిస్తున్నట్లు ఆర్థికశాఖప్రకటించింది. బోగస్ క్లెయిమ్‌లు దాఖలుచేసిన పన్ను చెల్లింపరదారులు తప్పులు సరిదిద్దుకునే అవకాశం కల్పిస్తున్నటట్లు చెప్పిన మంత్రిత్వశాఖ ఆ క్లెయిమ్‌లు విత్‌డ్రాచేసుకుని ఐటిఆర్‌లు అప్‌డేట్‌చేసుకోవాలనిసూచించింది. రిజిస్టరు అయిన గుర్తింపులేని రాజకీయ పార్టీలో అంటే ఆర్‌యుపిపిలు చాలావరకూ పన్నులు ఫైల్‌చేయడంలేదని, రిజిస్టర్డు చిరునామాల్లో ఎలాంటి కార్యకలాపాలు లేవని, ఎలాంటి రాజకీయ కార్యకలాపాల్లోను పాల్గొనడంలేదని సిబిడిటి గుర్తించింది. ఈ పార్టీలు నిధులు అక్రమంగా తరలింపు హవాలా లావాదేవీలు, సీమాంతర చెల్లింపులు బోగస్‌రసీదులు జారీ వంటి వాటిలో నిమగ్నం అయినట్లు గుర్తించింది. ఇలాంటి పార్టీలు, ట్రస్ట్‌లపై సోదాలునిర్వహిస్తే వ్యక్తుల బోగస్ విరాళాలు, కంపెనీల బోగస్ సిఎస్‌ఆర్‌ల గుట్టు మొత్తం బయటపడింది.

## బిఎస్ఇ-ఇండియాపోస్ట్ ఒప్పందం
### మ్యూచువల్ ఫండ్స్‌పై ప్రజలకు అవగాహన

**న్యూఢిల్లీ, డిసెంబరు 13:** బాంబేస్టాక్ ఎక్చేంజి, ఇండియాపోస్ట్‌లు మ్యూచువల్ ఫండ్స్ సేవలందించేందుకు అవగాహన ఒప్పందంచేసుకున్నాయి. దేశవ్యాప్తంగా ఇండియాపోస్ట్ సేవలను అనుసరించి మూచువల్‌ఫండ్ సేవలు అందుకోవచ్చని ఈ ఒప్పందం సారాంశం. ఆర్థిక సేవల ఉత్పత్తులు అందుబాటులో లేని మిలియన్లకొద్దీపౌరులకు ఈ సేవలు చేరువచేస్తాయని చెపుతున్నారు. ఎంపికచేసిన పోస్టల్ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చి ఎంఎఫ్ పంపిణీదారులుగా వారిని రూపొందిస్తారు. పోస్టల్ సిబ్బంది కస్టమర్లకు తగు సూచనలు, సలహాలిస్తూ పెట్టుబడుల నిర్ణయాలపై వారికి చేదోడుగా ఉంటారు. వారి లావాదేవీల నిర్వహణలో సాయం చేస్తారు. బిఎస్ఇ స్టార్ ఎంఎఫ్ పేరిట దేశంలోనే అతిపెద్ద మూచువల్‌ఫండ్ ప్లాట్‌పామ్‌పై ఈ లావాదేవీలునిర్వహిస్తారు. రెండుసంస్థలు చేసుకున్న ఒప్పందం మూడేళ్ల పాటు అమలులో ఉంటుంది. 2025 డిసెంబరు 12నుంచి 2028




డిసెంబరు 11వ తేదీవరకూ ఈ ఒప్పందం లమలులో ఉంటుందని ఉన్నతాధికారులు తెలిపారు. అధీకృత సిబ్బంది ఎంప్లాయీ యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్స్ ఈయుఐఎన్‌లు కూడా అందచేస్తారు. ఈ ఒప్పందం అనుసరించి బిఎస్ఇ పోస్టల్ ఉద్యోగులకు ఎన్ఃఎస్ఎం మూచువల్‌ఫండ్ పంపిణీదారుడిగా సర్టిఫికేట్ కూడా జారకీచేస్తుంది. మొదటి విడతగా రెండు,మూడోశ్రేని పట్టణాలకు అందుతాయి. మారు మూల గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఈసేవలు అందిస్తాయి. శిక్షణపొందిన పోస్టల్ ఉద్యోగులే ఇందుకు మార్గదర్శకులుగా ఉంటారు.




### కొత్త సంవత్సరంలో బిఎస్ఇ, ఎన్ఎస్ఇలకు
## సెలవులు ఇవే!

**న్యూఢిల్లీ, డిసెంబరు 13:** కొత్తకేలండర్ సంవత్సరానికి సంబంధించి స్టాక్ మార్కెట్ల సెలవుల జాబితా బిఎస్ఇ, ఎన్ఎస్ఇలు విడుదలచేసాయి. వారాంతాల్లోకాకుండా 2026 సంవత్సరం మొత్తంమీద పండుగలు,ఇతర ప్రధాన రోజులకారణంగా 15రోజులు సెలవులు ఉన్నాయి.ఈక్విటీట్రేడింగ్స్, డెరివేటివ్స్, సెక్యూరిటీస్ కార్యకలాపాలు నిలిచిపోతాయి. ఆయా తేదీలప్రకారం పెట్టుబడి, ట్రేడింగ్ వ్యూహాలనున సిద్ధంచేసుకోవాలని స్టాక్ ఎక్చేంజిలు సూచించాయి. జనవరి 26 రిపబ్లిక్‌డే సందర్భంగా బిఎస్ఇ ఎన్ఎస్ఇలకు సెలవు. మార్చి 3న హోలి మార్చి 25న శ్రీరామ నవమి, మార్చి 31న మహావీర్‌జయంతి సందర్భంగా మార్కెట్లు శెలవులో ఉంటాయి. ఇక ఏప్రిల్3న గుడ్‌ఫ్రైడే, 14న డా బిఆర్ అంబేడ్కర్ జయంతి, మే 1న మహారాష్ట్రడే, మే 28న బక్రీద్, జూన్ 26న మొహర్రం సందర్భంగా ఆయారోజుల్లో స్టాక్ మార్కెట్లకు సెలవు.మళ్లీ సెప్టెంబరు 14న వినాయక చవితి, అక్టోబరు 2న మహాత్మాగాంధీజయంతి, అక్టోబరు 20న దసరా సందర్భంగా స్టాక్ మార్కెట్లు రెండింటికీ సెలవులుంటాయి. డిసెంబరు 25న క్రిస్మస్‌సందర్భంగా కార్యకలాపాలు కూడా నిలిచిపోతాయి. అయితే మహాశివరాత్రి ఫిబ్రవరి 15న,ఈత్ ఉల్‌ఫితర్ మార్చి 21వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్టు 15, నవంబరు 8 దీపావళి లక్ష్మీపూజ శని, ఆదివారాల్లో వస్తున్నాయి. ఆరోజుల్లో స్టాక్ మార్కెట్లకు ఎలాగూ సెలవు దినాలే. దీపావళి లక్ష్మీపూజ ఆదివారం కావడంతో అదేరోజు మూతర్‌ట్రేడింగ్ నిర్వహిస్తారు. ట్రేడింగ్ సమయాన్నికొద్దిరోజులముందు మాత్రమే ప్రకటిస్తారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14